ఆంధ్రజ్యోతి

5 ANDHRAJYOTHY ప్రకాశం జిల్లా వార్తలు

మంగళవారం 2, డిసెంబరు 2025



దిత్వా ముప్పు తప్పింది!

- చిరుజల్లులకే పరిమితమైన తుఫాన్
- ఊపిరిపీల్చుకున్న ప్రజలు, యంత్రాంగం
- మంగు వాతావరణంపై రైతుల ఆందోళన

ఒంగోలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు దిత్వా తుఫాన్ ముప్పుతప్పింది. చిరుజల్లులకే పరిమితమైంది. దీంతో ప్రజానీకం, అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలతోపాటు పెనుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో ప్రజలు ప్రత్యేకించి రైతులు కలవరం చెందారు. అధికార యంత్రాంగం అప్రమత్తమై నష్టనివారణ చర్యలు చేపట్టింది.



ఒంగోలులో సోమవారం ఉదయం కురుస్తున్న జల్లులు

జిల్లా అంతటా శనివారం రాత్రి నుంచి వాతావరణంలో మార్పు వచ్చింది. అన్ని ప్రాంతాల్లోనూ చలి తీవ్రత పెరగడంతోపాటు అక్కడక్కడా జల్లులు కురిశాయి. ఆదివారం కూడా అలాంటి వాతావరణమే నెలకొంది. సోమవారం ఉదయానికి పరిస్థితిలో మార్పు వచ్చింది. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గిపోయింది. దిత్వా ముప్పు తప్పినప్పటికీ ప్రస్తుత వాతావరణం మాత్రం

మిగతా 6వ పేజీలో

17 ఎయిడెడ్ స్కూళ్ల మూసివేతకు నోటీసులు

- పది రోజుల్లో సంజాయిషీ ఇవ్వకపోతే చర్యలు
- స్పష్టం చేసిన డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు విద్య, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్యార్థులు తక్కువగా ఉన్న ఎయిడెడ్ స్కూళ్ల మూసివేతకు రంగం సిద్ధమైంది. అలాంటి 17 పాఠశాలల యాజమాన్యాలకు డీఈవో కిరణ్‌కుమార్ తుది సంజాయిషీ నోటీసులు ఇచ్చారు. వీటిలో 14 స్కూళ్లలో 40 మంది లోపు, మూడు స్కూళ్లలో 20 మంది లోపు విద్యార్థులున్నారు. విద్యార్థుల సంఖ్య పెంచాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం రెండుసార్లు నోటీసులు జారీచేసినా స్పందన లేదు. విద్యార్థుల సంఖ్యను మెరుగుపర్చడంలో యాజమాన్యాలు విఫలమయ్యాయి. దీంతో డీఈవో నోటీసులు జారీ చేశారు. పది రోజుల్లోపు సమాధానం ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని అందులో స్పష్టం చేశారు.

నోటీసులు జారీ చేసిన స్కూళ్లు ఇవే..

ప్రస్తుత విద్యా సంవత్సరంలో 40మందిలోపు విద్యార్థులు ఉన్న బేస్తవారపేట అమెరికన్ బాప్టిస్ట్ మిషన్, దర్శి మండలం కృష్ణాపురం, దొనకొండ మండలం బాదాపురం, హెచ్‌ఎంపాడు మండలం ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం, వెంకటరెడ్డిపల్లి, పీసీఏపీఎస్, కొమరోలు మండలం ఏబీఎం, ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం, మార్కాపురం మండలం బోడపాడు, మార్కాపురం మండలం ఆజాద్ మెమోరియల్, నాగులప్పలపాడు మండలం మద్దిరాలపాడు పీవీసీహెచ్‌ఏఐ, పోతవరం సీతా, ఒంగోలునగరంలోని కొప్పోలు ఎయిడెడ్, కొప్పోలు పీఆర్ ఎయిడెడ్, పుల్లలచెరువు మండలం మన్నేపల్లి ఉమామహేశ్వర, ఎయిడెడ్ యూపీ స్కూళ్లకు నోటీసులు జారీ చేశారు. 20 మంది లోపు విద్యార్థులు ఉన్న పెదకొత్తపల్లి ఆర్‌ఏఈఎస్, ఎన్‌జీపాడు మండలం పోతవరం పీపీఎస్, ఒంగోలు ఏబీఎం కాంపౌండ్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలకు నోటీసులు జారీచేశారు.



దుక్కి దున్ని ఖాళీగా ఉన్న భూమి

సాగు.. జాగు

ముందుకు సాగని రబీ

- రెండు నెలల్లో 20శాతం విస్తీర్ణం కూడా లేదు
- ప్రకృతి ప్రతికూలతే కారణం
- మొంథా తుఫాన్ ముంచెత్తడంతో చాలాచోట్ల విత్తనం వేయలేకపోయిన రైతులు
- తాజా వాతావరణంతో మరింత ఆలస్యమవుతుందని ఆందోళన

జిల్లాలో ఈ ఏడాది రబీ సాగు ముందుకు సాగడం లేదు. సీజన్ ప్రారంభమై రెండు మాసాలు గడిచినా సాధారణ విస్తీర్ణంలో కనీసం 20శాతం కూడా పంటలు పడలేదు. విస్తారంగా రబీ సాగుచేసే సమయంలో జిల్లాను మొంథా తుఫాన్ ముంచెత్తింది. నవంబరులో సాధారణ వర్షం కూడా పడకపోవడం ప్రతిబంధకంగా మారింది. మరోవైపు ప్రస్తుతం దిత్వా తుఫాన్ వలన నెలకొన్న వాతావరణం రైతులను కలవరపెడుతోంది. దీని కారణంగా సాగు మరింత ఆలస్యమవడంతోపాటు పంటలపై తెగుళ్ల దాడి పెరుగుతుందని వారు ఆందోళన చెందుతున్నారు.

ఒంగోలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జూన్ నుంచి సెప్టెంబరు వరకు ఖరీఫ్.. అక్టోబరు నుంచి డిసెంబర్ వరకు రబీ సీజన్‌గా పరిగణిస్తారు. కొన్ని ప్రాంతాల్లో ఆలస్యంగా కొంతమేర విస్తీర్ణంలో జనవరిలో కూడా పైర్లు వేస్తుంటారు. రబీకి సంబంధించి అక్టోబరు, నవంబరు నెలల్లోనే ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తారు. జిల్లాలో వ్యవసాయశాఖ పరిధిలో రబీ సీజన్‌లో సుమారు లక్షా 43వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో 25 రకాల పంటలు వేస్తారు. అందులో శనగ, పొగాకు, వరి, మినుము ప్రధానమైనవి. అలసంద, మొక్కజొన్న వంటివి ఒక మోస్తరుగా వేస్తారు. మొత్తం

మిగతా 6వ పేజీలో



సీఎస్‌పురం పూర్వ తహసీల్దార్, డీటీలపై విచారణ

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- విధుల్లో నిర్లక్ష్యం.. రికార్డుల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించడమే కారణం

6



టంగుటూరు మండలం శివపురంలో వృద్ధాప్య పింఛన్‌ను అందజేస్తున్న మంత్రి స్వామి

ఇంటింటికీ వెళ్లి.. యోగక్షేమాలు విచారించి..

లబ్ధిదారులను కలిసి సామాజిక పింఛన్‌ల అందజేత

- ఉదయం 10 గంటలకే 75శాతం పంపిణీ
- శివపురంలో పాల్గొన్న మంత్రి స్వామి
- పలుచోట్ల శాసనసభ్యులు, ఇతర ముఖ్యనేతలు, అధికారులు హాజరు

ఒంగోలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా సోమవారం సామాజిక పింఛన్‌ల పంపిణీ కోలాహలంగా సాగింది. తుఫాన్ వాతావరణంతో చలిగాలులు, చిరుజల్లులు ఉన్నప్పటికీ ఉదయం ఏడు గంటలకే క్షేత్రస్థాయి సిబ్బంది, వారికి తోడు టీడీపీ శ్రేణులు పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఉదయం పది గంటలలోపే జిల్లాలోని లబ్ధిదారులలో 75శాతం మందికి పింఛన్ సొమ్మును అందించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతినెలా ఒకటో తేదీన 'పేదల సేవ'లో పేరుతో పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్న విషయం విదితమే. అలాగే సోమవారం జిల్లా వ్యాప్తంగా పింఛన్‌లు పంపిణీ చేపట్టారు. జిల్లాకు ఈనెలకు సంబంధించి 2,33,200 మంది లబ్ధిదారులకు రూ.124.71 కోట్ల సామాజిక పింఛన్‌లు మంజూరయ్యాయి. అందులో 345మంది కొత్తవారు ఉన్నారు. పింఛన్‌లు తీసుకుంటూ మరణించిన వారి

మిగతా 6వ పేజీలో



పారిశుధ్యంలో అవినీతి కంపు..!

చెత్తపేరుతో వసూళ్లకు తెగబడిన ఇన్‌స్పెక్టర్

- అర్హత లేకపోయినా ఆ పోస్టులో చెలామణి
- టీ దుకాణాల నుంచి హాస్పిటల్స్ వరకూ కప్పం కట్టాలి
- కార్మికులను ఏరియాలు మార్చి డబ్బులు డిమాండ్
- ఒంగోలు కార్పొరేషన్ శానిటేషన్‌లో వసూల్ రాజా



ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు నిర్వర్తించే ప్రాంతంలో అధ్వానంగా పారిశుధ్యం (ఇన్‌సెట్‌లో) డిప్యూటీ మేయర్ షాపు పక్కన చెత్త ఉందంటూ ఇచ్చిన జరిమానా రసీదు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగర పరిశుభ్రత, సుందరీకరణలో పారిశుధ్య విభాగం పాత్ర కీలకమైనది. అయితే ఆ విభాగంలోని 3వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ తీరుతో అవినీతి కంపుకొడుతోంది. టీ దుకాణాల నుంచి ఆసుపత్రుల వరకు వసూళ్లకు పాల్పడటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి వైసీపీ హయాంలో చెత్తపై పన్ను వసూలు విధానం అమలులో ఉండగా ప్రజా ప్రభుత్వం వచ్చాక రద్దుచేసింది. కమర్షియల్ వేస్ట్ కింద ఆసుపత్రుల నుంచి మాత్రమే రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారు. అందుకు సంబంధించి కచ్చితంగా రసీదు ఇవ్వాల్సి ఉంది. కానీ ఇక్కడ మూడో డివిజన్ శాని టరీ ఇన్‌స్పెక్టర్ మాత్రం అవకాశాన్ని స్వలాభానికి వాడేయడంతో ఆ డివిజన్ ప్రజలు అల్లాడిపోతు న్నారు. గతంలో అనేక ఆరోపణలు ఎదుర్కొన్నప్పటికీ పాలకవర్గంలోని ఓ పెద్ద ఆశీస్సులతో ఆయన బరితెగిస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అర్హత లేకపోయినా ఆయనకు ఆ పోస్టు ఇవ్వడంపై ఇప్పటికే ఆరోపణలు ఉన్నప్పటికీ చర్యలు కరువయ్యాయి. గతంలో ఆయన పనితీరు, అవినీతి బాగోతంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనరు వెంకటేశ్వరరావు

మిగతా 6వ పేజీలో

గతంలోనూ అవినీతి ఆరోపణలు

చెత్తపై సంపాదనకు అలవాటుపడిన సదరు శానిటరీ ఇన్‌స్పెక్టర్ గత వైసీపీ హయాంలో ఆ పార్టీతో అంటకాగారు. కనీస విద్యార్హత లేకపోయినా ఆయనకు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక పాలకవర్గ పెద్ద ఆశీస్సులతో తిరిగి అదేపోస్టులో నియమితులైన ఆయన తన ప్రవర్తనను మార్చుకోలేదు. వసూళ్లపర్వం ఆపలేదు. దీంతో పలుమార్లు ఫిర్యాదులు రావడం, విచారణలో అవన్నీ వాస్తవాలని తెలియడంతో కమిషనర్ ఆ ఇన్‌స్పెక్టర్‌కు డంపింగ్ యార్డు వద్ద పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. అయితే ఏమైందో ఏమో రెండు, మూడు రోజుల్లోనే ఆయన తిరిగి డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరారు.



ఒంగోలులోని బండ్లమిట్టలో వృద్ధురాలి ఇంటి వద్దకే వెళ్లి సరుకులు అందజేస్తున్న డీలర్

రేషన్ పంపిణీ ప్రారంభం

- తొలిరోజే 29శాతం మంది కార్డుదారులకు అందజేత

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా రేషన్ పంపిణీ ప్రారంభమైంది. మొత్తం 1,392 దుకాణాల పరిధిలో 6.71 లక్షల స్మార్ట్ కార్డుదారులకు సోమవారం నుంచి బియ్యం, జొన్నలు, పంచదారను ఇస్తున్నారు. తొలిరోజు సాయంత్రం ఆరు గంటలకు 1.94 లక్షల (29శాతం) మంది రేషన్‌ను అందుకున్నారు. అత్యధికంగా సంతనూతలపాడు మండలంలో 6,064 (40.86శాతం) మంది కార్డుదారులు సరుకులు తీసుకున్నారు. అతితక్కువగా పొన్నలూరు మండలంలో 2,516 (19.16శాతం) మంది మాత్రమే రేషన్ అందుకున్నారు. ఉదయం, సాయంత్రం డీలర్లు రేషన్ పంపిణీ చేస్తుండటంతో కార్డుదారులు వారికి అనుకూలమైన సమయంలో వెళ్లి తెచ్చుకుంటున్నారు.

సుబ్బరామరెడ్డికి ఘన నివాళి

లోక్‌సభ మాజీ సభ్యుడు మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి ఒంగోలులో సోమవారం ఘనంగా జరిగింది. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. సుబ్బరామరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన దాతృత్వాన్ని, సేవలను కీర్తించారు. జిల్లా అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా మాగుంట కుటుంబం భారీ అన్నదానం ఏర్పాటు చేసింది.

7





ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది

6

అవగాహనతోనే హెచ్‌ఐవీ నివారణ

హెచ్‌ఐవీని అవగాహనతోనే నివారించగలమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా సోమవారం ఒంగోలులో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే దామచర్ల పాల్గొన్నారు.

శోకసంద్రంలో అన్నసముద్రం

- విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి
- క్రిస్మస్ స్టార్ ఏర్పాటు చేసే క్రమంలో ఘటన
- మంత్రి డాక్టర్ స్వామి, గూడూరి దిగ్భ్రాంతి

7



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

సాగు.. జాగు

(5వ పేజీ తరువాయి)

విస్తీర్ణంలో ఇంచుమించు మూడోవంతు శనగ సాగు చేస్తారు. మరో 22శాతం విస్తీర్ణంలో పొగాకు, 13శాతం విస్తీర్ణంలో వరి, సుమారు 18శాతానికిపైగా విస్తీర్ణంలో మినుము వేస్తారు. అలా ఈ నాలుగు పంటలే దాదాపు రబీ సాగులో 85శాతం వరకు ఉంటాయి. వీటన్నింటినీ అక్టోబరు ఆరంభం నుంచే విస్తారంగా సాగు చేస్తుంటారు. దాదాపు మూడొంతుల విస్తీర్ణంలో ఈ సమయానికి పంటలు సాగవుతాయి.

ఈ ఏడాది 28,605 హెక్టార్లలోనే సాగు

ఈ ఏడాది పరిస్థితి పూర్తిభిన్నంగా కనిపిస్తోంది. మొత్తం లక్షా 43వేల హెక్టార్ల రబీ సాధారణ విస్తీర్ణంలో ఇప్పటి వరకు కేవలం 28,605 హెక్టార్లలోనే పైర్లు సాగైనట్లు వ్యవసాయశాఖ అధికారుల సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. అంటే రబీ సీజన్ ప్రారంభమై రెండు మాసాలు గడిచినా సాధారణ సాగు విస్తీర్ణంలో కేవలం 19.94శాతంలో మాత్రమే రైతులు పంటలు వేశారు. శనగ సాధారణ విస్తీర్ణం 44వేల హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 6,400 హెక్టార్లలో మాత్రమే విత్తనం పడింది. 26,341 హెక్టార్లలో సాగు చేయాల్సిన మినుము 3,539 హెక్టార్లలో, 19,144హెక్టార్లలో వరి సాధారణ విస్తీర్ణానికి 4,280 హెక్టార్లు, 29,345 హెక్టార్లలో పొగాకు పంట 4,271 హెక్టార్లలో వేశారు. 3,786 హెక్టార్లలో అలసంద, 4,574 హెక్టార్లలో మొక్కజొన్న, మరో 1,300 హెక్టార్లలో జొన్న వేసినట్లు సమాచారం. అలా మొత్తంగా సాధారణ విస్తీర్ణంలో 20శాతం లోపుగానే ఇప్పటి వరకు పంటలు సాగయ్యాయి.

ప్రకృతి ప్రతికూలత

సెప్టెంబరులో మంచి వర్షాలు కురిస్తే దుక్కులు దున్ని అక్టోబరు ఆరంభం నుంచి విస్తారంగా రైతులు రబీ పైర్లు సాగు చేస్తారు. అయితే ఈ ఏడాది సెప్టెంబరులో సాధారణ వర్షం మాత్రమే కురిసింది. రబీ ఆరంభమైన అక్టోబరు తొలిపక్షం అంతా బెట్టవాతావరణం నెలకొంది. దీంతో దుక్కులు దున్నిన రైతులు వర్షం కోసం ఎదురుచూడాల్సి వచ్చి సీజన్ ఆరంభంలో పెద్దగా సాగు చేయలేకపోయారు. అక్టోబరు ఆఖరులో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. తొలుత రెండు, మూడు రోజులు సాధారణ.. తర్వాత మొంథా తుఫాన్‌తో భారీ వర్షాలు ముంచెత్తాయి. తుఫాన్ ప్రభావ సమయంలోనే కాక అనంతరం పదిరోజుల వరకు చాలాచోట్ల పొలంలోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీని నుంచి బయటపడి భూములు ఆరి సాగుకు ఉపక్రమించిన రైతులకు తిరిగి బెట్ట వాతవరణం ఇబ్బంది పెట్టింది.

ఈనెలలో లోటు వర్షపాతం

ఈనెలలో జిల్లాలో సాధారణ వర్షపాతం 138 మి.మీ కాగా ఇప్పటివరకు కేవలం 10మి.మీ లోపుగానే ఉంది. అంటే 95శాతం లోటు వర్షపాతం నమోదవడంతో మెట్టపైర్ల సాగు ముందుకు కదలలేదు. అలా రబీ సీజన్ ఈ ఏడాది తీవ్రప్రతికూల పరిస్థితిని ఎదుర్కొని ముందుకు సాగలేదు. సాగు ముమ్మరం చేద్దామని భావిస్తున్న తరుణంలో దిత్వా తుఫాన్ ప్రభావంతో కొన్ని చోట్ల జల్లులు కురిశాయి. అలా పంటల సాగు ఆలస్యమైతే దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపి నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పారిశుధ్యంలో అవినీతి కంపు

(5వ పేజీ తరువాయి)

పలుమార్లు హెచ్చరికలు జారీ చేశారు. మూడుసార్లు మెమోలు ఇచ్చారు. అయినప్పటికీ ఆయన తీరు మారకపోవడం, ప్రత్యేకించి పారిశుధ్యం మెరుగు కన్నా పైసలు వసూళ్లపైనే దృష్టి సారించడం ఇప్పుడు శానిటేషన్ విభాగంలోనూ చర్చనీయాంశమైంది.

ఆయన రూటే సప'రేటు'

మంగమూరురోడ్డు, బాలాజీనగర్, నిర్మల్‌నగర్, లాయర్‌పేట, గద్దలగుంట, అంజయ్య రోడ్, లాయర్‌పేట ఎక్స్‌టెన్షన్, వీఐపీ రోడ్డు, మామిడిపాలెం, కొణిజేడు బస్టాండ్, రాజాపానగల్ రోడు, గాంధీరోడ్, పప్పుబజారు శానిటేషన్ బాధ్యలు చూస్తున్న ఇన్‌స్పెక్టర్, ఆయనతోపాటు మరో శానిటరీ సెక్రటరీ తీరుతో ఆయా ప్రాంతాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రోడ్డుపై కాగితం తీయాలన్నా కాసులు ముట్టజెప్పాల్సి వస్తోంది. ప్రతిరోజూ మురుగు కాలువల్లో పూడికతీసి, ఆ తర్వాత వాటిని తొలగించాల్సిన బాధ్యత శానిటరీ సిబ్బందిపైన ఉంది. కానీ కాలువల్లో పూడిక మాత్రమే తొలగించి, ఆతర్వాత చెత్తను తీయడానికి డబ్బులు డిమాండ్ చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక గాంధీ రోడ్‌లోని ఇందిరాగాంధీ బొమ్మ ఎదురు వీధిలో పది రోజులు క్రితం కాలువ పనులు చేపట్టారు. ఆ క్రమంలో కొన్ని తాగునీటి పైపులు దెబ్బతిన్నాయి. దీంతో పది రోజులుగా ఆ ప్రాంతంలోని నివాసాలకు మురుగునీరు సరఫరా అవుతోంది. మరోవైపు కాలువల్లోని మురుగునీరు రోడ్లపైన పారుతోంది. ఆ విషయాన్ని పలువురు సదరు ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆ పని మాది కాదు, ఇంజనీరింగ్ వారికి చెప్పుకోవాలంటూ దురుసుగా మాట్లాడినట్లు సమాచారం. ఇదిలాఉండగా పాలకవర్గంలో ముఖ్యులైన డిప్యూటీ మేయర్ షాపు ముందు చెత్త ఉందంటూ చిర్రుబుర్రులాడి ఏకంగా రూ.200 పెనాల్టీ విధించి తన ప్రతాపాన్ని ప్రదర్శించారు. గాంధీ రోడ్డులోని ఓ స్వీటు దుకాణంలో కవర్లు ఉన్నాయంటూ దాడులు చేశారు. షాపు యజమాని ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే కవర్లు వినియోగిస్తున్నామని చెప్పినా వినిపించుకోకుండా బెదిరింపులకు పాల్పడటంపై షాపు యజమానులు అసహనం వ్యక్తం చేశారు. ఆయనంటే దుకాణదారులు హడలిపోతున్నారు.

ఎమ్మెల్యే చెప్పారంటూ. ఏరియాలు మార్పు

గతంలో మహిళలను వేధించడం, దుకాణాల వద్ద వసూళ్లకు పాల్పడటం, యూజర్ చార్జీలు తొలగించినా ఇంకా చెత్తపైన పన్ను విధించడం ఆయనకు అలవాటుగా మారింది. ఈ ఆరోపణలతో పలుమార్లు అధికారుల ఆగ్రహానికి గురైన ఆయన తాజాగా ఎమ్మెల్యే పేరుతో సిబ్బందినే బెదిరిస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి నగరంలో ఏ డివిజన్‌లోనూ కార్మికులకు స్థానమార్పిడి జరగలేదు. కానీ ఈ ఇన్‌స్పెక్టర్ మాత్రం గతంలో పనిచేస్తున్న వారిని ఇతర ఏరియాలకు మారుస్తున్నారు. అదేమని అడిగితే కీలక ప్రజాప్రతినిధి చెప్పారు అని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. అదేసమయంలో ఆయనకు ఎలాగోలా చెబుతాను. ఎంతో కొంత డబ్బులు నాకు ఇవ్వండి అంటూ వసూలు చేస్తున్నట్లు కొందరు కార్మికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఆ ఇన్‌స్పెక్టర్ వద్ద పనిచేయలేమంటూ వారు గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఇప్పటికైనా ఆయన తీరుపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కార్పొరేషన్ అధికారులపై ఉంది.

ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు విచారించి

(5వ పేజీ తరువాయి)

భార్యలకు తదుపరి నెలలో ఆటోమెటిక్‌గా పింఛన్ ఇచ్చేలా ప్రభు త్వం చర్యలు తీసుకోవడంతో అలా 345 మంది కొత్త వారు చేరారు. మధ్యాహ్నం మూడు గంటలకు 90శా తం మందికి నగదు పంపిణీ చేశారు. మిగిలిన వారికి సాయంత్రం అందించారు. అందుబాటులో లేని కొద్ది మందికి తర్వాత ఇస్తారని అధికారులు తెలియజేశారు.

ఉత్సాహంగా పాల్గొన్న నేతలు

ప్రభుత్వ ఆదేశాలతో ఎక్కడికక్కడ ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, వివిధ స్థాయిల్లోని అధికారులు, సిబ్బంది పింఛన్‌ల పంపిణీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి తన నియోజకవర్గమైన కొండపిలోని టంగుటూరు మండలం శివాపురం గ్రామంలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులను పలుకరించి వారి యోగక్షేమాలను కనుక్కొని పింఛన్‌లు అందజేశారు. అదే నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలం వావిలేటిపాడులో మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పంపిణీ చేశారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నగరంలోని 12వ డివిజన్‌లో పంపిణీ చేయగా టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఒడా చైర్మన్ షేక్ రియాజ్, నగర మేయర్ గంగాడ సుజాత తదితరులు పాల్గొన్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కనిగిరి పట్టణంలోని ఏడో వార్డులో ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్మును అందజేశారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కంభం మండలం లింగోజీపల్లిలో పాల్గొన్నారు. టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు గంగపాలెంలో పంపిణీ చేయగా, టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తాళ్లూరు మండలం కొర్రపాటివారిపాలెంలో పింఛన్‌లను అందజేశారు. దర్శి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పాల్గొన్నారు.

అవగాహనతోనే హెచ్‌ఐవీ నివారణ

● మంత్రి స్వామి ● ఘనంగా వరల్డ్ ఎయిడ్స్ దినోత్సవం

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ పట్ల అవగాహనతోనే ఈ వ్యాధిని సంపూర్ణంగా నిర్మూలించగలమని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా సోమవారం ఒంగోలులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. లెప్రసీ, క్షయ, ఎయిడ్స్ నియంత్రణ ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అద్దంకి బస్టాండ్ నుంచి ఎన్జీవో హోమ్ వరకు ర్యాలీ నిర్వహించగా మంత్రి స్వామితోపాటు ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ రాజాబాబు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో గతంతో పోల్చుకుంటే తాజా గణాంకాలతో బాధితుల సంఖ్య తగ్గిందన్నారు. హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌ను పూర్తి నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలని, ఇతరులకు అవగాహన పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా జెండా ఊపి, బెలూన్లను ఎగురవేశారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, ఓడా ఛైర్మన్ షేక్ రియాజ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, లెప్రసీ, క్షయ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ బాలాజీ పలువురు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఎన్జీవో హోమ్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాసాధికార సంస్థ కార్యదర్శి షరీఫ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జిల్లా వ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు.



ర్యాలీలో పాల్గొన్న మంత్రిస్వామి, ఎంపీ మాగుంట,ఎమ్మెల్యే దాచమర్ల

సీఎస్‌పురం పూర్వ తహసీల్దార్, డీటీలపై విచారణ

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఒంగోలు కలెక్టరేట్/పామూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండల పూర్వ తహసీల్దార్ వై.మెర్సీకుమారి, డిప్యూటీ తహసీల్దార్ పీ.వెంకటేశ్వర్లు విధి నిర్వహణలో చేసిన అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి జి.సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వై.మెర్సీకుమారి 2016 ఆగస్టు 8 నుంచి 2017 సెప్టెంబరు 30 వరకు సీఎస్‌పురం తహసీల్దార్‌గా పనిచేసి ప్రస్తుతం పదవీ విరమణ చేశారు. పీ.వెంకటేశ్వర్లు 2014 ఆగస్టు 28 నుంచి 2018 జూన్ 20 వరకు సీఎస్‌పురం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేశారు. ఇరువురు సీఎస్‌పురం మండలంలో పనిచేసిన సమయంలో ఘోర తప్పిదాలకు పాల్పడ్డారు. విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా తమ దగ్గర పనిచేస్తున్న వీఆర్వోలను అదుపు చేయడం, పర్యవేక్షించడంలో విఫలమయ్యారు. పట్టాదారు పాసుపుస్తకం మంజూరు కోసం అంబాల లక్ష్మీ 2017లో మునునూరు గ్రామ వీఆర్వో బ్రహ్మయ్యను సంప్రదించింది. అందుకు వీఆర్వో రూ.15 వేలు లంచం డిమాండ్ చేశాడు. ఈ నేపథ్యంలో అవినీతి నిరోధకశాఖ జరిపిన దాడుల్లో మునునూరు వీఆర్వో కొండబత్తుని బ్రహ్మయ్య లంచం తీసుకుంటూ దొరికాడు. ఏసీబీ అధికారులు రిపోర్టు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఈ సంఘటనపై జీవో నెంబర్ 1513 జారీచేస్తూ వారం రోజుల్లో మీ పైన వచ్చిన అభియోగాలకు వివరణ ఇవ్వాలని చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ నోటీసులు జారీ చేశారు. కార్యాలయ రికార్డుల నిర్వహణలోనూ నిబంధనలను ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. మొత్తం తప్పిదాలు, పర్యవేక్షణ వైఫల్యాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ ఇరువురు అధికారులకు వేర్వేరుగా అభియోగపత్రాలను కూడా ప్రభుత్వం జారీచేసింది. ఈ విచారణపై రాజకీయంగా కానీ, బయటి వ్యక్తుల నుంచి ఒత్తిడి చేయడం, వీరికి అనుకూలంగా ఎటువంటి లేఖలు వచ్చినా విషయాన్ని తీవ్రంగా పరిగణించి ప్రభుత్వ నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించారు.

దిత్వాతో సముద్రం ఉగ్రరూపం

● రోజంతా నానుడి వర్షం ● ఆందోళనలో రైతన్నలు

వాడరేవు(చీరాల), డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి) : మొంథా తుఫాన్‌తో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజలకు, రైతులకు తిరిగి దిత్వా తుఫాన్‌తో ఆందోళన మొదలైంది. రెండు రోజులుగా తుఫాన్ కారణంగా నాన్పుడు చినుకులు పడుతూనే ఉన్నాయి. ఆకాశం మేఘావృతమై ఉంది. ఈక్రమంలో వాడరేవు, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం తీరప్రాంతాల్లో సముద్రం దాదాపుగా 10 అడుగుల మేర ముందకు వచ్చింది. సముద్రం ఉగ్రరూపం దాల్చి ఎడ తెరపి లేకుండా అలలు ఎగిసిపడుతూ బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. మరొక వైపు అధికారులు, మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్ల సాయంతో గస్తీ నిర్వహి స్తున్నప్పటికీ, ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు అంది స్తున్నారు. ఇదిలా ఉంటే నియోజకవర్గంలో గతంలో అన్న దాతలు వరి, వేరుశనగ సాగు చేసి మొంథా తో తీవ్రంగా నష్టాల బారినపడ్డారు. తాజాగా మరోమారు పంటలు ప్రారంభించారు. ఇవి ఆరంభ దశలో ఉన్నాయి. ఇప్పటివరకు కురిసిన వర్షాలు కారణంగా రైతాంగానికి పెద్దగా ఇబ్బందులు లేవు. ఇదే తరహా వర్షాలు కురిస్తే రైతాంగం తీవ్ర సంక్షోభంలో పడే అవకాశం ఉందని అన్నదాతల ఆందోళన చెందుతున్నారు.


ఉగ్రరూపం దాల్చిన సముద్రం

ఎయిడ్స్ రోగులను ఆదరించాలి

పర్చూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను మానతా దృక్పథం తో ఆదరించాలని పర్చూరు ప్రభుత్వ వైద్య శాల సూపరింటెంట్ డాక్టర్ సౌమ్య అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గేరాడ్స్ ఫౌండేషన్ చీరాల వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవ గాహన కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సూపరింటెంట్ సౌమ్య మాట్లాడుతూ ఎయిడ్స్ బారిన పడిన రోగులపై వివక్ష చూపడం, దూషించటం, చట్టరీత్యా నేర మన్నారు. సరైన అవగాహన లేకపోవడం వలన ఎయిడ్స్ రోగులు పెరగటానికి కారణ మన్నారు. కార్యక్రమంలో గేరాడ్స్ ఫౌండేషన్ చైర్మన్ అల్లడి కనకరత్నం, ట్రస్టీ గేరా స్వరాజ్, కళాశాల కరస్పాండెంట్ ఒగ్గిశెట్టి నరసింహం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శేషుకుమారి, మామిడిపాక హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



వేటపాలెం(చీరాల) : రోగాల బారిన పడిన బాధితుల పట్ల ప్రజలు స్నేహ పూర్వకంగా మెలగాలని పందిళ్లపల్లి ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం అధికారి డా.హర్షవర్ధన్ ఆదిత్య అన్నారు. సోమవారం మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల వారి ఆధ్వ ర్యంలో న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహిం చారు. ఈక్రమంలో భాగంగా ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు అశోక్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ కట్టా రాణీ, పిఎల్‌వీ మధీన్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పెంచలయ్య హంతకులను కఠినంగా శిక్షించాలి

పంగులూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో సీపీఎం నాయకుడు పెంచలయ్య ను దారుణహత్య చేసిన గంజాయి గూండా లను కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగబోయిన రంగారావు డిమాం డ్ చేశారు. పెంచలయ్య దారుణ హత్యను నిరసిస్తూ, పంగులూరు ప్రధానకూడలిలో సీపీఎం నేతలు, కార్యకర్తలు సోమవారం సాయంత్రం ఆందోళన కార్యక్రమం చేప ట్టారు. ఈ సందర్భంగా నాగబోయిన రంగా రావు మాట్లాడుతూ నెల్లూరులో గంజాయి గూండాలను అడ్డుకునేందుకు పెంచలయ్య పోరాటం చేశారన్నారు. గంజాయి ఇతర మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరుస్తూ పోరాటం చేశాడన్నారు. గంజాయి వ్యాపారానికి అడ్డుగా ఉన్నాడని పెంచల య్యను హతమార్చిన దుండగులందరినీ కఠినంగా శిక్షంచాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తలపనేని రామారావు, గుడిపాటి మల్లారెడ్డి, ఆదుంసాహెబ్, సుధాకర్, ఏలియా, సుబ్బారావు, శ్రీనావాసరెడ్డి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సైడుకాలువ, కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన

యద్దనపూడి, (మా ర్టూరు) డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): యద్దన పూడి మండలంలోని యన మదల గ్రామంలోని ఎస్సీ కాలనీలో సైడుకాలువ, కల్వ ర్టు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజన కింద మంజూరైన రూ.2 లక్షల నిధులతో వాటి నిర్మాణం చేపడుతున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాణి, గ్రామ నాయకులు సింగు చంద్రశేఖర్, దొడ్డా అప్పారావు, పల్లెపోగు సాల్మన్, గరికపూడి చినభూషణం, నాగభూషణం, జాగర్లమూడి సాంబయ్య, కృపారావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గీతపారాయణం చేసిన భక్తులు

యద్దనపూడి, (మార్టూరు) డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గీత జయంతి సందర్భంగా సోమవారం యద్దనపూడి మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలోని చెన్నకేశవస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో చెన్నకేశవస్వామిని ప్రత్యేక అలంకరణ చేశారు.

భగవద్గీత ఆన్‌లైన్ పరీక్ష పోటీలో పర్చూరు వాసికి బంగారు పతకం

● స్వామీజీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ప్రసన్న

పర్చూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మైసూరు దత్తపీఠం ఆధ్వర్యంలో ఏటా భగవద్గీతపై నిర్వహిస్తున్న ఆన్‌లైన్ పరీక్షలో ఈ ఏడాది పర్చూరుకు చెందిన రోటరీ ఇన్నర్‌వీల్ మాజీ అధ్యక్షు రాలు, వైస్ ఎంపీపీ కోటా ప్రసన్నకు బంగారు పతకం దక్కింది. మైసూరు దత్త పీఠంలో సోమవారం ఆమెకు దత్తపీఠాధిపతి చేతుల మీదుగా పురస్కారంతో పాటు, బంగారు పతకం అందుకున్నారు. ఆధ్యాత్మిక జ్ఞానానికి ప్రతీకగా నిలిచే భవగద్గీతపై పట్టుసాధించి ప్రథమస్థానంలో నిలిచిన ప్రసన్నకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందూవులు అతి పవిత్రం గా భావించే భవగద్గీత పోటీల్లో పాల్గొనడం, స్వామిజీ చేతుల మీదుగా అవార్డు అందుకోవటం భగవంతుని సంకల్పం అన్నారు.


ప్రసంసాపత్రం అందుకుంటున్న ప్రసన్న, శ్రీనివాసరావు దంపతులు

చీరాల్లో జన్మదిన వేడుకలతో సంతృప్తి

● ప్రజలు మమ్మల్ని విశ్వసించారు
● నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా
● టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్

చీరాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల్లో పుట్టిన రోజు వేడుకలు మునుపెన్నడూ లేని సంతృప్తినిచ్చాయని టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గంలో ఆయన పుట్టినరోజు వేడుకలు అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముందుగా కొత్తపేట నివాసం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పట్టణంలోని పలు ప్రదాన రహదారుల్లో కొనసాగింది. ఈక్రమంలో అభిమానులు పలుచోట్ల భారీ గజమాలలతో స్వాగతం పలికారు. సెయింట్‌మార్క్స్ లూథరన్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. గడియార స్థంభం కూడిలితో పాటు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో కేక్ కటింగ్‌లు నిర్వహించారు. అలాగే అభిమానులు రక్తదానం చేశా రు. ఈ పుట్టిన రోజు వేడుకలకు సినీ నటుడు నిఖిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులను ప్రజలు ఆదరిం చాలన్నారు. మమేంద్రనాథ్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తన తండ్రి చేస్తున్న సేవలను ప్రజలు ఆదరిస్తున్నట్లు వివరించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అలాగే స్థానిక సంస్థల్లో కూటమి జెండా ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువనాయకులు గౌరీ అమర్నాథ్, పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

కేంద్రం తీరుతో ప్రజాస్వామ్యం అస్తవ్యస్తం

● కాంగ్రెస్ కార్యకర్తలతో పరిశీలకులు అహర్ ప్రత్యేక సమావేశం

పేరాల(చీరాల), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీరుతో ప్రజా స్వామ్యం అస్థవ్యస్థంగా మారిందని ఏఐసీసీ పరిశీలకులు షారద్ అహర్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పేరాల పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆమంచి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ తీరును ఎండగట్టేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని చెప్పారు. ఆమంచితో పార్టీ బలోపేతమవుతుందని విశ్వసిం చారు. కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రటరీ విజయపాల్, పర్చూరు పార్టీ ఇన్‌చార్జ్ జ్యోతి, జిల్లా నాయకులు మార్పు గ్రెగోరీ, జడ్పీటీసీ సభ్యురాలు ఆకురాతి పద్మిని, బండ్ల తిరుమలదేవీ పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పలు మత్స్యకార గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

దీక్షాధారులకు 18 ఏళ్లగా అన్నదానం

● ఏటా 41 రోజుల పాటు నిర్వహణ
● సోమవారంతో ముగిసిన అన్నదానం

ఇంకొల్లు, డిసెంబరు 1, (ఆంధ్ర జ్యోతి) : మాలధారణ చేసిన ఓ భక్తుడు చేసిన ఆలోచనతో ఇంకొల్లులో 18 ఏళ్లగా 41 ఏళ్లగా అన్నదానం కొనసాగుతోంది. దాత సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఈ ఏడాది సోమవారం తో ముంగించారు. ఇంకొల్లులో అన్నదాన కార్యక్రమాన్ని ఆదర్శం గా తీసుకొని పలుగ్రామాలలో స్వాములకు అన్నదానం నిర్వహిం చడం గమనార్హం. ఇంకొల్లు అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో రెండేళ్లుగా పువ్వాడ రవి గురుస్వామి స్వాములకు అన్నదానం నిర్వహిస్తున్నారు. మొంధా తుఫాన్‌తో భారీ వర్షాలు కురిసినప్పటికీ ఆయా రోజుల్లో సైతం స్వాములకు ఇబ్బందులు పడకుండా అన్నదానం నిర్వహించారు. ఈ ఏడాది అక్టోబరు 22న అన్నదాన కార్యక్రమం ప్రారంభించి డిసెంబరు 1వ తేది వరకు 41 రోజుల పాటు నిర్వహించారు. సుమారు ప్రతి రోజు 250 నుండి 300 మంది మాలధారణలకు అన్నదానం నిర్వహించారు. ఈ ఏడాది ఇంకొల్లు ప్రాంతంలో ఎక్కువ మంది మాలధారణ చేశారు. సోమవారంతో అన్నదానం ముగిసింది.

గ్రానైట్ యజమానుల ఆందోళనపై అధికారుల వివరణ

బల్లికురవ, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ సీనరేజ్ వసూళ్ల చెల్లింపులపై ఫ్యాక్టరీ యజమానులు చేపట్టిన ఆందోళనపై సోమవారం జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి రామచంద్ర వివరణ ఇచ్చారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో మైనింగ్ సీనరేజ్‌లపై యజమానుల ఆందోళన అని ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింద న్నారు. కమిటీ నిర్ణయం వచ్చే వరకు ఎవరు ఆందోళనలు చేపట్ట వద్దన్నారు. సీనరేజ్ వసూళ్లు చేస్తున్న కంపెనీతో గ్రానైట్ ఫ్యాక్టరీల అసోసియేషన్లు సమావేశమవుతాయని, ఫ్యాక్టరీలు యథావిధిగా పనిచేస్తున్నాయని తెలిపారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

మార్టూరు, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): గీతాజయంతి సందర్భంగా సోమవారం మండలంలోని రాజుపాలెం గ్రామంలో రాజుపాలెం చిన్మయా మిషన్ అధ్యక్షులు మాజీ రోటరీ అధ్యక్షులు జాష్టి సాంబశివరావు 100 మంది పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, చెరుకూరి నాగేశ్వరరావు, గోనుగుంట్ల రవికుమార్ పాల్గొన్నారు.

దిత్వా ముప్పు తప్పింది!

(5వ పేజీ తరువాయి)

ఆందోళనకరంగా ఉన్నట్లు రైతులు భావిస్తున్నారు. జిల్లా అంతటా చల్లటి వాతావరణంతో చిరుజల్లులు పడుతున్నాయి. ఇలాంటి వాతావరణమే మరో రెండు, మూడురోజులు కొనసాగే అవకాశం ఉంది. బుధవారం వరకు అక్కడక్కడా ఒక మోస్తరు జల్లులు పడే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఈ తరహా వాతావ రణం పంటలపై తీవ్ర ప్రతికూలత చూపనుంది. వరి, పత్తి, మిర్చి, కంది, మొక్కజొన్న, పొగాకు, శనగ ఇతరత్రా అన్ని పంటలపైనా తెగుళ్లు, పురుగుల దాడి పెరగనుంది. ఇప్పటికే అలాంటి పరిస్థితి పలుచోట్ల కనిపిస్తోంది.

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య


బత్తి శ్రీను (ఫైల్)

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో జరుగుతున్న పండగలో గ్రామస్థులు అన్న మాటలకు మనస్థాపానికి గురై వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మాహత్య చేసుకున్న సంఘటన ఆదివారం జరిగింది. సీఐ అజయ్‌కుమార్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొలుకుల గ్రామంలో పీర్ల పండగ (అర్థంతంగా కొన్ని కారణాల వల్ల) మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. అయితే శనివారం సందు కావడంతో గుండంలో నడవడం ఆచారం. గ్రామానికి చెందిన బత్తి శ్రీను (45) పదేపదే (నాలుగు, ఐదు సార్లు) గుండంలో నడుస్తుండంతో అక్కడ ఉన్న కొందరు శ్రీనును గట్టిగా అరిచారు. దీంతో అందరి ముందు అరవడంతో మనస్థాపానికి గురై ఆదివారం గడ్డి మందు తాగి ఆత్మాహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి ఎర్రగొండపాలెం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. శ్రీను వ్యవసాయ కూలీ. భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ తెలిపారు.

కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా
రిమ్స్‌ను అభివృద్ధి చేయాలి

● కలెక్టర్ రాజాబాబు ఆదేశం



ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా రిమ్స్ హాస్పిటల్స్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సోమవారం సాయంత్రం వైద్య ఆరోగ్యశాఖాధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 85శాతం మంది పేద ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నారన్నారు. ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే రిమ్స్‌కు వస్తారని, అందువల్ల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రిమ్స్ ప్రాంగణంలో పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రిమ్స్ అభివృద్ధికి ఆర్కిటెక్‌ల సహాయంతో అవసరమైన మేర నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

పురుగుమందు తాగి డాక్టర్ ఆత్మహత్య


గౌతమ్‌రెడ్డి (ఫైల్)

మార్కాపురం రూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సర్వజన వైద్యశాల లోని పురిటి పిల్లల ప్రత్యేక విభాగం నవ జాత శిశు సంరక్షణా కేంద్రంలో వైద్యుడిగా పనిచేస్తున్న డాక్టర్ చదలవాడ గౌతమ్‌రెడ్డి (28) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలో భార్యతో కలిసి డాక్టర్ నివసిస్తున్నారు. రెండు రోజుల క్రితం పురుగు మందు తాగడంతో కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే హైదరాబాద్‌లోని ప్రయివేటు వైద్యశాలలో చేర్పించారు. వైద్య సేవలు అందిస్తుండగా సోమవారం ఉదయం మృతి చెందారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. పోలీసుల కేసు కూడా నమోదు కాలేదు.

జాఫ్లాపురానికి మొదటిసారి ఆర్టీసీ బస్ సర్వీస్

పొదిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పొదిలి మండలంలోని కంభాలపాడు పంచాయతీలోని జాఫ్లాపురం (యానాది కాలనీ)కి ఆర్టీసీ బస్ సర్వీస్ ప్రారంభమైంది. సోమవారం పొదిలి నుంచి డిపో మేనేజర్ శంకర్‌రావు బస్సు సర్వీసును ప్రారంభించారు. పట్టణానికి 10 కిలోమీటర్లు దూరంలో ఉన్న జాఫ్లాపురం నుంచి పొదిలికి ఎమ్మెల్యే ఆదేశాలతో బస్సు సర్వీసు వేసినట్లు డిపో మేనేజర్ తెలిపారు. పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఇటీవల ఎమ్మెల్యే ఆ గ్రామాలకు వెళ్లినప్పుడు కంభాలపాడు పంచాయతీలో చదువుతున్న విద్యార్థుల తల్లి దండ్రులు బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఆయన డిపో మేనేజర్‌కు చెప్పడంతో బస్సు సర్వీస్ ఏర్పాటు చేశారు.

సుబ్బరామరెడ్డికి ఘన నివాళి

● జిల్లాకు విశిష్ట సేవలు అందించిన మాగుంట


మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, పక్కన రాఘవరెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు లోక్‌సభ మాజీ సభ్యుడు స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి కార్యక్రమం జిల్లా కేంద్రమైన ఒంగోలులో సోమవారం ఘనంగా జరిగింది. మాగుంట కుటుంబం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి మంత్రులు, శాసనసభ్యులు, జిల్లా నలుమూలల నుంచి ప్రజాప్రతినిధులు భారీగా తరలివచ్చారు. అద్దంకి బస్టాండులోని సుబ్బరామరెడ్డి విగ్రహానికి రాష్ట్రమంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, మేయర్ గంగాడ సుజాత, మాగుంట రాఘవరెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పీవీఆర్ గ్రౌండ్‌లో జరిగిన వర్ధంతి సభకు ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ అధ్యక్షత వహించారు. ముందుగా అక్కడ సుబ్బరామరెడి, పార్వతిమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో రాష్ట్రమంత్రులు డాక్టర్ స్వామి, గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ దాతృత్వ గుణం, అభివృద్ధి, సంక్షేమంతో కీర్తిశేషులు సుబ్బరామరెడ్డి జిల్లాకు విశేష సేవలు అందించారని కొనియాడారు. సుబ్బరామరెడ్డి స్ఫూర్తితో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కుటుంబసభ్యులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ మాగుంట కుటుంబంతో దామచర్ల కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని వివరించారు. సుబ్బరామరెడ్డి మరణం నేటికి 30 ఏళ్లుగడుస్తున్నా ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఎంపీ శ్రీనివాసులురెడ్డి సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ మాగుంట కుటుంబం రానున్న రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ కందుకూరు ప్రాంతంలో ఉన్న తాగునీటి ఇబ్బందిని తీర్చిన మహోన్నతమైన వ్యక్తి సుబ్బరామరెడ్డి అని కొనియాడారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి ప్రాంతానికి రైతు మార్గం అవసరమని గుర్తించి అప్పట్లోనే సుబ్బరామరెడ్డి అందుకు రూపకర్త చేశారన్నారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ విద్య, వైద్యంతో పాటు అభివృద్ధి కోరుకునే కుటుంబం మాగుంట కుటుంబమని కొనియాడారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయంతో పాటు ప్రజాక్షేత్రంలో ఎంతో మందికి సుబ్బరామరెడ్డి ఆదర్శంగా నిలిచారన్నారు. పీడీసీసీ బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ ప్రజాసేవలో ఉన్న మాగుంట కుటుంబాన్ని ప్రజలందరూ ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి, వైపాలెం టీడీపీ ఇన్‌చార్జులు డాక్టర్ గొట్టిపాటిలక్ష్మి, ఎరిక్షన్‌బాబు, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఒడా చైర్మన్ షేక్ రియాజ్, ఏఎంసీ చైర్మన్ ఆర్.వెంకట్రావు, కందుల రామిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్, మంత్రి శ్రీనివాసరావు, టీవీ శ్రీరామమూర్తి, బీజేపీ అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు, తాతా ప్రసాద్, అయినాబత్తిన ఘనశ్యాం, కుప్పా రంగసాయి, బెల్లం సత్యనారాయణ, ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, మునిసిపల్ కమీషనర్ వెంకటేశ్వరరావు, సరస్వతి కళాశాలల చైర్మన్ రమణారెడ్డి, టీడీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు బండారు మదన్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు. మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి సందర్భంగా పీవీఆర్ గ్రౌండ్‌లో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరంభారీ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు నగరంలోని సుబ్బరామరెడ్డి విగ్రహాలతో పాటు మాగుంట అభిమానులు ఏర్పాటు చేసిన పలు సేవా కార్యక్రమాల్లో ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

మాగుంట నివాసంలో....

స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో కీర్తిశేషులు సుబ్బరామరెడ్డి చిత్రపటానికి ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆయన కుమారులు మాగుంట రాఘవరెడ్డి, అఖిల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు కరణం బలరామకృష్ణ మూర్తి పాల్గొని సుబ్బరామరెడ్డికి ఘనంగా నివాళులు అర్పించారు.

పేదల సంక్షేమమే కూటమి లక్ష్యం

● మంత్రి స్వామి ● శివపురంలో పింఛన్లు పంపిణీ

శివపురం (కొండపి), డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మంత్రి టంగుటూరు మండలంలోని మల్లవరప్పాడు గ్రామ పంచాయతీలోని శివపురం గ్రామంలో మంత్రి స్వామి పాల్గొని సామాజిక పింఛన్లు లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. మంత్రి స్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. శివపురం గ్రామంలో 69 మందికి ప్రతినెలా రూ.2.86 లక్షలు సామాజిక భద్రత పింఛన్లు అందుతున్నాయన్నారు. జిల్లాలో 2,83,200 మందికి ప్రతినెలా రూ.124.74 లక్షలు ప్రభుత్వం అందజేస్తున్నదన్నారు. గ్రామంలో మ్యాజిక్ డ్రైన్లు నిర్మిస్తున్నామని, తద్వారా భూగర్భ జలాలు పెంపొదుతాయన్నారు. మల్లవరప్పాడు, శివపురం గ్రామాలకు తాగునీటి ఎద్దడి నివారణకు పది లక్షల రూపాయల చొప్పున మంజూరు చేశామని మంత్రి స్వామి తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఒంగోలు మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగర్ల వెంకటరావు, సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, ఎంపీడీవో దేవసేనకుమారి, తహసీల్దార్ ఆంజనేయులు, ఇతర శాఖల మండల పాల్గొన్నారు.

వావిలేటిపాడులో... జరుగుమల్లి మండలంలోని వావిలేటిపాడు గ్రామంలో సామాజిక భద్రతా పింఛన్లను ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పింఛన్ లబ్ధిదారులతో సత్య మాట్లాడి వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, టీడీపీ సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమరళి, జరుగుమల్లి సొసైటీ చైర్మన్ నలమోతు వెంకటేశ్వర్లు, వావిలేటిపాడు గ్రామ టీడీపీ నాయకుడు నరాల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.


వావిలేటిపాడులో పింఛన్ పంపిణీ చేస్తున్న మారిటైం బోర్డు చైర్మన్ సత్య

శోకసంద్రంలో అన్నసముద్రం

● విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి
● క్రిస్మస్ స్టార్ ఏర్పాటు చేసే క్రమంలో ఘటన
● దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి స్వామి, గూడూరి


సంఘటనకు కారణమైన స్తంభం ఇదే..

త్రిపురాంతకం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అన్నసముద్రం గ్రామం శోకసంద్రంలో మునిగింది. డిసెంబరు మాసం ప్రారంభం కాగానే పల్లెల్లో క్రిస్మస్ సందడి ప్రారంభమవుతుంది. ఈ గ్రామంలో కూడా ఈ నెలరోజులు వేడుకగా క్రిస్మస్ పర్వదినం జరుపుకోవాలని, తమ ఆనందానికి, పండుగకు చిహ్నమైన క్రిస్మస్ స్టార్‌ను వెలిగించి అనేకులకు పండుగ ప్రత్యేకతలు తెలపాలని భావించిన వారి ఉత్సాహాన్ని విద్యుత్ షాక్ రూపంలో ఆవిరిచేసింది. ఊరంతా ఒక్కసారిగా ఉలిక్కిపడి ఆ కుటుంబాల రోదన మధ్య ప్రజలంతా కన్నీటి నివాళి అర్పించారు. త్రిపురాంతకం మండలం కొత్త అన్నసముద్రం గ్రామంలో జరిగిన ఈ ఘటన పండుగ రోజుల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. అన్న సముద్రాన్ని శోకసంద్రంలో ముంచింది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. క్రిస్మస్ నెల సందర్భంగా గ్రామంలో యువకులు సార్ట్ ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఉదయం రెండు విద్యుత్ స్థంభాలను తెచ్చి రోడ్డుకిరువైపుల నిలబెట్టి వాటికి స్టార్‌ను కట్టాలని ప్రయత్నాలు ప్రారంభించారు. 10 మంది అక్కడకు చేరి స్తంభాలు నిలిపే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో పైన ఉన్న ఎల్‌టీ విద్యుత్ లైనుకు స్తంభం తగిలింది. స్థంభం పైన ఉన్న విద్యుత్ చువ్వలు తీగలకు తగిలాయి. స్తంభం కిందిభాగంలో కొన్ని చువ్వలు బయటకు ఉన్న సంగతి వీళ్ల గమనించలేదు. ఈ నేపథ్యంలో తాళ్ల సహాయంతో స్తంభాలను సరిచేస్తున్న వారికి ఏమి కాలేదుగాని కిందిభాగంలో గోతిలో స్తంభాన్ని సరిచేసేందుకు పలుగుల సహాయంతో పట్టుకున్న పచ్చిగొల్ల విజయ్‌కుమార్ (43), ఈర్లపాటి దేవయ్య (48) ఇద్దరూ షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మరో ముగ్గురు కూడా షాక్ తగిలినా స్వల్ప అస్వస్థతతో బయటపడ్డారు. పండుగ రోజుల్లో ఉత్సాహంగా వేడుకలు జరుపుకునే గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది.

మంత్రి స్వామి తీవ్ర దిగ్భ్రాంతి

క్రిస్మస్ స్టార్ ఏర్పాటు చేసుకునే క్రమంలో విద్యుత్ షాక్ గురై ఇద్దరు మరణించారని తెలుసుకున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్రిస్మస్ రోజుల్లో ఇలాంటి ఘటన దురదృష్టకరమన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఒక ప్రకటనలో తన ప్రగాఢ సానుభూతిని కుటుంబసభ్యులకు తెలిపారు.

అయ్యో పాపం!

● తల్లి మరణంతో అనాథలైన చిన్నారులు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : తండ్రి ఉండీ ఉపయోగం లేదు. నాలుగు రోజుల క్రితం వరకు ఉన్న తల్లి అకస్మాత్తుగా మరణించడంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలారు. మరోవైపు అన్న ఒకచోట, చెల్లి మరోచోట సంరక్షణ కేంద్రానికి చేర్చడంతో ఆ కుటుంబం నాలుగు ముక్కలైంది. వివరాల్లోకెళితే పామూరుకు చెందిన నిరుపేద రిక్షాపుల్లర్ భార అనారోగ్యంతో జీజీహెచ్‌లో వైద్యం కోసం చేరింది. నయం కాని రోగంతో కొన్నిరోజులుగా వైద్యం పొందుతున్న మహిళ నాలుగు రోజుల క్రితం మరణించడంతో ఆమె మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అయితే భార్యను పోగొట్టుకున్న భర్త ఇద్దరు చిన్న పిల్లలతో మార్చురీ వద్దనే పడిగాపులు కాశారు. అంత్యక్రియలకు కూడా చేతిలో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పలు సామాజిక మీడియాలలో విషయం తెలుసుకున్న చైల్డ్ లైన్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ.సాగర్ ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి దీన స్థితిపై స్పందించిన సాగర్ విషయాన్ని జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్ళగా మార్చురీ వద్దకు చేరుకున్న వారిద్దరు సోమవారం తామే స్వయంగా తమ సొంత డబ్బులతో స్థానిక కొత్తపట్నం బస్టాండ్ వద్ద ముస్లిం శ్మశాన వాటికలో మహిళకు అంత్యక్రియలు నిర్వహించారు. అయితే ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు మరింత బాధకరం, రిక్షా పుల్లర్ అయిన తండ్రి ఆ బిడ్డలను తాను చాకలేని ఇద్దరు బిడ్డలను వదిలేసి వెళ్ళిపోవడంతో సాగర్, దినేష్ కుమార్ వారి సంరక్షణ చర్యలు చేపట్టారు. చిన్నారి పాపకు 2 సంవత్సరాలు వయస్సు ఉండగా, బాబుకు 7 సంవత్సరాల వయస్సు ఉంటుంది. అయితే స్థానిక రామనగర్‌లోని బాలసదన్‌లో వారిద్దరిని చేర్చే ప్రయత్నం చేశారు. కానీ సదన్‌లో 5 సంవత్సరాల వయస్సులోపు వారికి మాత్రమే అవకాశం ఉండటంతో పాపను బాల సదన్‌లో, బాబును స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని బొమ్మరిల్లులో చేర్పించారు. మొన్నటి వరకు నలుగురుగా కలిసి ఉన్న ఆ పేద కుటుంబం వ్యక్తి మరణించడంతో మూడు ముక్కలైపోయింది. ప్రత్యేకించి, అభం శుభం తెలియని చిన్నారులు తల్లిని కోల్పోయి, తండ్రి వదిలేయడంతో దిక్కులేనివారయ్యారు. కనీసం కలిసి కూడా ఉండలేని స్థితిలో చెరోచోట సంరక్షణలో ఉండటం పలువురును కలిచి వేసింది. అయితే మృతి చెందిన మహిళ అంత్యక్రియలను చేయడంలోనూ, చిన్నారుల సంరక్షణ కోసం చూపిన చొరవపై బీవీ సాగర్, దినేష్ కుమార్ సేవను కొందరు ప్రశంసించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	126, 135, 146
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

వైభవంగా గీతాజయంతి



మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గీతా జయంతి సందర్భంగా మార్కాపురం పట్టణంలో సోమవారంరాత్రి శ్రీకృష్ణుని విగ్రహంతో నగరోత్సవం నిర్వహించారు. చెన్నకేశవస్వామి అలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, శ్రీకృష్ణుని విగ్రహాన్ని వివిధ పూలమాలలు, ఆభరణాలతో అలంకరించారు. అనంతరం నాలుగు మాఢవీధులలో కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు, మేళాతాళాలు మంగళవాయిద్యాల నడుమ నగరోత్సవం చేశారు. మహిళలు భగత్ గీతాపారాయణం నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుని, గోపికల వేషధారణలు ఆకట్టుకున్నాయి. విశ్వ హిందూ పరిషత్, హిందూ చైతన్య వేదిక హనుమాన్ శోభా యాత్ర కమిటీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బలిజ సేవా సంఘం అధ్యక్షుడిగా కమతం శ్రీనివాసులు


బలిజ సేవా సంఘం నూతన కమిటీ సభ్యులు

గిద్దలూరు టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు బలిజ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కమతం శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి గోనుగుంట్ల నరసింహారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్‌డీ రామక్రిష్ణ, స్థానిక బలిజ సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.


క్విస్ కళాశాల ఆధ్వర్యంలో యరజర్లలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం

ముగిసిన సేవా కార్యక్రమాలు

ఒంగోలు విద్య, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి వికసిత్ భారత్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఒంగోలు మండలం యరజర్లలో వారం రోజుల పాటు నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలు ముగిశాయి. ఈనెల 24వతేదీ నుంచి 30వతేదీ వరకు యరజర్ల గ్రామంలో పలు కార్యక్రమాలను నిర్వహించినట్లు క్విస్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రిదేవిలు తెలిపారు. విద్యార్థుల్లో సేవా భావం నింపేందుకు, గ్రామస్థుల అవసరాలను తీర్చేందుకు ఈ సేవా కార్యక్రమాలు ఎంతోగానూ దోహదపడ్డాయన్నారు. వారం రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో క్విస్ కళాశాల ఎన్ఎస్ఎస్ హెడ్ డాక్టర్ నవనీత్ కృష్ణ, పీవోలు శిరీష, వేణుగోపాల్, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ వాసుబాబు, కళాశాల సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉన్నారు.


సంతనూతలపాడులో క్యాండిల్స్ వెలిగించి నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ, సీఐటీయూ నేతలు

పెంచలయ్య కుటుంబానికి సాయం అందించాలి

సంతనూతలపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గంజాయి ముఠా చేతిలో హత్యకు గురైన పెంచలయ్య కుటుంబానికి రూ.50లక్షల ఆర్థికసాయం అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బంకాసుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పేర్నమిట్టలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నెల్లూరు జిల్లాలో డీవైఎఫ్ఐ నాయకుడిగా ఉన్న పెంచలయ్యను హత్యచేసిన వారిపై అరెస్టు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.


రాజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ట్రెజరీ అధికారులు

ట్రెజరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడికి సత్కారం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ జనాభా, లెక్కలశాఖ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెజరీ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కాజా రాజ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. స్థానిక జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ట్రెజరీ అధికారులు రాజ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రాజ్‌కుమార్‌ను శాలువతో సత్కరించి బొకే ఇచ్చి అభినందించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ తనకు రాష్ట్ర అధ్యక్ష పదవి వచ్చేందుకు సహకరించిన ట్రెజరీలోని వివిధ విభాగాల అసోసియేషన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రెజరీలో అధికారుల నుంచి ఉద్యోగుల వరకు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీవోలు కెనడి, జే వెంకటేశ్వర్లు, భాగ్యలక్ష్మి, సుధీరా, శ్రీనాథ్, ఆంజనేయులు, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.


రాచవారిపాలెంలో గుండ్లకమ్మనది మ్యాపును పరిశీలిస్తున్న డీఆర్వో ఓబులేశు, ఆర్డీవో, ఇతర అధికారులు

నివేశన స్థలాల కేటాయింపునకు కృషి

మద్దిపాడు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి):గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలోని రాచవారిపాలెం అరుంధతి నగర్ వాసులకు నివేశన స్థలాల కేటాయింపునకు కృషిచేస్తానని డీఆర్వో ఓబులేశు చెప్పారు. నదికి వరద వచ్చినపుడు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారంటూ మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సృజన మాదిగ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారని ఆయన ఆదేశాలతో సోమవారం అరుంధతినగర్‌ను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మద్దిపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ అజయ్ కుమార్ రెడ్డి, ఆర్ఐ రమణయ్య, వీఆర్వో బుల్లయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై విద్యార్థులకు అవహగాహన

ఒంగోలు క్రైం,డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): యువత బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేసి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని రవాణా శాఖ అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కే .జయప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక హర్షిణి కాలేజీలో విద్యార్థులకు రహదారి భద్రతపై రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ యువకులు విద్యార్థులు రహదారి భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం,హెల్మెట్ లేకుండా వాహన చోదన ప్రమాదాలకు కారణం అవుతాయన్నారు. అదేవిధంగా నిబంధనలకు విరుద్ధంగా వాహన చోదన చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ట్రాఫిక్ గుర్తులు పైకూడ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమం

ఎమ్మెల్యే దామచర్ల

నగరంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ


ఒంగోలులో దివ్యాంగునికి పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా కూటమి ప్రభుత్వంలోనే పేదల సంక్షేమం సాధ్యపడుతుందని ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని సోమవారం ఒంగోలులోని 12వ డివిజన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోపే ప్రజలకు ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ అమలు చేసినట్లు తెలిపారు. అందులో ప్రధానమైన పింఛన్ల పెంపుపై తొలి సంతకం చేశారన్నారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, వితంతవులతోపాటు ట్రాన్స్ జెండర్‌లకు పింఛన్ పెంచి అండగా నిలుస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్లు పట్టిందని, అయితే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తొలిరోజే వెయ్యి రూపాయలు పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, మేయర్ గంగాడ సుజాత, కమిషనరు కే. వెంకటేశ్వరరావు, మైనార్టీ కమిషన్ రాష్ట్ర డైరెక్టర్ షేక్ కపిల్ బాషాతోపాటు స్థానిక కార్పొరేటర్ అంబూరి శ్రీనివాసరావు పలువురు పాల్గొన్నారు.

సామాజిక పెన్షన్ల పంపిణీ

మద్దిపాడు :అర్హులైన పేదలకు సామాజిక పెన్షన్ అందించడంలో అధికారులు నిరంతరం కృషిచేయాలని రాష్ట్ర పొగాకు సమాఖ్య ఛైర్మన్ మండవ జయంతి బాబు అన్నారు. సోమవారం మద్దిపాడు ఘడియపూడి కాలనీలో ఆయన పెన్షన్లను పంపిణీ చేశారు. దొడ్డవరప్పాడులో మాజీ సర్పంచ్ గోరంట్ల చిరంజీవి, కొలచనకోట గ్రామంలో దేవబత్తిన ప్రసాద్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నున్న బాలసుబ్రహ్మణ్యం పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పలువురు తెలుగుదేశం, జనసేన నాయకులు పాల్గొన్నారు.

92 శాతం పెన్షన్ల పంపిణీ

సంతనూతలపాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయా గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను సోమవారం సాయంత్రానికి 92 శాతం పంపిణీచేసినట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. మండలంలో 6,672 మంది వివిధ పెన్షన్లకు సంబంధించి 6,091 మందికి పంచాయతీ, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ద్వారా అందించినట్లు ఎంపీడీవో తెలిపారు.


ఘడియపూడిలో పెన్షన్ అందజేస్తున్న పొగాకు సమాఖ్య రాష్ట్ర ఛైర్మన్ మండవ జయంతిబాబు

మిగతావారికి రేపటిలోపు అందజేస్తామన్నారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నీటిసంఘం అధ్యక్షుడు అబ్బూరిశ్రీను, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

90 శాతం పూర్తి

నాగులుప్పలపాడు :మండల పరిధిలోని గ్రామాలలో ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తిచేసినట్లు ఎంపీడీవో తేళ్ల రవికుమార్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని గ్రామాలలో అధికారులు, టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బందితో కలసి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు.నాగులుప్పలపాడులో మండల ప్రత్యేకాధికారి గంగవరపు జోసఫ్‌కుమార్ లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు.

హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన ర్యాలీ


విద్యార్థులతో మాట్లాడుతున్న పొన్నలూరు వైద్యాధికారి మల్లికార్జునరావు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈర్యాలీని స్థానిక కలెక్టరేట్ వద్ద నుంచి ఐఎంఏ హాలు వరకు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సదస్సుకు ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎ. నాగయ్య నాయుడు, డాక్టర్ ఆనంద్‌లు అధ్యక్షత వహించారు. అనంతరం సభలో హెచ్ఐవీ నియంత్రణకు తీసుకోవాల్సిన పలు చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ కే సుధాకర్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ జాలాది మణిబాబు, పూర్వ ఉపాధ్యక్షుడు డాక్టర్ మన్నే వీరయ్య చౌదరి, డాక్టర్ జయశేఖర్, ఏపీఎంసీ ఛైర్మన్ డాక్టర్ కే సుబ్బానాయుడు, డాక్టర్ శివ సీతారామయ్య, డాక్టర్ జాకబ్ జక్కరయ్య, డాక్టర్ శార, డాక్టర్ రాధిక, డాక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు, డాక్టర్ మాల కొండారెడ్డి, డాక్టర్ కృష్ణ, జి. రామ్మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

అవగాహన పెంచుకోవాలి

సింగరాయకొండ : హెచ్ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా సోమవారం సింగరాయకొండలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ అసురక్షిత శృంగారం, రక్తమార్పిడి వంటి పలు కారణాలు వలన హెచ్ఐవీ ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. వ్యాధి పట్ల కొంతమందిలో ఉండే అపోహలు, సందేహాలు శారీరకంగానూ, మానసికంగానూ కుంగదీస్తుంటాయని తెలిపారు. వీటిని తొలగించడానికి వైద్యులను సంప్రదించి వ్యాధిపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు వంశీధర్, రవి, కలైసెల్వం, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నలూరులో..

పొన్నలూరు : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ పీవీ మల్లికార్జునరావు మాట్లాడుతూ హెచ్ఐవీకి కారణాలు, నిరోధానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కృష్ణచైతన్య, రవికిరణ్, శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపాల్ జి.రాజేంద్రబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

మద్దిపాడు : స్థానిక కడియాల యానాదయ్య జూనియర్ కళాశాల విద్యార్థులు కళాశాల నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్రశేఖర్ , పీడీ ఆదినారాయణ, లెక్చరర్లు పాల్గొన్నారు.

హెచ్ఐవీని తరిమికొట్టాలి

ఒంగోలు విద్య : సమాజంలో మహమ్మారిగా మారిన ఎయిడ్స్ భూతాన్ని తరిమి కొట్టాలని ఒంగోలు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి. కళ్యాణి పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు హెచ్ఐవీపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈర్యాలీని ప్రిన్సిపాల్ కళ్యాణి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ కే ప్రతాప్, ఎం. శ్రీనివాసరావు, అధ్యాపకులు మౌనిక, అరుణకుమారి, విద్యార్థినులు ఉన్నారు.

హడలెత్తించిన చైన్‌స్నాచర్

వరుసగా రెండు ప్రాంతాలలో చోరీ

సీసీ ఫుటేజీ సేకరణలో పోలీసులు

ఒంగోలు క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళల మెడలో బంగారం గొలుసులు లాక్కెళుతూ ఓ దొంగ హడలెత్తించాడు. సోమవారం రాత్రి దేవాలయం సమీపంలో ఇరువురు మహిళల మెడలలో గొలుసులు లాక్కెళ్లాడు. లాయర్‌పేట సాయిబాబా గుడి సమీపంలో నడుచుకుంటూ వెళుతున్న మందాడి కోటేశ్వరమ్మ అదే ప్రాంతంలో గూడూరి గుప్తాస్ అపార్ట్‌మెంట్‌లో ఉంటోంది. అమె సాయిబాబా గుడికి వెళ్లి నడుచుకుంటూ అపార్ట్‌మెంట్‌కు వెళుతుండగా ఎదురుగా వచ్చిన 35 ఏళ్ల యువకుడు అమె మెడలో ఉన్న గొలుసు లాక్కొని పరారయ్యాడు. ఈమేరకు ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంటనే అక్కడ సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్నారు పోలీసులు. అదే సమయంలో ఆగంతుకుడు రంగారాయుడు చెరువు సమీపంలోని అయప్పస్వామి గుడి సమీపంలో నడుచుకుంటూ వెళుతున్న కొల్లిపర శారద మెడలో బంగారం చైన్‌ను లాక్కొని పరారయ్యాడు. ఈమేరకు రెండు కేసులు నమోదుచేసుకొని ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రెండు ప్రాంతాలలో పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. అయితే రెండు ప్రాంతాలలో గొలుసులు లాకెళ్లింది ఒక్కడే ఆగంతుకుడు అయి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

ఆటోలో 14 సవర్ల బంగారం అపహరణ

మద్దిపాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ వద్ద 14 సవర్ల బంగారం అపహరించుకుపోయారు. ఈ సంఘటన సోమవారం రాత్రి మద్దిపాడులో చోటుచేసుకుంది. తెల్లబాడు గ్రామానికి చెందిన మల్లిపెద్ది ధనలక్ష్మి ఆమె సోదరి నర్రా సుకన్య పిడుగురాళ్ల నుంచి బస్సులో వచ్చి మద్దిపాడులో దిగారు. అక్కడి నుంచి తెల్లబాడు వెళ్లేందుకు ఆటో ఎక్కారు. వీరితో పాటు మరో ఇద్దరు మహిళలు ఆటో ఎక్కారు. వీరు వెల్లంపల్లి జాతీయ రహదారిపై దిగిపోయారు. ఇంటికి వెళ్లిన అనంతరం ధనలక్ష్మి, సుకన్యలు బ్యాగు పరిశీలించగా అందులో ఉన్న 14 సవర్ల బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో మధ్యలో దిగిపోయిన వారు తస్కరించి ఉంటారని భావించి వెంటనే మద్దిపాడుకు వచ్చి ఎస్ఐ వెంకటసూర్యకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు స్మార్ట్‌జన్ విద్యార్థి ఎంపిక



భావేష్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ డాక్టర్ గీతారాణి

సింగరాయకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు సింగరాయకొండ స్మార్ట్‌జన్ జూనియర్ కళాశాలకు చెందిన డి.భావేష్ ఎంపికయ్యారు. ఈనెల 5,6,7 తేదీల్లో గుంటూరులో నిర్వహించే అండర్-19 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో భావేష్ పాల్గొననున్నారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను కరస్పాండెంట్ డాక్టర్ గీతారాణి, అధ్యాపకులు అభినందించారు.

డిప్యూటీ ఎంపీడీవోగా సూర్యనారాయణ

కొండపి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ ఎంపీడీవో (గ్రామ, వార్డు సచివాలయాల శాఖ)గా నల్లమల్లి సూర్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని సచివాలయాల సిబ్బంది ఇకపై ఆయనకు జవాబుదారీగా పనిచేయాల్సి ఉంటుందని మండల పరిషత్ కార్యాలయ ఏవో రామకృష్ణ తెలిపారు.

మొక్కజొన్నలు కొనుగోలు చేయాలి

ఒంగోలు(రూరల్),డిసెంబరు1(ఆంధ్రజ్యోతి):మొక్కజొన్నలు పండించిన రైతుల వద్ద నుంచే వ్యాపారులు,పరిశ్రమల వారు కొనుగోలు చేయాలని జేసీ ఆర్ గోపాలకృష్ణ స్పష్టంచేశారు. సోమవారం జేసీ చాంబర్‌లో మొక్కజొన్నలు కొనుగోలు చేసే వ్యాపారులు, ఫ్యాక్టరీలవారితో సమావేశం జరిగింది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని జేసీ సూచించారు.


మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ


ప్రమాదంలో దెబ్బతిన్న కారును పరిశీలిస్తున్న పోలీసులు

ఎంపీడీవో కారును ఢీకొన్న మరో కారు

● డ్రైవర్‌కు గాయాలు

నాగులుప్పలపాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులకు గురై రోడ్డు పక్కన ఆపి పరిశీలిస్తున్న ఎంపీడీవో కారును వెనక నుంచి వేగంగా వచ్చిన మరో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ గాయపడిన సంఘటన ఒంగోలు చీరాల జాతీయ రహదారిపై మద్దిరాలపాడు వద్ద చోటుచేసుకొంది. అందిన వివరాల మేరకు చినగంజాం ఎంపీడీవో ధనలక్ష్మి సోమవారం రాత్రి విధులు ముగించుకొని తోటి కార్యాలయ సిబ్బందితో కలసి తన కారులో ఒంగోలు వెళుతున్న క్రమంలో చేకూరపాడు వద్దకు రాగా వారు ప్రయాణిస్తున్న కారు మరమ్మతులకు గురికావడంతో డ్రైవర్ శివ కారును రోడ్డు పక్కన ఆపి పరిశీలిస్తుండగా వెనక నుంచి వచ్చిన మరో కారు ఢీకొంది.దాంతో శివ గాయపడటంతో చికిత్స నిమిత్తం 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాదంలో అటుగా వెళ్తున్న మోటార్ సైకిలిస్ట్‌కు సైతం గాయాలైనట్లు సమాచారం.


ప్రమాణ స్వీకారం చేస్తున్న వల్లూరమ్మ ఆలయ పాలక మండలి సభ్యులు

వల్లూరమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

● మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి

● ఘనంగా ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

వల్లూరు (కొండపి), డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : వల్లూరమ్మ ఆలయ అభివృద్ధికి పాలక మండలి కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. సోమవారం టంగుటూరు మండలంలోని వల్లూరమ్మ ఆలయ ఆవరణలో నిర్వహించిన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడుతున్న సీఎం చంద్రబాబుకు, ప్రజా ప్రభుత్వానికి వల్లూరమ్మ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, ఒడా ఛైర్మన్ రియాజ్ పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చదలవాడ చంద్రశేఖర్, సీనియర్ నాయకులు బెల్లం జయంత్‌బాబు, ఈదర ప్రభాకర్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ బొజ్జా శ్రీనివాసులు, సభ్యులు తుళ్లూరు వెంకటశేషమ్మ, వల్లూరి జ్యోతి, మొలకలపల్లి లక్ష్మీనారాయణ, వరికూటి సుమన్, అంబోరి అనూరాధ, తక్కెళ్లపాటి వెంకయ్య, సంగర రాజేష్, వారణాశి రామమూర్తి, బల్లిపల్లి మౌనిక, మొలకలపల్లి గీతాలక్ష్మి, బద్దిపూడి ఉమాశంకర్‌లతో ఈవో రమేష్ ప్రమాణ స్వీకారం చేయించారు.



సీపీఎం ఒంగోలు నగర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి మాబు

మహిళా మార్ట్ అక్రమాలపై విచారణ చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో మహిళా మార్ట్ పేరుతో భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయని, దీనిపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు డిమాండ్‌చేశారు. స్థానిక సుందరయ్య భవన్ సోమవారం జరిగిన సీపీఎం ఒంగోలు నగర కమిటీ సమావేశానికి నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాబు మాట్లాడుతూ మార్ట్ విషయంలో ప్రభుత్వం, జిల్లా అధికారుల నిర్లక్ష్యమే అవినీతికి కారణమని ఆరోపించారు. 2022లో మహిళా మార్ట్ పేరుతో పొదుపు సంఘాల సభ్యులు ఒక్కొక్కరి నుంచి రూ.150 వంతున సుమారు రూ. 55 లక్షలు వసూలు చేశారన్నారు. ఆర్పీల వద్ద నుంచి ఏసీ, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తామని ఒక్కొక్కరి వద్ద నుంచి మూడువేలు వసూళ్ళు కలిపి మొత్తం రూ. 68 లక్షలు సేకరించినా ప్రస్తుతం ఖాతాలో కేవలం రూ. 27లక్షలు మాత్రమే ఉందన్నారు. ఇందులో భారీ అక్రమాలు జరిగాయని, దీనిపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు తంబి శ్రీనివాసులు, వీరస్వామి, ఎస్‌డీ హుస్సేన్, టి. మహేష్, బీవీ రావు, ఆదిలక్ష్మి తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులతో దళిత నేతలు

ఇంటిని కూల్చినవారిపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టరేట్ ఎదుట బాధితుల ధర్నా

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలోని నెహ్రూకాలనీలో 20 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న ఈద జాస్మిన్ ఇంటిని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన ధర్నాలో రవిశంకర్ మాట్లాడుతూ నెహ్రూకాలనీలో డీకే ప్రభుత్వ భూమిలో 20 ఏళ్ల నుంచి రేకుల షెడ్డువేసుకొని హోటల్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఆ స్థలానికి పన్ను, కరెంటు మీటర్ కూడా ఉందన్నారు. అయితే మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇతరులకు కలిసి దౌర్జన్యంగా ఎక్స్‌కవేటర్ పెట్టి ఇంటిని కూల్చడం దుర్మార్గంగా ఉందన్నారు. అన్యాయంగా, దౌర్జన్యంగా ఇంటిని కూల్చివారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో ఉద్యమం చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం. వెంకట్, గణేష్, కృష్ణ, స్రవంతి, మల్లికార్జున, బాలమ్మ, చెన్నమ్మ, ఈద జాస్మిన్, రంగమ్మ, సుమలత, కావేరి, ఏసుదాసు, రమణ , సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా గిరిప్రదక్షిణ

మద్దిపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):మల్లవరం శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం శ్రీవారి వనం కమిటీ ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు గోవింద నామస్మరణ చేస్తుండగా గోమాతకు పూజలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు మార్నేని కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొగాకు సమాఖ్య ఛైర్మన్ మండవ జయంతిబాబు, జయలక్ష్మి దంపతులు, మండవ గోపీనాథ్ దంపతులు పాల్గొని గిరిప్రదక్షిణకు అనువుగా సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సహకారం అందిస్తామని తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీవోగా రవికుమార్

సంతనూతలపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండల డిప్యూటీ ఎంపీడీవో(గ్రామ, వార్డు సచివాలయం అధికారి)గా మైనంపాడు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న పి.రవికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఎంపీడీవో సురేష్‌బాబు , మండలపరిషత్, సచివాలయ సిబ్బంది డిప్యూటీ ఎంపీడీవో రవికుమార్‌కు అభినందనలు తెలిపారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా భరత్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) జాతీయ కార్యవర్గ సభ్యులుగా నెల్లూరు విభాగ్‌సంఘటనా కార్యదర్శి భరత్‌కుమార్ నియమితులయ్యారు. ఇటీవల డెహ్రాడూన్‌లో జరిగిన ఏబీవీపీ జాతీయ మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రఘురాజ్ కిషోర్ తివారి ప్రకటించారు. తనకు జాతీయ కార్యవర్గ సభ్యునిగా అవకాశం కల్పించిన జాతీయ అధ్యక్షుడు, ఇతర సభ్యులకు భరత్ కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షోభంలోనూ సంక్షేమం ఘనత ప్రజా ప్రభుత్వానిదే

లింగోజీపల్లిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కంభం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సంక్షోభంలోనూ ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత ప్రజా ప్రభుత్వానిదేనని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా సోమవారం కంభం మండలం లింగోజీపల్లిలో శాసనసభ్యులు అశోక్ రెడ్డి ఇంటింటికీ తిరిగి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన గత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెన్షన్లను దారుణంగా మోసం చేశారన్నారు. ఆయన ఇచ్చిన హామీ వెయ్యి రూపాయల పెన్షన్ పెంచేందుకు నాలుగేళ్ల పట్టిందన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్క సంతకంతో వెయ్యి రూపాయలు పెంచిన ఘనత చంద్రబాబు నాయుడుదేనన్నారు. అధికారంలోకి వచ్చిన ఈ 17 నెలల్లో రాష్ట్రంలో 50,763 కోట్లు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఒక్కటేనని చెప్పారు. పేదలకు సేవ చేయడమే తమ లక్ష్యమని, ఇది పేదల ప్రభుత్వమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంభం మండల పార్టీ అధ్యక్షుడు తోట వెంకటశ్రీనివాసరావు, కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనూరు భూపాల్ రెడ్డి, సొసైటీ బ్యాంకు చైర్మన్ కేతం శ్రీనివాసులు, రాష్ట్ర నగర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరేపల్లి మల్లికార్జున, లింగోజీపల్లి గ్రామ నాయకులు తాటికొండ వెంకటేశ్వర్లు, కాశయ్య, ఎంపీడీవో వీరభద్రాచారి, తహసీల్దార్ కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

పెరిగిన పింఛన్‌తో రెండింతల ఆనందం

వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రభుత్వం ఏర్పడ్డాక ఒక్కసారిగా పెరిగిన పింఛన్‌తో పింఛన్‌దారుల్లో ఆనందాలు రెండింతలు అయ్యాయని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు చెప్పారు. మండలంలోని గంగపాలెంలో ఎన్టీఆర్ భరోసా - సామాజిక భద్రత పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి పింఛన్‌దారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఏడాదికి ఒకసారి రూ.250 పెంచుకుంటూ కాలం దాటిస్తే ప్రజా ప్రభుత్వం వచ్చిన వెంటనే వితంతు పింఛన్ వెయ్యి రూపాయలు, దివ్యాంగుల పింఛన్ రెండు వేలు, మంచానికే పరిమితమైన పింఛన్‌దారులకు ఐదువేలు పెంచి చరిత్రలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలిచారని అన్నారు. అనంతరం గ్రామంలో మినీ గోకులం షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, ఎంపీడీవో బండారు శ్రీనివాసులు, పేరం రమణా రెడ్డి, పేరిశాటి శ్రీను, ఎంఈఓ మంత్రునాయక్, షేక్ మస్తాన్‌వలి (మ్యాక్స్), పంచాయతీ కార్యదర్శి కేశనపల్లి శివలింగమ్మ, చలమయ్య, ఆనంద్, మాగులూరి వెంకటేశ్వర్లు, బక్కయ్య, పఠిదపు వెంకటరావు, గాజుల వెంకటనారాయణ, రామా నాయుడు, కొమ్ము గాలయ్య పాల్గొన్నారు.


గంగపాలెంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎరిక్షన్ బాబు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పెద్దదోర్నాల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తోందని ఎంపీడీవో ప్రసూనదేవి చెప్పారు. స్థానిక ఏపీఎం కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎంపీడీవో ప్రసూనదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ మాబుతో కలిసి సోమవారం పంపిణీ చేశారు. మండలంలోని చిన్నగుడిపాడులో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దొడ్డా శేషాద్రి, ఐనేని నాగమల్లేశ్వర్రావు, హసనాబాద్ గ్రామంలో ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లను సచివాలయం అధికారులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఆయా కార్యక్రమంలో టీడీపీ నాయకులు పబ్బతి సుబ్బారావు, చంటి, కేసుబ్బారెడ్డి, లక్ష్మయ్య, షేక్ వహీదా, ఉస్మాన్, పెద్ద అంకయ్య, బాబు, ఎర్రయ్య పాల్గొన్నారు.

అవగాహనతోనే హెచ్ఐవీ కట్టడి

మార్కాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిని అవగాహనతోనే కట్టడి చేయవచ్చని సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో రవీంద్రరెడ్డి చెప్పారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఏపీ సాక్స్, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవో రవీంద్రరెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ జరిగింది. అనంతరం పలువురు హెచ్ఐవీ రోగులకు న్యూట్రిషన్ ఫుడ్ కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోసీ పీడీ ఆనంద్ బెంజిమెన్, పీఎం బ్రహ్మయ్య, ఎంఈపీ ఫైజల్‌ఖాన్, ఏఎన్ఎమ్ విజయలక్ష్మి, ఏఆర్‌టీ కౌన్సిలర్ పోతురాజు, ఐసీటీసీ కౌన్సిలర్ అరుణ, ఎస్ఏసీ కౌన్సిలర్ రాజు, ఎస్‌టీడీ కౌన్సిలర్ వెంకట్ పాల్గొన్నారు.


మార్కాపురంలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఏవో రవీంద్రరెడ్డి

దోర్నాలలో...

పెద్దదోర్నాల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో విద్యార్థులు ఎయిడ్స్‌పై పలు సూచనలు చేస్తున్న ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది జయసింహ, ఎల్లారావు పాల్గొన్నారు.

రాచర్లలో...

రాచర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ వ్యాధికి మందులేదని నివారణ ఒక్కటే మార్గమని ఎంపీడీవో వెంకటరామిరెడ్డి చెప్పారు. అనుమలవీడు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి బాలకుమార్ రెడ్డి వారి సిబ్బంది రాచర్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రంగనాయకులు, ప్రసాద్, వీరకుమారి, లక్ష్మీ, రామాంజనేయులు పాల్గొన్నారు.

నాలుగు రోజులపాటు వరి పంటను కోయవద్దు

కంభం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం దిత్వా తుఫాన్ ప్రభావం ఉన్న నాలుగు రోజుల వరకు వరి పంటను రైతులు కోయవద్దని మార్కాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీ నాయక్ చెప్పారు. సోమవారం ఆయన కంభం మండలంలోని తురిమెళ్ల గ్రామంలో వరి పొలాలను పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి షేక్ మహమ్మద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


తురిమెళ్లలో వరి పంటను పరిశీలిస్తున్న ఏడీ బాలాజీ నాయక్

త్రిపురాంతకంలో...

త్రిపురాంతకం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వర్షాల నేపథ్యంలో రైతులు వరి కోతలు మొదలుపెట్టవద్దని మండల వ్యవసాయాధికారి నంగూసీ తహసీల్దార్ కృష్ణమోహన్ చెప్పారు. మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో దాదాపు 30 ఎకరాల్లో వరికోతలు మొదలుపెట్టినట్లు గుర్తించారు. వాతావరణం అనుకూలించే వరకు రైతులు వరికోత కోయకుండా వాయిదా వేసుకోవాలని వారికి చెప్పారు.

ఎర్రగొండపాలెంలో...

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ నేపథ్యంలో రైతులు పంటలను కాపాడుకోవాలని ఎర్రగొండపాలెం ఏవో నీరజ చెప్పారు. మండలంలోని తమ్మడపల్లిలో రైతులతో సమావేశం నిర్వహించారు.

పొదిలిలో...

పొదిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులు పంటలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో శ్రీనివాసరెడ్డి చెప్పారు. సోమవారం ఏలూరు గ్రామంలో వరి, కంది పంటలను పరిశీలించారు. వర్షాలకు కోతలు కోయవద్దని రైతులకు సూచించారు.

'సీఎం' చెక్కుల పంపిణీ

తర్లుపాడు, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి పంపిణీ చేశారు. తర్లుపాడు గ్రామానికి చెందిన బత్తుల పెద్ద కాశయ్యకు రూ.32,100 చెక్కు, కలుజువ్వలపాడుకు చెందిన మేకల వెంకట లక్ష్మయ్యకు రూ.80,185, మంగళకుంట గ్రామానికి చెందిన దేశబోయిన రంగప్రసాద్‌కు రూ.92,495, తుమ్మలచెరువు గ్రామానికి చెందిన బత్తుల ఆదినారాయణకు రూ.40,295, మొత్తం రూ.2,45,075 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుల్లనూతల గోపీనాథ్ చౌదరి, ఈర్ల వెంకయ్య, కాలంగి శ్రీనివాసులు, మేకల వెంకట్, గౌతుకట్ల సుబ్బయ్య, వెన్న వెంకట్ రెడ్డి, నంబుల లక్ష్మయ్య పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

కొనకనమిట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని డీఈ ఈశ్వర శ్రీనివాసులు అన్నారు. సోమవారమిక్కడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బకాయిలు సుమారు రూ.34లక్షలను త్వరితగతిన వసూలు చేయాలని ఆదేశించారు. ఏడీఏ హరిబాబు, ఏఈ బ్రహ్మం పాల్గొన్నారు.

ఘనంగా గీత పారాయణం

గిద్దలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీమద్రామ హరినాథ క్షేత్రం ఆవరణలో ఉన్న రాధాకృష్ణ మందిరంలో గీతాజయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. రాధాకృష్ణులకు పంచామృతాభిషేకం చేశారు. అష్టోత్తర శతనామావళి పూజను నిర్వహించారు. మహిళలు 18 అధ్యాయాల గీతను పారాయణం చేశారు. సత్యసాయి ధ్యానమండలి అధ్యక్షుడు బచ్చు వెంకటేశ్వర్లు, రిటైర్డ్ లెక్చరర్ ఎస్.వెంకటేశ్వర్లు, శ్రీకృష్ణ హరినాథ భక్తసమాజం అధ్యక్షుడు నటుకుల శ్రీనివాసులు, కార్యదర్శి తుమ్మలపెంట శ్రీనివాసులు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు జనార్దన్ పాల్గొన్నారు.

మృతి చెందిన బాలిక కుటుంబానికి ఆర్థికసాయం

రాచర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో మృతి చెందిన బాలిక కుటుంబానికి ప్రభుత్వ స్వాంతన కార్యక్రమంలో భాగంగా రూ.3లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించినట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మేరీమంజుల చెప్పారు. 10వ తరగతి చదువుతున్న కొకారి కర్త అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ గత ఆగస్టు 16న మృతి చెందింది. బాలిక కుటుంబం ఆర్థిక పరిస్థితి, తదితర విషయాలను గురుకులాల డీసీవో జయ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె విషయాన్ని ఉన్నతాధికారులతో మాట్లాడి బాలిక కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు తనవంతు కృషి చేశారు. స్పందించిన ప్రభుత్వం బాలిక కుటుంబానికి రూ.3లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ఈ మేరకు ఈ నెల 2వ తేదీ అమరావతిలో ఆ చెక్కును బాలిక తల్లి మనోహర మృత కుటుంబానికి అందజేయనున్నారు.

పింఛన్ సొమ్మును సద్వినియోగం చేసుకోండి

రాచర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని రామాపురం సొసైటీ బ్యాంక్ చైర్మన్ భవనం పుల్లారెడ్డి చెప్పారు. మండలంలోని యడవల్లి గ్రామంలో సోమవారం ఆయన పింఛన్లను పంపిణీ చేశారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి

రాచర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డ వెంకట సుబ్బారెడ్డి, ఎన్నిసెల్ కార్యదర్శి గోన ప్రతాప్ కుమార్ చెప్పారు. మండలంలోని రాచర్ల జెపి చెరువు, గుడిమెట్ట, ఎడవల్లి, సత్యవోలు, ఒద్దులవాగుపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సోమవారం వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కె. యోగానంద్, రామాపురం సొసైటీ చైర్మన్ భవనం పుల్లారెడ్డి, గుడిమెట్ట నర్సింహారెడ్డి కాశిరెడ్డి, బీసీ సెల్ అధికార ప్రతినిధి నల్లబోతుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

గంజాయి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి

మార్కాపురం రూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : పెండయ్యను హత్య చేసిన గంజాయి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుమ్మా బాలనాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పెద్ద నాగులవరం గ్రామంలో సోమవారం కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెండయ్య హత్యకు కారణమైన వారిని శిక్షించాలని నిరసన చేశారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వండి

రాచర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ఉపాధ్యాయ జిల్లా అధ్యక్షుడు కె. ఎర్రయ్య చెప్పారు. సోమవారం ఆయన అనుములవీడు, జేపీ చెరువు, అనుములపల్లి, రాచర్ల, చోళ్లవీడు, ఆకవీడు గ్రామాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల సభ్యత్వ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సర్వీస్ రూల్స్‌పై ఆర్డినెన్స్ తెచ్చి ఉమ్మడి సీనియార్టీ ప్రకారం ఉద్యోగోన్నతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు జోనల్ కన్వీనర్ ఎం బాలగురవయ్య, మండల శాఖ అధ్యక్షుడు జి. శ్రీనివాసులు, సంఘ సభ్యులు చంద్రమోహన్, రామకృష్ణ, ప్రసాద్, గోపాల్, రవి ప్రసాద్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ ఎంపీడీవో బ్రహ్మయ్య

కంభం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కంభం ఉప మండల అభివృద్ధి అధికారిగా దేవరశెట్టి బ్రహ్మయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొమరోలు మండలంలో అధికారిగా విధులు నిర్వహిస్తున్న బ్రహ్మయ్య ఉద్యోగోన్నతి పొంది కంభం మండల అభివృద్ధి అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

స్కూల్ బస్సులు నిబంధనలు పాటించాలి

మార్కాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ బస్సులు మోటారు వాహనాల చట్టం నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని మార్కాపురం ఎంవీఐ ఎం.మాధవరావు హెచ్చరించారు. రవాణాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని స్కూల్ బస్సులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొత్తం 38 బస్సులను తనిఖీ చేసి ఎఫ్‌సీఎస్ లేని కారణంగా 2 బస్సులకు నోటీసులు ఇచ్చినట్లు ఎంవీఐ మాధవరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సీటు దగ్గర హేమర్ ఉండాలని చెప్పారు. పనిచేసే ఫైర్ సిలిండర్లు, ఫస్ట్ ఎయిడ్ మెడికల్ కిట్లు తప్పకుండా బస్సులో ఉండాలన్నారు. బస్సు ఇంజన్‌కు తప్పనిసరిగా ఎఫ్‌డీఎస్ బిగించాలని చెప్పారు.

నేడు దోర్నాల మండల సర్వసభ్య సమావేశం

పెద్దదోర్నాల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసూనదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రగతిపనులు, సమస్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష ఉంటుందని, జడ్‌పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఆయా శాఖాధికారులు విధిగా హాజరుకావాలని ఆమె కోరారు.

నేడు మార్కాపురం జిల్లా విజయోత్సవ ర్యాలీ

గిద్దలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం జిల్లా ఏర్పడిన సందర్భంగా మంగళవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు మార్కాపురం జిల్లా సాధన సమితి కన్వీనర్ పిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభం అవుతుందని, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, మాజీ సైనికులు, ఆర్టీసీ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు, కార్మిక సంఘాల సభ్యులు ర్యాలీలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

మాజీ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని ధర్నా

మార్కాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దరిమడుగు గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ శంకుస్థాపనను అడ్డుకున్న మాజీ సర్పంచ్ జవ్వాజి రామాంజులరెడ్డిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు సోమవారం ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ దరిమడుగు గ్రామంలో దళితు లజాతిపిత అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు శిలాఫలకాన్ని దళిత సంఘాలు ఆవిష్కరించాయన్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ రామాంజులరెడ్డి వెంటనే అంబేడ్కర్ శిలాఫలకం ముక్కా కంచెను ఏర్పాటు చేసి దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించారని చెప్పారు. అనంతరం సమస్యను సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో రవీంద్రరెడ్డికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతగుంట్ల బాబు, బీసీవై పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూతపాటి రాజు, దళిత నాయకులు ఎరా మాంజనేయులు, ప్రభుదాసు, దాసు, ఇర్మియా, సునీల్ పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి

పుల్లలచెరువు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : భగవద్గీత పుట్టిన రోజు గీతా జయంతిని పుల్లలచెరువులో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక బ్రహ్మంగారి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ శ్రీకృష్ణుడు యుద్ధంలో అర్జునుడికి గీతోపదేశం చేసిందని ఈ రోజున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వడ్లమాను సుబ్రమణ్యంచారి, చెన్నకేశవులు అనిల్, జీవీ గురునాథం, అనిల్‌చారి, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

పేదల మనిషి 'మాగుంట'

పొదిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పేదల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహామనిషి మాగుంట సుబ్బరామిరెడ్డి అని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి చెప్పారు. సుబ్బరామిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం ప్రారంభం

పెద్దదోర్నాల, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీఅయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని తహసీల్దారు ఆశోక్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు బొగ్గరపు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గత 18 ఏళ్లుగా అయ్యప్ప, శివ దీక్షధారులతో పాటు శ్రీశైలం వెళ్లే భక్తులకు దాతల సహాయంతో మండలం రోజుల పాటు అన్నదానం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 1 నుంచి జనవరి 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎవరైనా దాతలు విరాళాలు అందిస్తే మరింత ఉపయుక్తంగా ఉంటుందని కోరారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు సాంబయ్య, ఆలయ కమిటీ పెద్దలు బొగ్గరపు రమేశ్, సుబ్బనారాయణ, గాలి జగన్మోహనరెడ్డి, జి.శ్రీనివాసాచారి, రాచకొండ రామారావు, వేణు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పూర్తికి కట్టుబడిన ప్రభుత్వం

రాచర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనుల పూర్తికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని టీడీపీ నేతలు బత్తిని రామకృష్ణ, బత్తిని రాజశేఖర్ చెప్పారు. మండలంలోని చోళ్లవీడు గ్రామంలోని వేమయ్య స్వామి ఆలయ వెనుక భాగంలో సోమవారం ఎమ్మెల్యేల సహాయంతో మరం చుట్టూ ఉన్న కంప చెట్లను తొలగించారు. తిరుపతి, రంగస్వామి, అంజనేయులు, వీర్ల అసిస్టెంట్ ప్రసాద్, పంచాయితీ కార్యదర్శి ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి మార్కాపురంలో పత్తి కొనుగోళ్ల ప్రారంభం

అవీఇవీ

వ్యవసాయ మార్కెట్ యార్డులో కేంద్రం : ఏవో లక్ష్మీనారాయణ

పెద్దారవీడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : కాటన్ కార్పొరేషన్ తరఫున మార్కాపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో బుధవారం నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం అవుతాయని ఏవో లక్ష్మీనారాయణ చెప్పారు. మండలంలోని కుంటపురం, పుచ్చకాయలపల్లి, గొబ్బూరులలో నిల్వ ఉన్న పత్తిని సోమవారం పరిశీలించారు. క్వింటా పత్తికి రూ.8110 మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం 8 దాటకుండా ఉంటే రూ.8110 చెల్లించనున్నట్లు చెప్పారు. తేమ పెరిగిన ప్రతి ఒక్క శాతానికి రూ.81 తగ్గిస్తారన్నారు. పెద్దారవీడు మండలంలో సుమారు 8000 క్వింటాళ్ల పత్తి రైతుల వద్ద నిల్వ ఉన్నట్లు తెలిపారు. రైతులు వెంటనే రైతు సేవా కేంద్రాలలో పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఓ బాలునాయక్, డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌కుమార్


ఎంపీడీవోకి బొకే అందిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్ కుమార్

రాచర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండల డిప్యూటీ ఎంపీడీవో(జీఎస్‌డబ్ల్యూఎస్)గా ఓటికే శ్రీనివాస్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ జీఎస్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి పొందారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎంపీడీవో వెంకట రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటేష్, జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, స్థానిక కార్యదర్శి ఎంపీ నాయక్, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం అందజేత


మాట్లాడుతున్న న్యాయవాది అన్వర్ బేగ్

మార్కాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల న్యాయసేవ అధికార సంస్థ ద్వారా పేదలకు ఉచిత న్యాయసేవలు అందించనున్నట్లు న్యాయవాది అన్వర్ బేగ్ తెలిపారు. స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో సోమవారం మండల న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాది బేగ్ మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం కావాల్సిన వాళ్లు మండల న్యాయసేవ అధికార సంస్థను సంస్థను సంప్రదించాలని చెప్పారు. ఎయిడ్స్ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆ వ్యాధి సోకినవారిని అంటరానివారిగా చూడకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పానల్ న్యాయవాది కడియం రామయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మనోసేన్, డాక్టర్ గ్రావణితేజ్, పారా లీగల్ వాలంటీర్లు బాషా, ఆదినారాయణ, పవన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఈఈ నాగేశ్వరరావు

మార్కాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మార్కాపురం ఈఈ పి.వి.నాగేశ్వరరావు చెప్పారు. స్థానిక తర్లుపాడు రోడ్డులోని ఎస్సీ బీసీ కాలనీలోని డ్వాక్రా బజార్‌లో సోమవారం సాయంత్రం దిత్వా తుఫాన్ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అప్రమత్తత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం వారికి అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా ప్రజల నుంచి అందే సమస్యలను తక్షణమే ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. పెద్దపాటి సమస్యలపై వెంటనే విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈలు ఎం.శివానాయక్, ఏఈలు యశోధ, యేర్వ నాగేంద్రరెడ్డి, ఎస్.హనుమానాయక్, జోడ భీమానాయక్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీది త్యాగాల చరిత్ర

ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావేద్

బేస్తవారపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన అనేక మంది త్యాగధనులను స్మరించుకుంటూ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమం చేపట్టినట్లు ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావేద్ చెప్పారు. జిల్లా స్థాయిలో కాంగ్రెస్ పార్టీ పటిష్ఠత, నాయకత్వ వైఖరులపై క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ శ్రేణుల అభిప్రాయాల సేకరణలో భాగంగా సోమవారం ఆయన బేస్తవారపేట మండలంలో పర్యటించారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు చిలకల వెంకటేశ్వర్లురెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న లోటుపాట్లను నాయకులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ పరిశీలకులు జాన్ బాబు, ఆర్.ఎస్. శేష్ తదితరులు పాల్గొన్నారు.

కంభం జీజేసీ రెడ్ రిబ్బన్ క్లబ్‌కు అవార్డు


జడ్జి నుంచి అవార్డు అందుకుంటున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తిరుమలయ్య

కంభం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కళాశాల స్థాయి రెడ్ రిబ్బన్ క్లబ్ కార్యకలాపాల నిర్వహణలో ప్రత్యేకించి హెచ్ఐవీ నిరోధక ప్రచారం అవగాహన కల్పించడంలో కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ప్రతిభను అందుకుని జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ వారి ఉత్తమ సేవా పురస్కారం అందుకుంది. ప్రపంచ ఎయిడ్స్ దే సందర్భంగా ఈ అవార్డును జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జిల్లా న్యాయ సేవా సహకార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ చేతుల మీదుగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తిరుమలయ్య, నోడల్ అధికారి వీరనారాయణ అవార్డును, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. అలాగే ఎయిడ్స్ డే సందర్భంగా ఉత్తమ పెయింటింగ్ చిత్రాన్ని గీసిన సీనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూప్ విద్యార్థి ఏ వంశీకృష్ణను అభినందించారు. కళాశాల అవార్డు రావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్, ఇంటర్మీడియట్ విద్య మండలి పరీక్షల నియంత్రణ అధికారి సైమన్ విక్టర్ హర్షం వ్యక్తం చేశారు.

వృద్ధులకు పింఛన్ ఆదరువు

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



దివ్యాంగునికి ఎన్టీయార్ భరోసా పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వృద్ధులకు పింఛన్ ఎంతో ఆదరువుగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 7వవార్డులో ఎన్టీయార్ భరోసా పింఛన్ నగదును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా పింఛన్‌ను రూ.4వేలు పెంపుపై ఇచ్చిన హామీని ప్రజాప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. ప్రతి నెలా ఎన్టీయార్ భరోసా పింఛన్‌తో కోట్లాది రూపాయల భారం పడుతున్నప్పటికీ ఇచ్చిన హామీని తుచ తప్పకుండా అమలుచేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదేనని అన్నారు. ప్రజలు అర్థంచేసుకుని ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. కనిగిరి అభివృద్ధికి సీఎం చంద్రబాబు ఎంతో తోడ్పాటునందిస్తున్నారన్నారు. అనంతరం ఛాయ్ కార్యక్రమంలో భాగంగా వార్డులో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పట్టణంలోని 7వ వార్డు కొత్తూరులో పర్యటించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంతవరకు డ్రైనేజీ కాలువల్లో పూడిక పనులు చేపట్టలేదని స్థానికులు వాపోయారు. వెంటనే వార్డుల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డిని ఆదేశించారు. పీఎంకిసాన్ పథకం కింద తమకు నగదు జమ కాలేదని ఓ మహిళ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఏడీఏ జైనులాబ్దిన్‌ను సమస్యను పరిష్కరించాలని సూచించారు. అనంతరం మాగుంట సుబ్బరామిరెడ్డి వర్ధంతి సందర్భంగా కొత్తూరులోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో విద్యుత్ ఏఈ పవన్ కుమార్, ఆర్ఐ సుధాకర్, నాయకులు వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి), రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి, ఫిరోజ్, అహ్మద్, రోషన్ సంధాని, జంషీర్, ఏఎంసీ డైరెక్టర్ షేక్ వాజిదాబేగం, బుల్లా బాలబాబు, అహ్మద్, మూలె బాలిరెడ్డి, గుడిపాటి ఖాదర్, కరణం అరుణ, తులసి, స్వప్న, పార్వతి, నజిముద్దీన్, బాలు ఓబులరెడ్డి, గంగవరపు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



పింఛన్‌లు పంపిణీ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

తాళ్లూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం పార్టీలకతీతంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి పథకాలు అందిస్తూ ప్రజారంజక పాలన సాగిస్తున్నదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని కొర్రపాటివారిపాలెం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల ఆనందం చూడటమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు క్రమంతప్పకుండా 1వ తేదీనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నారన్నారు. ఎన్నికల వరకే రాజకీయమని, తరువాత నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించి ముందుకుసాగుతున్నట్లు చెప్పారు. స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందినా నిరుత్సాహపడక ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నట్టు చెప్పారు. నూతనంగా స్పౌజ్ కింద మంజూరయిన నలుగురు లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేశారు.

కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, సర్పంచ్ కె.శ్రీదేవిరామయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, మానం రమేష్‌బాబు గొల్లపూడి వేణుబాబు, రామయ్య, గొల్లపూడి జి.రమణారెడ్డి, వి.సుబ్బయ్య రాచకొండవెంకట్రావు, విద్యాసాగర్, నాగార్జునరెడ్డి, పిన్నిక రమేష్, అనపర్తి సుబ్బారావు, ఎంపీడీవో అజిత, తహసీల్దార్ రమణారావు, ఏపీఎం దేవరాజ్, ఏపీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో సుబ్బయ్య, ఏవో ప్రసాదరావు, సీఐ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

కాగా, దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకుడు కడియాల లలిత్‌సాగర్ ఈనెల 4న ఆయన పుట్టినరోజు సందర్భంగా కొర్రపాటిపారిపాలెంలో టీడీపీ శ్రేణులు ముందస్తు జన్మదిన వేడుకలు నిర్వహించారు. గ్రామంలో, ఎస్సీ కాలనీల్లో బర్త్‌డే కేక్‌ను కార్యకర్తలు, అభిమానులు మధ్య డాక్టర్ లలిత్‌సాగర్, డాక్టర్ లక్ష్మి దంపతులు కట్ చేసి పంచిపెట్టారు.

వెనుకబడిన ప్రాంత అభివృద్ధికి పరిశ్రమలు అవసరం

వీసీపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రాంత అభివృద్ధికి పరిశ్రమల ఏర్పాటు ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని దివాకరపల్లి సమీపంలో నిర్మితమవుతున్న రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌ను కందుకూరు, పర్చూరు ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, ఏలూరి సాంబశివరావు, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో కలిసి సోమవారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న ప్లాంట్‌కు సంబంధించిన పనులను వారు పరిశీలించారు. ప్లాంట్ స్థలాన్ని సందర్శించిన ప్రజాప్రతినిధులు అక్కడ జరుగుతన్న పనుల పురోగతిని ప్లాంట్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ప్రాంతీయ రైతులకు, యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించడంలో ఈబయోగ్యాస్ ప్లాంట్ కీలకపాత్ర పోషిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. ప్లాంట్ ఏర్పాటుకోసం సేకరించిన భూముల వివరాలు, ప్లాంట్ నిర్మాణం పూర్తయిన తరువాత ప్రజలకు కలిగే ప్రయోజనాలు, యువతకు లభించే ఉద్యోగ ఉపాధి అవకాశాలను సహచర ఎమ్మెల్యేలకు డాక్టర్ ఉగ్ర వివరించారు.

అనంతరం అక్కడికి వచ్చిన స్థానికులు, పార్టీశ్రేణులతో మాట్లాడుతూ ఈ బయోగ్యాస్ ప్లాంట్ వినియోగంలోకి వచ్చిన తరువాత ప్రాంతీయ అభివృద్ధికి భారీగా దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్లాంట్ సూపర్‌వైజర్ మస్తాన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



సీబీజీ ప్లాంట్‌లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి



కలెక్టర్ రాజాబాబును కలిసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ నేతలు

దర్శి డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కోరారు. సోమవారం సాయంత్రం ఒంగోలులో కలెక్టర్ రాజాబాబును కలిసి నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. ఈసందర్భంగా దర్శి నియోజవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కొనసాగించటం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వశాఖల్లో పోస్టులు ఖాళీగా ఉండటంతో పనులు కుంటుపడుతున్నాయని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసమైన నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరగా, సానుకూలంగా స్పందించినట్లు డాక్టర్ లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ నాగవేణి సుబ్బారావు, బి.ఓబుల్‌రెడ్డి, మానం రమేష్‌బాబు, గోళ్లపూడి వేణుబాబు, కల్యాణ్ పాల్గొన్నారు.

చిరుజల్లులతో రైతుల ఆందోళన

దర్శి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో చిరుజల్లులు పడుతుంగటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాకు రెడ్‌అలెర్ట్ ప్రకటించటంతో భారీ వర్షం కెరిసేంత పంటలు ఎబ్బతింటాయని రైతులు బెంబేలెత్తు తున్నారు. దర్శి ప్రాంతంలో సాగుచేసిన వరింపట కోత దశకు చేరింది. మిర్చి కాపుదశలో వుంది. పొగాకు కొట్టుడుకు వచ్చింది. మొక్కజొన్న పంట కూడా కోత దశకు చేరింది. ఈ నేపత్యంలో తుపాన్ ప్రభావం వల్ల ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ చెబుతుండటంతో అన్నదాతల గుండెల్లో రైల్లు పరుగుగెత్తున్నాయి. లక్షాలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటు చేతి కందే సమయంలో నీటి పాలవుతాయోమోనని భయపడుతున్నారు. రెండు నెలల క్రితం సంబవించిన మొంధాతుఫాన్ వల్ల ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు భారీగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం ఈ తుఫాన్ వల్ల మిగిలిన పంటలు కూడా దెబ్బతినే పరిస్థితి నెలకొంది. ఈ తుఫాన్ ప్రభావం తేలికగా ముగిస్తే రైతులు ఊపిరి పీల్చుకుంటారు. లేకుంటే తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.



దర్శిలో కోత దశకు చేరిన వరిపంట

గోకులపెడ్లు నిర్మించుకోవాలి

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న గోకులం షెడ్లు నిర్మించుకొని లబ్ధి పొందాలని టీడీపీ మండల అధ్యక్షుడు బొబ్బూరి రమేష్ కోరారు. స్థానిక వెలుగు కార్యాయలంలో గోకులం షెడ్లు, దిత్వా తుఫాన్ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో ప్రతాప్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ సీహెచ్ వెంకట్‌రెడ్డి, పశువైద్యాధికారి డాక్టర్ మునీర్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే హెచ్ఐవీ నిర్మూలన

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలని హెచ్‌ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని పెదరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల తొలగింపు

కనిగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కనిగిరిలో రోడ్ల విస్తరణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చర్యలకు ఉపక్రమించారు. అందులోభాగంగా ఆయన ఆదేశాలతో ఐటీడీపీ నాయకుడు, విద్యుత్ కాంట్రాక్టర్ జంషీర్ అహ్మద్ ప్రధాన రోడ్డులోని మార్జిన్‌లలో ఉన్న విద్యుత్ స్తంభాలను సోమవారం తొలగింపు కార్యక్రమం చేపట్టారు. పామూరు బస్టాండులోని చర్చి సెంటర్ నుంచి డిపో వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలను ఎక్సకవేటర్‌తో తొలగించారు. ఈసమయంలో ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఏఈ పవన్‌కుమార్ పర్యవేక్షణలో విద్యుత్ సిబ్బంది స్తంభాలకు ఉన్న విద్యుత్ వైరు, కనెక్టర్‌లు, కండక్టర్‌లు, పీజ్ లేయర్‌లను తొలగించారు. రాకపోకలకు అంతరాయం కల్గకుండా ఎస్ఐ టి.శ్రీరాం, ఎఎస్ఐ శ్రీనివాసులురెడ్డిలు, పోలీసు సిబ్బంది వాహనాల మళ్లింపు చర్యలు చేపట్టారు. గంట వ్యవధిలో చర్చి సెంటర్ నుంచి డిపో వరకు ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగిచారు.

రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైన ఐసీటీసీ సెంటర్

కనిగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కనిగిరి ఐసీటీసీ సెంటర్ రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. ఈమేరకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతులమీదుగా ఆసెంటర్ కౌన్సిలర్ పాలడుగు శ్రీనివాసులు, ఎల్‌టీ మల్లికార్జున్‌రెడ్డి అందుకున్నారు.

ప్రజాప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు సముచిత గౌరవం



దేవకిని సన్మానిస్తున్న పెనుగొండ ట్రస్ట్ నిర్వాహకులు

కనిగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వంలో ఆర్యవైశ్యలకు సముచిత గౌరవం లభిస్తుందని జాతీయ వాసవీసత్ర సముదాయాల చైర్మన్, శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ దేవికి వెంకటేశ్వర్లు అన్నారు. అఖిలభారత వాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలో బెంగుళూరులోని వీవీపురంలో శ్రీవాసవీ అమ్మవారి ఆలయంలో ఆదివారం రాత్రి అమ్మవారికి జరిగిన పుష్పయాగంలో ఆయనముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా దేవకిని పెనుగొండ ట్రస్ట్ ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో పెనుగొండ ట్రస్ట్ అధ్యక్షుడు పీఎం గోవిందరాజులు, కర్ణాటక ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ఆర్‌పీ రవిశంకర్, పెనుగొండ ట్రస్ట్ వైస్ చైర్మన్ ఎస్.సతీష్, కేఆర్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఐగా ఉప్పు శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

కనిగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కనిగిరి సీఐగా ఉప్పు శ్రీనివాసులు సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను మర్యాదపూర్వ కంగా కలసి పుష్పగుచ్చం అందజేశారు. ఇక్కడ పనిచేస్తున్న షేక్ ఖాజావలి స్థానంలో బాపట్ల జిల్లాలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు.

బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ ఎంపీడీవోలు

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పామూరు, సీఎస్‌పురం మండలాలకు నూతనంగా నియమితులైన డిప్యూటీ ఎంపీడీవోలు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కనిగిరి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న షేక్ హజరత్ ఆలీ డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతిపై పామూరు మండలానికి నియమితులయ్యారు. తమ నియామక పత్రాన్ని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్యకు సోమవారం అందజేశారు. అలాగే, సీఎస్‌పురం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న వి.బ్రహ్మానందరెడ్డి ఉద్యోగోన్నతిపై డిప్యూటీ ఎంపీడీవోగా అక్కడే నియమితులుకాగా, సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

టీఎన్‌యూఎస్ రాష్ట్ర మైనార్టీ కన్వీనర్‌గా రెహమాన్



దొనకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం(టీఎన్‌యూఎస్) రాష్ట్ర మైనార్టీ కన్వీనర్‌గా దొనకొండకు చెందిన ఉపాధ్యాయుడు రెహమాన్‌ను నియమించినట్లు ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2005లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా స్థాపించబడిన తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాటినుంచి నేటి వరకు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో సమర్థవంతంగా పనిచేస్తుందని శ్రీనివాస్ పేర్కొన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర మైనార్టీ కన్వీనర్‌గా నియమించిన రాష్ట్ర కమిటీకి రెహమాన్ కృతజ్ఞతలు తెలిపారు.

దొనకొండ మండలాన్ని మార్కాపురం జిల్లాలో చేర్చాలి

దొనకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పడే మార్కాపురం జిల్లాకు కేవలం 29 కిలోమీటర్ల దూరంలో ఉన్న దొనకొండ మండలాన్ని మార్కాపురం జిల్లాలో చేర్చాలని సోమవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసినవారిలో దొనకొండకు చెందిన మల్లెల రామిరెడ్డి, షేక్ గఫూర్, తదితరులు ఉన్నారు.

నిజాయితీకి మారుపేరు మాగుంట

పామూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నిజాయితీకి మారుపేరు మాగుంట కుటుంబమని టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డ మహేష్ అన్నారు. మాగుంట సుబ్బిరామిరెడ్డి 30 వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక మహాలక్ష్మీమిల్క్ ప్రొడక్ట్ కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కేవీ రమణయ్య, షేక్ షంషూర్, పందిటి హరీష్, ఇర్రి కోటిరెడ్డి, టీవీకే సుబ్బారావు, మన్నం రమణయ్య, దేవరపు మాల్యాద్రి, బి.సత్యం, ఓగూరి నరసింహారావు, కావేరి రసూల్, హజరత్, నాయబ్‌రసూల్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 96వేలు

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెంశ్రీ నారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండీ ఆదాయం రూ.1,96,327 వచ్చినట్టు ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకంద్వారా రూ.48,430, లడ్డుప్రసాదం అమ్మకం ద్వారా రూ. 22,620, శాశ్వత అన్నదాన పథకానికి రూ.1,05,729 వచ్చినట్టు ఆయన తెలిపారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ముండ్లమూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ అన్నారు. సోమవారం మండలంలోని పసుపుగల్లులో రైతులు కోసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఇంకా కోయని రైతులు మాత్రం నాలుగు రోజుల పాటు వాయిదా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్ .లక్ష్మీనారాయణ, ఏవో ఏ.తిరుమలరావు, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ముండ్లమూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయని తహసీల్దార్ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో షేక్ కాలేషావలి, హెచ్‌ఎం మాధవీలత, వ్యాయామ ఉపాధ్యాయులు సోమశేఖరరెడ్డి, తిరుపతి స్వామి, పద్మ, ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్రమణ వ్యాధులకు దూరంగా ఉండాలి

తాళ్లూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సంక్రమణ వ్యాధులకు ప్రజలు దూరంగా ఉండాలని తూర్పుగంగవరం పీహెచ్‌సీ వైద్యులు మౌనిక అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం తూర్పు గంగవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, హెచ్ఈవో చంద్రశేఖర్‌బాబు, పీహెచ్‌ఎన్ రమణమ్మ,హెచ్‌వీ సుశీల పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ సాధనకు ప్రజలు సంఘటితం కావాలి

పామూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని దూబగుంటలో ప్రతిపాదత ట్రిపుల్‌ఐటీ సాధనకు ప్రజలు సంఘటితం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు పిలుపునిచ్చారు. ఈమేరకు స్థానిక సుందరయ్య భవన్‌వద్ద నుంచి సోమవారం చేపట్టిన పాదయాత్రను ఆయన జండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా మట్లాడుతూ వెనుకబడిన పామూరు, సీఎస్‌పురం మండలాలు అభివృద్ధి చెందాలంటే గతంలో టీడీపీ ప్రభుత్వం శంకుస్థాపన చేసిన దూబగుంట వద్దనే ట్రిపుల్‌ఐటీ నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. గత వైసీపీ పాలకులు స్వార్థంతో దీనిని బల్లిపల్లికి మార్చడం దారుణమన్నారు. ప్రస్తుత పాలకులు ట్రిపుల్‌ఐటీని దూబగుంటలోనే నిర్మించి ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు. ఈపాదయాత్ర సీఎస్‌పురం రోడ్డు, డీవీపాలెం, కొత్తపల్లి, కాటంవారిపల్లి, దూబగుంట గ్రామాల మీదుగా ట్రిపుల్‌ఐటీ కోసం భూమి పూజ చేసిన ప్రాంతానికి చేరుకుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ హనీఫ్, ఊసా వెంకటేశ్వర్లు, కె.మాల్యాద్రి, షేక్ ఖాదర్‌బాషా, ఊసా రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన కలిగిఉండాలి

దొనకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో నాలుగు కోట్ల మంది ఎయిడ్స్ వ్యాధితో బాధపడుతున్నారని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధనుముని అన్నారు. ఈవ్యాధిని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జాయ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దొనకొండలో ర్యాలీగా ప్రధాన కూడలికి చేరుకొని మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా ధనుముని మాట్లాడుతూ సమాజానికి శాపంగా ఉన్న అంటువ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానంచేశారు. కార్యక్రమంలో జాయ్ పౌండేషన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గుడిమెట్ల అబ్రహం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మినుము పంటలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి

పీసీపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మినుము పంటలో నీరు నిల్వ ఉండకుండా రైతులు జాగత్రలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి భాస్కర్‌బాబు అన్నారు. దిత్వా తుపాన్ ప్రభావంతో మండలంలో భారీ వర్షాలు కురుస్తాయనే సమాచారంతో రైతులకు నష్టం కలగకుండా ఉండేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారితో పాటు తహసీల్దార్, వ్యవసాయ అధికారుల బృందం సోమవారం మండలంలోని పెదయిర్లపాడు, కోదండరామపురం గ్రామాల్లో పర్యటించారు. అక్కడ రైతులు సాగుచేసిన మినుము పంటను పరిశీలించారు. వర్షానికి పొలాల్లో నీరు చేరితే చిన్నచిన్న కాలువలు తీసి పొలంలో ఉన్న నీరంతా బయటకు పోయేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ ఉష, వ్యవసాయాధికారి ఎన్.రంగాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

ముండ్లమూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కొనసాగించటంతో పాటు అద్దంకిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ డివిజన్‌లో ముండ్లమూరు మండలాన్ని కలపటంతో స్వాగతిస్తూ సోమవారం మండలంలోని మారెళ్ళ గ్రామంలో టీడీపీ నేత మట్టా సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బుర్రి అంజయ్య, టీడీపీ గ్రామ అధ్యక్షుడు గాలం శ్రీనివాసరావు, గార్లపాటి కృష్ణ, ఎం.వెంకటరావు, వంటిపులి శ్రీను, చేకూరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయం వద్ద ధర్నా

ముండ్లమూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఉల్లగల్లు గ్రామానికి చెందిన పొదుపుసంఘాల లీటర్లు, మహిళలు సోమవారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గూపులకు సంబంధించిన నగదును బ్యాంకులో చెల్లించకుండా బిజినెస్ కరస్పాండెంట్ మేడం మోహన్‌రెడ్డి స్వాహా చేశారు. ఇందుకుసంబంధించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఆవ్యక్తి డబ్బులు ఇవ్వకపోవడంతో చేసేదేమి లేక ధర్నా చేస్తున్నామని లీడర్లు గొంది విజయలక్ష్మి, గోగుల అంజమ్మ, కోడిగ నర్సమ్మ, గురవమ్మ, గొంది నర్సనమ్మ, బొజ్జ రమణ, లాం పేరమ్మ, గొంది రమణమ్మ తదితరులు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఏపీఎం హనుమంతరావు మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేస్తామన్నారు. సదరు వ్యక్తిని పిలిచి మాట్లాడి ఏఒక్క సంఘానికి కూడా అన్యాయం జరగకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

మాజీ సర్పంచ్ ఇడమకంటికి నివాళి

తాళ్లూరు,డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తాళ్లూరు మాజీ సర్పంచ్ ఇడమకంటి పెద్దిరెడ్డికి పలువురు నేతలు నివాళులర్పించారు. పెద్దిరెడ్డి కుమారుడు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో దశదిన కర్మ సోమవారం తాళ్లూరులో జరిగింది. ఆయన చిత్రపటం వద్ద వైస్ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ రమాదేవి, మాజీ జడ్పీటీసీ గోవిందమ్మ, వెంకటేశ్వరరెడ్డి, ఏఎంసీ మాజీచైర్మన్ ఐ.వేణుగోపాల్‌రెడ్డి, మాజీఎంపీపీ మోషే, మాజీ సొసైటీ అధ్యక్షుడు పులి ప్రసాదరెడ్డి, తూము కామిరెడ్డి, మంచాల వలసారెడ్డి, బిజ్జం కృష్టారెడ్డి, కోట క్రిష్టారెడ్డి, ఐవీ సుబ్బారెడ్డి, కోట మస్నేరెడ్డి తదితరులు నివాళులర్పించారు.

నిందితుడు అరెస్టు

ముండ్లమూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకరవారిపాలెం గ్రామానికి చెందిన గనుపూడి సురేష్ ఇంట్లో ఇటీవల చోరీ జరగడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కమలాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సురేష్ బావ ఆరవీటి కోటేశ్వరరావును అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా తానే దొంగతనానికి పాల్పడినట్టు నేరం ఒప్పుకున్నాడు. దీంతో సోమవారం కోటేశ్వరరావును వేంపాడు క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేసి అతని వద్ద ఉన్న రూ.1.10 లక్షలు విలువ చేసే వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని దర్శి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసును ఛేదించిన ఎస్ఐ కమలాకర్, ఏఎస్ఐ వీవీ హనుమంతరావు, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, సిబ్బంది మరియబాబు, సూరిబాబు, ఎస్‌వీ నారాయణ, మహేష్ తదితరులను దర్శి సీఐ వై.రామారావు అభినందించారు.

అవ్వా తాతలకు భరోసాగా పెన్షన్లు

దర్శి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్తం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అవ్వాతాతలకు, దివ్యాంగుల జీవితాలకు భరోసా కల్పిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు అన్నారు. సోమవారం దర్శి పట్టణంలో టీడీపీ నాయకులతో కలిసి ఆయన పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, యాదగిరి వాసు, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: మండలంలోని మారెళ్ళ గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మట్టా సుబ్బరెడ్డి పంపిణీ చేశారు. పసుపుగల్లులో గ్రామ పార్టీ అధ్యక్షుడు గూడాల శివశంకర్‌రెడ్డి, శంకరాపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు పింఛన్లు అందజేశారు.

పామూరు: ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో పేదలకు ఆర్థిక భరోసా కలుగుతుందని తెలుగురైతు మండల అధ్యక్షుడు ఉడుముల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దూబగుంట గ్రామంలో సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలోని అయ్యవారిపల్లిలో జరిగిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, పరిశీలించారు. పామూరు, సీఎస్‌పురం మండలాల్లో జరిగిన ఈకార్యక్రమాల్లో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

మంగమ్మకు ఉగ్ర నివాళి

సీఎస్‌పురం (పామూరు), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ కలెక్టర్ పిడుగు బాబురావు మాతృమూర్తి పిడుగు మంగమ్మ(100) ఆదివారం రాత్రి కన్నుమూశారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సోమవారం గ్రామానికి వచ్చి మంగమ్మ మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బాబురావుకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబసభ్యులు, బంధుమిత్రుల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ సీఎస్‌పురం మండల అధ్యక్షుడు బొబ్బూరి రమేష్, సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, డాక్టర్ ఏడుకొండలు, తదితరులు ఉన్నారు.





అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ఒక్క రైతు కూడా నష్టపోకూడదు

- జిల్లాలో అధిక వర్షపాతం నమోదయ్యే సూచనలు
- జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ కారణంగా జిల్లాలో అధిక వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దిత్వా తుఫాన్ కారణంగా ఎక్కడా కూడా పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల మొంథా తుఫాన్ నేపథ్యంలో పనిచేసిన విధంగా.. ఇప్పుడూ అధికారులు అప్రమత్తంగా ఉండాల న్నారు. ఎస్‌ఓపీ ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు. గ్రామ సచివాలయాలలో నైపుణ్యం కలిగిన సిబ్బందికి శిక్షణ ఇచ్చి వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రతి గ్రామ సచివాలయం ఒక యూనిట్‌గా ఏర్పాటు చేసుకొని.. మండలస్థాయి అధికారి సూపర్‌వైజర్‌గా ఏర్పాటు చేసి ఒక ప్రణాళిక ప్రకారం పనిచేయాలన్నారు. ప్రతిశాఖకు అవసరమైన జూమ్ లైసెన్స్ కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ స్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేసుకొని పని వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేస్తూ డ్యాస్ బోర్డులో ఉంచాలన్నారు. జిల్లాలో 10 శాతం కూడా వరికోతలు అవ్వలేదని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వరి కోతలను నిలుపుదల చేయండి

తుఫాన్ కారణంగా ఏ రైతు పంటనష్టపోకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ మండల స్థాయి వ్యవసాయశాఖాధికారులకు సూచనలు చేశారు. వీక్షణ సమావేశంలో ఈ మేరకు వారికి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని 12 మండలాలలో వరి కోతదశలో ఉందని.. తుఫాన్ కారణంగా వరికోతలు నిలుపుదల చేయాలని తెలిపారు. 167 కొనుగోలు కేంద్రాల లో 85 కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. రైతులతో కూడిన వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని.. వారి సమస్యలను వాట్సప్‌లో పెట్టేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో జేసీ భావన విశిష్ఠ, ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయాధికారి అన్నపూర్ణ, అధికారులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

రేపల్లె, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వినోద్‌కుమార్ నిజాంపట్నం హార్బర్ రోడ్డులో అధికారులు చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుసేవా కేంద్రాన్ని పరిశీలించి రైతులకు గోనె సంచులు, టార్పాలిన్ పట్టాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని, భారీ వర్షాల హెచ్చరికలతో అత్యవసరంగా గోడౌన్‌లను గుర్తించామని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో గోడౌన్‌లు అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందో ళన చెందవద్దన్నారు. నిజాంపట్నంలో 30 ట్రాక్టర్లను రైసు మిల్లులకు అనుసంధానం ఇచ్చామని తెలిపారు. అనంతరం నిజాంపట్నంలోని భారతీయ తీర రక్షణ దళం కార్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. కమాండెంట్ వీవీఎస్‌వీవీ ప్రసాద్‌తో తీరప్రాంత సంరక్షణపై చర్చించారు. నూతనంగా లైట్‌హౌస్‌కు 1.5ఎకరాల స్థలాన్ని కేటాయించామన్నారు.



రేపల్లె : గూడవల్లి సమీపంలో మిల్లర్లు కొనుగోలు చెయ్యకపోవటంతో బస్తాల్లోకి ఎత్తి ఇళ్ళకు చేర్చుకుంటున్న రైతులు

దిత్వా.. గండం గట్టెక్కినట్టేనా!

- తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు
- తీవ్రత నామమాత్రంగా ఉండడంతో అన్నదాతలకు ఊరట



రేపల్లె : అరవపల్లిలో తడిచిన ధాన్యాన్ని చూపెడుతున్న రైతులు

(బాపట్ల, రేపల్లె ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావం సోమవారం సాయంత్రం వరకు జిల్లాలో నామమాత్రంగా ఉండడంతో వరి రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఆది, సోమవారాల్లో తుఫాన్ ప్రభావం చిరుజల్లులకే పరిమితమవడంతో భారీ ఊరట దక్కినట్లయింది. దిత్వా ముప్పు ఇంకా పూర్తిగా తొలగినట్లు కాదని మంగళవారం వరకు కూడా దాని ప్రభావం ఉండనుందని వాతావరణశాఖ హెచ్చరిస్తుండడం గమనార్హం. జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణశాఖ అంచనాలతో గడచిన మూడు రోజులుగా అన్నదాతలకు కంటి మీద కునుకు కరువైంది. వేల ఎకరాల్లో వరి కోతకు సిద్ధంగా ఉండడం, కల్లాల్లో, రోడ్లమీద ఆరబోసిన ధాన్యం ఉండడంతో భయాందోళనలకు గురిచేసింది. ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకున్నప్పటికీ భారీ వర్షాలు కురిస్తే భారీ నష్టం తప్పదనే అంచనాకు రైతాంగం వచ్చింది.

బ్యాంక్ గ్యారెంటీలపై సమీక్ష..



రేపల్లె : 216 జాతీయరహదారి వెంట వర్షానికి పట్టాలుకప్పిన ధాన్యం

ధాన్యం సేకరణ ప్రారంభంలోనే బ్యాంకు గ్యారెంటీలకు సంబంధించి సమస్య ఉత్పన్న మైంది. దాదాపుగా ఈ ప్రక్రియను కొలిక్కి తేగ లిగారు. ఇదే అంశంపై మిల్లర్లు, అధికారులతో సోమవారం కూడా కలెక్టర్ వినోద్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. వరి కోతకు సిద్ధంగా ఎంత ఉంది, కల్లాల్లో ఉన్న పరిమాణం ఎంత అనే అంశాలపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలోని సిబ్బంది నివేదిక ఇవ్వాలని, దానికి అనుగు ణంగా మండలాల వారీగా ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రణాళికలు రచించుకో వాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం ఒక్క రోజే 1,800 మెట్రిక్ టన్నుల ధా న్యాన్ని మద్దతు ధరకు సేక రించగా మొత్తం 5,700 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సివిల్ సప్లయిస్ విభాగం సేకరించింది. 11,500 టన్నుల ధాన్యం కొనుగోలు షెడ్యూ లింగ్ ఇవ్వడం జరి గిందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

ధాన్యం.. దైన్యం

తుఫాన్ ప్రభావంతో ముందే నూర్పిళ్లు చేసి తీసుకెళ్లిన ధాన్యాన్ని.. రైతు సేవా కేంద్రాల వద్ద కొనుగోలు చేయడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిత్వా తుఫాన్ నేపథ్యంలో బాపట్ల జిల్లాను ఆరెంజ్ జోన్‌గా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా హార్వెస్టుల ద్వారా కోత పూర్తి చేసిన వరి ధాన్యాన్ని పెనుమూడి 216 జాతీయ రహదారి నుంచి నడింపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా ఆరబోశారు. మూడురోజులుగా మిల్లర్లు, ఆర్ఎస్‌కేల చుట్టూ ధాన్యం కొనుగోలు చేయాలని ప్రాధేయపడుతున్నా.. వారం వరకు కొనుగోలు చేయమంటూ సమాధానం వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇక దళారులు తేమశాతం సాకు చూపి.. రూ.1,300ల నుంచి రూ.1,420 కొనుగోలు చేస్తామని చెబుతున్నారని.. అంత తక్కువగా విక్రయిస్తే.. తమకు పెట్టుబడి కూడా సరిపోదని నిట్టూరుస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.1792 మద్దతు ధర లభించడం లేదని అంటున్నారు. రేపల్లె నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల ఆర్ఎస్కేల్లో ద్వారా మిల్లర్లు ఎవరూ ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. కనీసం పంటను తీసుకుని మిల్లర్లు గోడౌన్‌లో, వ్యవసాయ యార్డుల్లో నిల్వ ఉంచుకోవాలని పలుమార్లు వ్యవ సాయాధికారులకు విన్నవించినా ఫలితం లేదని అంటున్నారు. దీంతో రైతులు దేవుడిపైనే భారం వేశారు.

3వ నెంబరు ప్రమాద సూచిక

నిజాంపట్నం హార్బర్‌లో సోమవారం రెండవరోజు 3వ నంబరు ప్రమాద సూచిక కొనసాగుతుందని పోర్టు అధికారులు తెలిపారు. దిత్వా తుఫాన్‌కారణంగా సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని తెలిపారు. అలల ఉధృతి, ఈదురు గాలులు ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలపటంతో మత్స్యకారులంతా ఒడ్డుకు చేరుకున్నారని చెప్పారు. బోట్లన్నీ జట్టీలకే పరిమితమయ్యాయని తెలిపారు.

క్రీడా కిట్లు వచ్చేశాయ్



- ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ

బాపట్ల: డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో క్రీడాకారులను తయారు చేయ డమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన క్రీడా పరికరాలు సరఫరా చేసింది. ఒక్కో పాఠశాలకు రూ.17వేలు, రూ.30వేలు విలువైన కిట్లు ఇప్పటికే చేరాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు దాదాపు 3వేలకుపైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు 6 లక్షల మందికి పైగా విద్యార్థులున్నారు. పాఠశాలల్లో విశాలమైన క్రీడా ప్రాంగణాలు, నిష్ణాతులైన ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నారు. అయితే క్రీడా పరికరాల లేమి కారణంగా విద్యార్థులకు సరైన శిక్షణ అందడం లేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోటే క్రీడలకు మెరుగైన అవకాశం కల్పించే దిశగా ఏర్పాట్లు చేసింది.



క్రీడా కిట్లు ఇలా..

షటిల్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, వాలీబాల్, టెన్నికాయిట్, ఖో-ఖో, హ్యాండ్‌బాల్ క్రీడా పరికరాలు.. క్యారమ్స్, చెస్ బోర్డులు క్రీడా కిట్లలో ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలకు రూ.10 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.17వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.25 వేల నుంచి రూ.30 వేలు విలువైన క్రీడా పరికరాలు ప్రభుత్వం పంపించినట్లు ఉపాధ్యాయులు వెల్లడించారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్లకు దిశా నిర్దేశం చేయనున్నారు.

ప్యార్లీ డ్రెయిన్ కట్ట స్వాహా!

- కట్టను రాత్రిళ్లు ఇసుక తరలింపు..
- ఆక్రమణలతో వ్యవసాయం, గృహ నిర్మాణాలు



ప్యార్లీ డ్రెయిన్ కట్ట ఇసుకను అక్రమంగా తవ్వుకొని వెళ్ళిన దృశ్యం

బాపట్ల రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం వెదుళ్ళపల్లి సమీపంలోని ప్యార్లీ డ్రెయినేజీ సెక్షన్ కార్యాలయం నుంచి మరుప్రోలువారిపాలెం బ్రిడ్జి వరకు ఉన్న కాల్వకట్టను అక్రమార్కులు రాత్రిళ్లు కొల్లగొడుతున్నారు. వందల ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలించుకుంటున్నారు. ఇలా కాల్వ కట్టను తవ్వేస్తే.. వరదల సమయంలో సమీప గ్రామాలకు ముంపు తప్పదని గ్రామస్థులు వాపోతున్నారు. కొంతమంది కాల్వకట్టను ట్రాక్టర్లతో దున్ని.. వ్యవసాయం చేసుకునేందుకు సిద్ధం చేస్తున్నారు.

పింఛన్ల పంపిణీ.. ప్రథమ స్థానంలో ఏపీ

- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పేదలకు అం దించే సంక్షేమ పింఛన్లు పంపిణీ చేయడంలో ఆం ధ్రప్ర దేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని.. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి మండలం మైలవరం పంచాయతీ పరిధిలోని ఏలేశ్వరవారి పాలెంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది పింఛనుల పంపిణీ చేస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క స్పౌజ్ పింఛను కూడా మంజూరు చేయలేదని, కూటమి ప్రభుత్వం 1.08 లక్షల మందికి మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 65 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరుగుతోందన్నారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం రాయితీపై రైతుకు ట్రాక్టర్‌ను మంత్రి అందజేశారు. అన్నదాతను ప్రోత్సహించేందుకు 90శాతం రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందిస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు చేసి, డబ్బులు ఇవ్వకుండా మొండి చేయి చూపితే కూటమి ప్రభుత్వం బకాయిలు చెల్లించిందన్నారు. సంక్రాంతి నాటికి శాంతినగర్ - మైలవరం రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని మంత్రి స్పష్టం చేశారు. మైలవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 162 మందికి ఎన్ఆర్ఈడీసీఏపీ, అనిస్టల సహకారంతో సమకూర్చిన సైకిళ్లను మంత్రి రవికుమార్ పంపిణీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 5,300 మందికి సైకిళ్లు పంపిణీ చేశామని మంత్రి చెప్పారు. అనంతరం మధ్యాహ్న భోజనంను రవికుమార్ పరిశీలించారు. ఆహారం నాణ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మానం మురళీమోహన్‌దాస్, పరమేష్, సత్యనారాయణ, రాధాకృష్ణ మూర్తి, రామలింగయ్య, కృష్ణమారుతి, తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీఓ వరూధిని, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, ఎంఈఓ కేవీ శ్రీనివాసరావు, హెచ్ఎం నాగేశ్వరరావు, ఏఓ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరవారిపాలెంలో వృద్ధురాలికి పింఛన్ నగదు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రయాణ బాధలు

- శిథిలావస్థలో చీరాల బస్టాండ్
- షెల్టర్ లేక ఈపూరుపాలెంలో అవస్థలు
- మందుబాబులకు అడ్డాగా వేటపాలెం బస్టాండ్



వేటపాలెం బస్టాండ్

చీరాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో బస్‌స్టాండ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో మందు బాబులకు అడ్డాగా మారాయి. 1988లో చీరాల డిపో నిర్మాణం జరిగింది. అప్పటి నుంచి కొనసాగుతున్న డిపోలో ప్రస్తుతం 40 హయ్యర్ బస్సులు, 35 ఆర్టీసీ సర్వీసులు నడుస్తున్నాయి. అంతేకాకుండా ప్రతి రోజు హైదారాబాదుకు 5, కర్ణాటక షాపూర్‌కు 2, శ్రీశైలం 1, కాకినాడకు మరొక బస్సు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి. చీరాల నుంచి ఒంగోలు, నరసరావుపేట, చిలకలూరిపేట, పర్చూరు, గుంటూరు, విజయవాడకు వేల సంఖ్యలో ప్రజలు ప్రయాణిస్తున్నారు. అంతటి ప్రాధాన్యం ఉన్న చీరాల బస్టాండ్ శ్లాబ్ పలుచోట్ల పెచ్చులూడి ప్రమాదభరితంగా ఉంది. ప్రయాణికులు శ్లాబ్ చూస్తూ భయాందోళనకు గురి అవుతున్నారు. చీరాల బాపట్ల ప్రాంతాలకు వయాగా ఉన్న ఈపూరు పాలెంలో ప్రయాణికుల సంఖ్య అధికమే. అయితే అక్కడ అస్సలు బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రజలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నడిరోడ్డుపై నిలబడి వాహనాల కోసం వేచి చూస్తున్నారు. వేటపాలెం బస్టాండ్ పర్యవేక్షణ లోపించడంతో రాత్రుళ్లు మందు బాబులు ఇక్కడ తిష్ట వేశారు. దీంతో ప్రయాణికులు కూడా అటువైపు వెళ్లేందుకు కూడా భయపడుతున్నారు. బస్టాండ్ స్థలంలో సుమారు 15 సెంట్లు వరకు పెట్రోల్ బంకుకు లీజుకు ఇచ్చారు. డిపోకు కొంత ఆదాయంతో పాటు, స్థలం భద్రతగా ఉంది. మిగిలిన స్థలం కొంత మందు బాబులకు, మరికొంత స్థానికులకు పశువుల పాకగా మారుతోంది.



ప్రమాద భరితంగా చీరాల బస్టాండ్ శ్లాబ్

బకాయి భారం

- మున్సిపాలిటీలకు చేకూరని ఆస్తి పన్ను ఆదాయం
- ప్రభుత్వ సంస్థల నుంచి రూ.52.36 కోట్లు పెండింగ్
- ఏళ్ల తరబడి వసూలు కాని వైనం..

మునిసిపాలిటీలకు.. ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్ను బకాయిలు ఏళ్ల తరబడి పేరుకుపో తున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాల్టీలకు ప్రభుత్వ సంస్థలు రూ.52.36 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలు చెల్లిస్తే పట్టణాల్లో ప్రజలకు అవసరమైన ప్రగతి పనులు చేపట్టవచ్చు. బకాయిల వసూలు కోసం మునిసిపాల్టీలకు అయా ప్రభుత్వ కార్యాలయాల అధిపతులకు లేఖలు రాస్తున్నా ప్రయోజనం లేదు. ఆస్తి పన్ను చెల్లించేందుకు ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదల కాలేదంటూ అధికారులు పురపాలకులకు సమాధానం ఇస్తున్నారు.

పల్నాడు జిల్లాలోని నరసరావుపేట మునిసిపాల్టీకి రూ.3 కోట్లు, సత్తెనపల్లి రూ.1.05 కోట్లు, మాచర్ల కోటి రూపాయలు, చిలకలూరిపేట రూ.80 లక్షలు, దాచేపల్లి రూ.16 లక్షలు, వినుకొండ రూ.46 లక్షలు, పిడుగురాళ్ల రూ.37 లక్షలు, గురజాల మునిసిపాల్టీకి రూ.29 లక్షలు బకాయిలు వసూలు కావాల్సి ఉంది.

బాపట్ల జిల్లా కేంద్రం బాపట్ల మునిసిపాల్టీలో రూ.1.40 కోట్లు, రేపల్లె రూ.83 లక్షలు, చీరాల రూ.1.09 కోట్లు, అద్దంకి మునిసిపాల్టీలో రూ.32 లక్షలు ప్రభుత్వ సంస్థల బకాయిలు పేరుకుపోయాయి. ఈ బకాయిలు ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా వసూలు అయ్యే పరిస్థితులు లేవని సదరు అధికారులు చెబుతున్నారు. ఆస్తి పన్ను బకాయిలు గురించి లేఖలు రాస్తున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదంటున్నారు.



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మునిసిపాల్టీలకు ప్రైవేట్ సంస్థల కంటే ప్రభుత్వ సంస్థల ఆస్తి పన్ను మొండి బకాయి అధికంగా ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యాలయాల ఆస్తి పన్ను బకాయి కోసం అధికారుల చుట్టూ మునిసిపల్ సిబ్బంది ప్రదక్షిణలు చేస్తున్నారు. మునిసిపాల్టీలు విద్యుత్ బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగితే ప్రభుత్వ సంస్థ అని కూడా చూడకుండా విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తారు. అటువంటిది మునిసిపాల్టీకి మాత్రం ఆస్తి పన్ను చెల్లించే విషయంలో అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్యాలయాలు.. సంస్థలకు సంబంధించి రూ.39.62 కోట్లు ఆస్తి పన్ను బకాయి ఉంది.కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు.. సంస్థలకు సంబంధించి రూ.12.74 కోట్ల ఆస్తి పన్ను బకాయి (మిగతా 6వ పేజీలో)



క్విస్ కళాశాల ఆధ్వర్యంలో యరజర్లలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం

ముగిసిన సేవా కార్యక్రమాలు

ఒంగోలు విద్య, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి వికసిత్ భారత్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఒంగోలు మండలం యరజర్లలో వారం రోజుల పాటు నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలు ముగిశాయి. ఈనెల 24వతేదీ నుంచి 30వతేదీ వరకు యరజర్ల గ్రామంలో పలు కార్యక్రమాలను నిర్వహించినట్లు క్విస్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రిదేవిలు తెలిపారు. విద్యార్థుల్లో సేవా భావం నింపేందుకు, గ్రామస్థుల అవసరాలను తీర్చేందుకు ఈ సేవా కార్యక్రమాలు ఎంతోగానూ దోహదపడ్డాయన్నారు. వారం రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో క్విస్ కళాశాల ఎన్ఎస్ఎస్ హెడ్ డాక్టర్ నవనీత్ కృష్ణ, పీవోలు శిరీష, వేణుగోపాల్, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ వాసుబాబు, కళాశాల సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉన్నారు.



సంతనూతలపాడులో క్యాండిల్స్ వెలిగించి నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ, సీఐటీయూ నేతలు

పెంచలయ్య కుటుంబానికి సాయం అందించాలి

సంతనూతలపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గంజాయి ముఠా చేతిలో హత్యకు గురైన పెంచలయ్య కుటుంబానికి రూ.50లక్షల ఆర్థికసాయం అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బంకాసుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పేర్నమిట్టలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నెల్లూరు జిల్లాలో డీవైఎఫ్ఐ నాయకుడిగా ఉన్న పెంచలయ్యను హత్యచేసిన వారిపై అరెస్టు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



రాజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ట్రెజరీ అధికారులు

ట్రెజరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడికి సత్కారం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ జనాభా, లెక్కలశాఖ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెజరీ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కాజా రాజ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. స్థానిక జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ట్రెజరీ అధికారులు రాజ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రాజ్‌కుమార్‌ను శాలువతో సత్కరించి బొకే ఇచ్చి అభినందించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ తనకు రాష్ట్ర అధ్యక్ష పదవి వచ్చేందుకు సహకరించిన ట్రెజరీలోని వివిధ విభాగాల అసోసియేషన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రెజరీలో అధికారుల నుంచి ఉద్యోగుల వరకు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీవోలు కెనడి, జే వెంకటేశ్వర్లు, భాగ్యలక్ష్మి, సుధీరా, శ్రీనాథ్, ఆంజనేయులు, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



రాచవారిపాలెంలో గుండ్లకమ్మనది మ్యాపును పరిశీలిస్తున్న డీఆర్వో ఓబులేశు, ఆర్డీవో, ఇతర అధికారులు

నివేశన స్థలాల కేటాయింపునకు కృషి

మద్దిపాడు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి):గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలోని రాచవారిపాలెం అరుంధతి నగర్ వాసులకు నివేశన స్థలాల కేటాయింపునకు కృషిచేస్తానని డీఆర్వో ఓబులేశు చెప్పారు. నదికి వరద వచ్చినపుడు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారంటూ మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సృజన మాదిగ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారని ఆయన ఆదేశాలతో సోమవారం అరుంధతినగర్‌ను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మద్దిపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ అజయ్ కుమార్ రెడ్డి, ఆర్ఐ రమణయ్య, వీఆర్వో బుల్లయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై విద్యార్థులకు అవహగాహన

ఒంగోలు క్రైం,డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): యువత బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేసి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని రవాణా శాఖ అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కే .జయప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక హర్షిణి కాలేజీలో విద్యార్థులకు రహదారి భద్రతపై రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ యువకులు విద్యార్థులు రహదారి భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం,హెల్మెట్ లేకుండా వాహన చోదన ప్రమాదాలకు కారణం అవుతాయన్నారు. అదేవిధంగా నిబంధనలకు విరుద్ధంగా వాహన చోదన చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ట్రాఫిక్ గుర్తులు పైకూడ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమం

ఎమ్మెల్యే దామచర్ల నగరంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



ఒంగోలులో దివ్యాంగునికి పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా కూటమి ప్రభుత్వంలోనే పేదల సంక్షేమం సాధ్యపడుతుందని ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని సోమవారం ఒంగోలులోని 12వ డివిజన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోపే ప్రజలకు ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ అమలు చేసినట్లు తెలిపారు. అందులో ప్రధానమైన పింఛన్ల పెంపుపై తొలి సంతకం చేశారన్నారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, వితంతవులతోపాటు ట్రాన్స్ జెండర్‌లకు పింఛన్ పెంచి అండగా నిలుస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్ల పట్టిందని, అయితే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తొలిరోజే వెయ్యి రూపాయలు పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఒడా చైర్మన్ షేక్ రియాజ్, మేయర్ గంగాడ సుజాత, కమిషనరు కే. వెంకటేశ్వరరావు, మైనార్టీ కమిషన్ రాష్ట్ర డైరెక్టర్ షేక్ కపిల్ బాషాతోపాటు స్థానిక కార్పొరేటర్ అంబూరి శ్రీనివాసరావు పలువురు పాల్గొన్నారు.

సామాజిక పెన్షన్ల పంపిణీ

మద్దిపాడు :అర్హులైన పేదలకు సామాజిక పెన్షన్ అందించడంలో అధికారులు నిరంతరం కృషిచేయాలని రాష్ట్ర పొగాకు సమాఖ్య చైర్మన్ మండవ జయంతి బాబు అన్నారు. సోమవారం మద్దిపాడు ఘడియపూడి కాలనీలో ఆయన పెన్షన్లను పంపిణీ చేశారు. దొడ్డవరప్పాడులో మాజీ సర్పంచ్ గోరంట్ల చిరంజీవి, కొలచనకోట గ్రామంలో దేవబత్తిన ప్రసాద్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నున్న బాలసుబ్రహ్మణ్యం పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పలువురు తెలుగుదేశం, జనసేన నాయకులు పాల్గొన్నారు.

92 శాతం పెన్షన్ల పంపిణీ

సంతనూతలపాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయా గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను సోమవారం సాయంత్రానికి 92 శాతం పంపిణీచేసినట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. మండలంలో 6,672 మంది వివిధ పెన్షన్లకు సంబంధించి 6,091 మందికి పంచాయతీ, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ద్వారా అందించినట్లు ఎంపీడీవో తెలిపారు.



ఘడియపూడిలో పెన్షన్ అందజేస్తున్న పొగాకు సమాఖ్య రాష్ట్ర చైర్మన్ మండవ జయంతిబాబు

మిగతావారికి రేపటి లోపు అందజేస్తామన్నారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నీటిసంఘం అధ్యక్షుడు అబ్బూరిశ్రీను, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

90 శాతం పూర్తి

నాగులుప్పలపాడు :మండల పరిధిలోని గ్రామాలలో ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తిచేసినట్లు ఎంపీడీవో తేళ్ల రవికుమార్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని గ్రామాలలో అధికారులు, టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బందితో కలసి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు.నాగులుప్పలపాడులో మండల ప్రత్యేకాధికారి గంగవరపు జోసఫ్‌కుమార్ లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న పొన్నలూరు వైద్యాధికారి మల్లికార్జునరావు

హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈర్యాలీని స్థానిక కలెక్టరేట్ వద్ద నుంచి ఐఎంఏ హాలు వరకు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సదస్సుకు ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎ. నాగయ్య నాయుడు, డాక్టర్ ఆనంద్‌లు అధ్యక్షత వహించారు. అనంతరం సభలో హెచ్ఐవీ నియంత్రణకు తీసుకోవాల్సిన పలు చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ కే సుధాకర్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ జాలాది మణిబాబు, పూర్వ ఉపాధ్యక్షుడు డాక్టర్ మన్నే వీరయ్య చౌదరి, డాక్టర్ జయశేఖర్, ఏపీఎంసీ చైర్మన్ డాక్టర్ కే సుబ్బానాయుడు, డాక్టర్ శివ సీతారామయ్య, డాక్టర్ జాకబ్ జక్కరయ్య, డాక్టర్ శార, డాక్టర్ రాధిక, డాక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు, డాక్టర్ మాల కొండారెడ్డి, డాక్టర్ కృష్ణ, జి. రామ్మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

అవగాహన పెంచుకోవాలి

సింగరాయకొండ : హెచ్ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా సోమవారం సింగరాయకొండలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ అసురక్షిత శృంగారం, రక్తమార్పిడి వంటి పలు కారణాలు వలన హెచ్ఐవీ ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. వ్యాధి పట్ల కొంతమందిలో ఉండే అపోహలు, సందేహాలు శారీరకంగానూ, మానసికంగానూ కుంగదీస్తుంటాయని తెలిపారు. వీటిని తొలగించడానికి వైద్యులను సంప్రదించి వ్యాధిపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు వంశీధర్, రవి, కలైసెల్వం, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నలూరులో..

పొన్నలూరు : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ పీవీ మల్లికార్జునరావు మాట్లాడుతూ హెచ్ఐవీకి కారణాలు, నిరోధానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కృష్ణచైతన్య, రవికిరణ్, శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపాల్ జి.రాజేంద్రబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

మద్దిపాడు : స్థానిక కడియాల యానాదయ్య జూనియర్ కళాశాల విద్యార్థులు కళాశాల నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్రశేఖర్ , పీడీ ఆదినారాయణ, లెక్చరర్లు పాల్గొన్నారు.

హెచ్ఐవీని తరిమికొట్టాలి

ఒంగోలు విద్య : సమాజంలో మహమ్మారిగా మారిన ఎయిడ్స్ భూతాన్ని తరిమి కొట్టాలని ఒంగోలు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి. కళ్యాణి పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు హెచ్ఐవీపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈర్యాలీని ప్రిన్సిపాల్ కళ్యాణి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ కే ప్రతాప్, ఎం. శ్రీనివాసరావు, అధ్యాపకులు మౌనిక, అరుణకుమారి, విద్యార్థినులు ఉన్నారు.

హడలెత్తించిన చైన్‌స్నాచర్

వరుసగా రెండు ప్రాంతాలలో చోరీ సీసీ పుటేజీ సేకరణలో పోలీసులు

ఒంగోలు క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళల మెడలో బంగారం గొలుసులు లాక్కెళుతూ ఓ దొంగ హడలెత్తించాడు. సోమవారం రాత్రి దేవాలయం సమీపంలో ఇరువురు మహిళల మెడలలో గొలుసులు లాక్కెళ్లాడు. లాయర్‌పేట సాయిబాబా గుడి సమీపంలో నడుచుకుంటూ వెళుతున్న మందాడి కోటేశ్వరమ్మ అదే ప్రాంతంలో గూడూరి గుప్తాస్ అపార్ట్‌మెంట్‌లో ఉంటోంది. ఆమె సాయిబాబా గుడికి వెళ్లి నడుచుకుంటూ అపార్ట్‌మెంట్‌కు వెళుతుండగా ఎదురుగా వచ్చిన 35 ఏళ్ల యువకుడు ఆమె మెడలో ఉన్న గొలుసు లాక్కొని పరారయ్యాడు. ఈమేరకు ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంటనే అక్కడ సీసీ పుటేజీ పరిశీలిస్తున్నారు పోలీసులు. అదే సమయంలో ఆగంతుకుడు రంగారాయుడు చెరువు సమీపంలోని అయ్యప్పస్వామి గుడి సమీపంలో నడుచుకుంటూ వెళుతున్న కొల్లిపర శారద మెడలో బంగారం చైన్‌ను లాక్కొని పరారయ్యాడు. ఈమేరకు రెండు కేసులు నమోదుచేసుకొని ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రెండు ప్రాంతాలలో పోలీసులు సీసీ పుటేజీని పరిశీలిస్తున్నారు. అయితే రెండు ప్రాంతాలలో గొలుసులు లాకెళ్లింది ఒక్కడే ఆగంతుకుడు అయి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

ఆటోలో 14 సవర్ల బంగారం అపహరణ

మద్దిపాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ వద్ద 14 సవర్ల బంగారం అపహరించుకుపోయారు. ఈ సంఘటన సోమవారం రాత్రి మద్దిపాడులో చోటుచేసుకుంది. తెల్లబాడు గ్రామానికి చెందిన మల్లిపెద్ది ధనలక్ష్మి ఆమె సోదరి నర్రా సుకన్య పిడుగురాళ్ల నుంచి బస్సులో వచ్చి మద్దిపాడులో దిగారు. అక్కడి నుంచి తెల్లబాడు వెళ్లేందుకు ఆటో ఎక్కారు. వీరితో పాటు మరో ఇద్దరు మహిళలు ఆటో ఎక్కారు. వీరు వెల్లంపల్లి జాతీయ రహదారిపై దిగిపోయారు. ఇంటికి వెళ్లిన అనంతరం ధనలక్ష్మి, సుకన్యలు బ్యాగు పరిశీలించగా అందులో ఉన్న 14 సవర్ల బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో మధ్యలో దిగిపోయిన వారు తస్కరించి ఉంటారని భావించి వెంటనే మద్దిపాడుకు వచ్చి ఎస్ఐ వెంకటసూర్యకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు స్మార్ట్‌జన్ విద్యార్థి ఎంపిక

సింగరాయకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు సింగరాయకొండ స్మార్ట్‌జన్ జూనియర్ కళాశాలకు చెందిన డి.భావేష్ ఎంపికయ్యారు. ఈనెల 5,6,7 తేదీల్లో గుంటూరులో నిర్వహించే అండర్-19 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో భావేష్ పాల్గొననున్నారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను కరస్పాండెంట్ డాక్టర్ గీతారాణి, అధ్యాపకులు అభినందించారు.

డిప్యూటీ ఎంపీడీవోగా సూర్యనారాయణ

కొండపి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ ఎంపీడీవో (గ్రామ, వార్డు సచివాలయాల శాఖ)గా నల్లమల్లి సూర్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని సచివాలయాల సిబ్బంది ఇకపై ఆయనకు జవాబుదారీగా పనిచేయాల్సి ఉంటుందని మండల పరిషత్ కార్యాలయ ఏవో రామకృష్ణ తెలిపారు.

గీతపారాయణం చేసిన భక్తులు



పారాయణం చేస్తున్న మహిళా భక్తులు

యద్దనపూడి, (మార్టూరు) డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): గీత జయంతి సందర్భంగా సోమవారం యద్దన పూడి మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలోని చెన్నకేశవ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు నారాయణం శ్రీనివాసాచా ర్యులు ఆధ్వర్యంలో చెన్నకేశవస్వామిని ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత మహిళా భక్తులు గీత పారాయణం చేశారు. ప్రతిఒక్కరూ భగవద్గీతను చదవాల్సిన అవసరం ఉందన్నారు.

చినగంజాం ఎంపీడీవో కారును

ఢీకొన్న మరో కారు

- డ్రైవర్‌కు, వెనుక ఉన్న కారులోని కారంచేడు వైద్యుడికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారును పరిశీలిస్తున్న పోలీసులు

నాగులుప్పలపాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులకు గురై రోడ్డు పక్కన ఆపి పరిశీలిస్తున్న చినగంజాం ఎంపీడీవో కారును వెనక నుంచి వేగంగా వచ్చిన మరో కారు ఢీకొంది. ఈ ఘటన ఒంగోలు-చీరాల జాతీయ రహదారిపై మద్దిరాలపాడు వద్ద చోటుచేసుకొంది. అందిన వివరాల మేరకు.. చినగంజాం ఎంపీడీవో ధనలక్ష్మి సోమవారం రాత్రి విధులు ముగించుకొని తోటి కార్యాలయ సిబ్బందితో కలసి తన కారులో ఒంగోలు వెళుతున్న క్రమంలో చేకూరపాడు సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు మరమ్మతులకు గురైంది. దీంతో కారు డ్రైవర్ శివ రోడ్డు పక్కన ఆపి పరిశీలిస్తుండగా వెనక నుంచి వచ్చిన కారంచేడు పీహెచ్‌సీ వైద్యుడు గోరంట్ల సురేష్‌బాబు కారు ఎంపీడీవో కారును ఢీకొట్టింది. దీంతో శివ గాయపడటంతో చికిత్స నిమిత్తం 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఇక పీహెచ్‌సీ వైద్యుడు సురేష్‌బాబు చాతినొప్పితో ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేరారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఎంపీడీవో ధనలక్ష్మి, ఆమె కార్యాలయ సిబ్బంది నిర్మల, హిమబిందు ఉన్నారు. వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం సమయంలో అటుగా వెళ్తున్న మోటార్ సైకిలిస్టుకు సైతం గాయాలైనట్లు సమాచారం.



ప్రమాణ స్వీకారం చేస్తున్న వల్లూరమ్మ ఆలయ పాలక మండలి సభ్యులు

వల్లూరమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

- మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి
- ఘనంగా ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

వల్లూరు (కొండపి), డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : వల్లూరమ్మ ఆలయ అభివృద్ధికి పాలక మండలి కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. సోమవారం టంగుటూరు మండలంలోని వల్లూరమ్మ ఆలయ ఆవరణలో నిర్వహించిన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడుతున్న సీఎం చంద్రబాబుకు, ప్రజా ప్రభుత్వానికి వల్లూరమ్మ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఒడా చైర్మన్ రియాజ్ పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చదలవాడ చంద్రశేఖర్, సీనియర్ నాయకులు బెల్లం జయంత్‌బాబు, ఈదర ప్రభాకర్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ బొజ్జా శ్రీనివాసులు, సభ్యులు తుళ్లూరు వెంకటశేషమ్మ, వల్లూరి జ్యోతి, మొలకలపల్లి లక్ష్మీనారాయణ, వరికూటి సుమన్, అంబోరి అనూరాధ, తక్కెళ్లపాటి వెంకయ్య, సంగర రాజేష్, వారణాశి రామమూర్తి, బల్లిపల్లి మౌనిక, మొలకలపల్లి గీతాలక్ష్మి, బద్దిపూడి ఉమాశంకర్‌లతో ఈవో రమేష్ ప్రమాణ స్వీకారం చేయించారు.



సీపీఎం ఒంగోలు నగర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి మాబు

మహిళా మార్ట్ అక్రమాలపై విచారణ చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో మహిళా మార్ట్ పేరుతో భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయని, దీనిపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు డిమాండ్‌చేశారు. స్థానిక సుందరయ్య భవన్ సోమవారం జరిగిన సీపీఎం ఒంగోలు నగర కమిటీ సమావేశానికి నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాబు మాట్లాడుతూ మార్ట్ విషయంలో ప్రభుత్వం, జిల్లా అధికారుల నిర్లక్ష్యమే అవినీతికి కారణమని ఆరోపించారు. 2022లో మహిళా మార్ట్ పేరుతో పొదుపు సంఘాల సభ్యులు ఒక్కొక్కరి నుంచి రూ.150 వంతున సుమారు రూ. 55 లక్షలు వసూలు చేశారన్నారు. ఆర్పీల వద్ద నుంచి ఏసీ, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తామని ఒక్కొక్కరి వద్ద నుంచి మూడువేలు వసూళ్ళు కలిపి మొత్తం రూ. 68 లక్షలు సేకరించినా ప్రస్తుతం ఖాతాలో కేవలం రూ. 27లక్షలు మాత్రమే ఉందన్నారు. ఇందులో భారీ అక్రమాలు జరిగాయని, దీనిపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు తంబి శ్రీనివాసులు, వీరస్వామి, ఎస్‌డీ హుస్సేన్, టి. మహేష్, బీవీ రావు, ఆదిలక్ష్మి ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులతో దళిత నేతలు

ఇంటిని కూల్చినవారిపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టరేట్ ఎదుట బాధితుల ధర్నా

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలోని నెహ్రూకాలనీలో 20 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న ఈద జాస్మిన్ ఇంటిని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన ధర్నాలో రవిశంకర్ మాట్లాడుతూ నెహ్రూకాలనీలో డీకే ప్రభుత్వ భూమిలో 20 ఏళ్ల నుంచి రేకుల షెడ్డువేసుకొని హోటల్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఆ స్థలానికి పన్ను, కరెంటు మీటర్ కూడా ఉందన్నారు. అయితే మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇతరులకు కలిసి దౌర్జన్యంగా ఎక్స్‌కవేటర్ పెట్టి ఇంటిని కూల్చడం దుర్మార్గంగా ఉందన్నారు. అన్యాయంగా, దౌర్జన్యంగా ఇంటిని కూల్చివారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో ఉద్యమం చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం. వెంకట్, గణేష్, కృష్ణ, స్రవంతి, మల్లికార్జున, బాలమ్మ, చెన్నమ్మ, ఈద జాస్మిన్, రంగమ్మ, సుమలత, కావేరి, ఏసుదాసు, రమణ, సుబ్బయ్య ఉన్నారు.

బకాయి భారం

(5వ పేజీ తరువాయి)

చెల్లించాలి. ఒక్క గుంటూరు కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుంచి రూ.25.03 కోట్లు బకాయిలున్నాయి. గుంటూరులో ప్రభుత్వ కళాశాలకు సంబంధించి రూ.2.98 కోట్లు ఆస్తి పన్ను బకాయి 2019 నుంచి చెల్లించాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయం నుంచి రూ.1.73 కోట్లు 1993 నుంచి బకాయి ఉంది. తెనాలి మునిసిపాల్టీలో రూ.1.98 కోట్లు, మంగళగిరి - తాడేపల్లిలో రూ. 1.42 కోట్లు, పొన్నూరు మునిసిపాల్టీలో రూ.60 లక్షలు బకాయి చెల్లించాల్సి ఉంది.

కోర్టు కేసుల్లో ఆస్తి పన్ను వివాదాలు

ఆస్తి పన్ను విధించడంలో లోపాలను సవరించాలని భవన యజమానులు కోర్టులను ఆశ్రయించారు. దీంతో అయా భవనాలకు సంబంధించి పన్ను వసూలు నిలిచిపోయింది. పిటిషన్ దారులు పేర్కొన్న అంశాలను పరిష్కరించి కోర్టులో కేసులు ఉపసంహరించు కొనే దిశగా అధికారుల చర్యలు లేవు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే కేసుల సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంది. ఈ దిశగా అధికారులు చర్యలు చేపడితే పెద్ద ఎత్తున పన్ను వసూలు అయ్యే అవకాశాలు ఉన్నాయి. మూడు జిల్లాల్లో రూ.19.02 కోట్లు కోర్టు వివాదాల వల్ల పన్ను బకాయిలు పేరుకుపోయాయి. గుంటూరు జిల్లాలోని కార్పొరేషన్‌తో సహా మునిసిపాల్టీల్లో రూ 7.52 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ 9.73 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ 1.77 కోట్లు బకాయిలు ఉన్నాయి. తెనాలి మునిసిపాల్టీలో 31 కేసుల వల్ల రూ.2.98 కోట్లు పన్ను వసూలు నిలిచిపోయింది. గుంటూరు కార్పొరేషన్‌లో 66 కేసులు కోర్టుల్లో ఉన్నాయి. చిలకలూరిపేట మునిసిపాల్టీలో రూ.9.58 కోట్లు కోర్టు వివాదాల వల్ల బకాయిలు ఉన్నాయి. 6,045 అసెస్‌మెంట్‌లకు సంబంధించి కోర్టులలో పిటిషన్‌లు దాఖలయ్యాయి. కోర్టులో ఉన్న కేసులను పరిష్కరించుకొని ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేయడంతో అధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

అవీ..ఇవీ..

సైడుకాలువ, కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన



సైడుకాలువ, కల్వర్టు శంకుస్థాపనలో అధికారులు, నాయకులు

యద్దనపూడి, (మార్టూరు) డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలోని యనమదల గ్రామంలోని ఎస్సీ కాలనీలో సైడుకాలువ, కల్వర్టు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజన కింద మంజూరైన రూ.2 లక్షల నిధులతో వాటి నిర్మాణం చేపడుతున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాణి, గ్రామ నాయకులు సింగు చంద్రశేఖర్, దొడ్డా అప్పారావు, వల్లెపోగు సాల్మన్, గరికపూడి చినభూషణం, నాగభూషణం, జాగర్లమూడి సాంబయ్య, కృపారావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



పేదలకు దుప్పట్లును పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

మార్టూరు, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): గీతాజయంతి సందర్భంగా సోమవారం మండలంలోని రాజుపాలెం గ్రామంలో రాజుపాలెం చిన్మయా మిషన్ అధ్యక్షులు మాజీ రోటరీ అధ్యక్షులు జాష్టి సాంబశివరావు 100 మంది పేదలకు దుప్పట్లును పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, చెరుకూరి నాగేశ్వరరావు, గోనుగుంట్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత ఆన్‌లైన్ పరీక్ష పోటీలో పర్చూరు వాసికి బంగారు పతకం

● స్వామీజీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ప్రసన్న



ప్రసంసాపత్రం అందుకుంటున్న ప్రసన్న, శ్రీనివాసరావు దంపతులు

పర్చూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మైసూరు దత్తపీఠం ఆధ్వర్యంలో ఏటా భగవద్గీతపై నిర్వహిస్తున్న ఆన్‌లైన్ పరీక్షలో ఈ ఏడాది పర్చూరుకు చెందిన రోటరీ ఇన్నర్‌వీల్ మాజీ అధ్యక్షురాలు, వైస్ ఎంపీపీ కోటా ప్రసన్నకు బంగారు పతకం దక్కింది. మైసూరు దత్త పీఠంలో సోమవారం ఆమెకు దత్తపీఠాధిపతి చేతుల మీదుగా పురస్కారంతో పాటు, బంగారు పతకం అందుకున్నారు. ఆధ్యాత్మిక జ్ఞానానికి ప్రతీకగా నిలిచే భవగద్గీతపై పట్టుసాధించి ప్రథమస్థానంలో నిలిచిన ప్రసన్నకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందూవులు అతి పవిత్రంగా భావించే భవగద్గీత పోటీల్లో పాల్గొనడం, స్వామిజీ చేతుల మీదుగా అవార్డు అందుకోవటం భగవంతుని సంకల్పం అన్నారు.

చిట్టిబాబు మృతి పార్టీకి తీరనిలోటు



చిట్టిబాబు చిత్రపటానికి పూలమాలలతో నివాళ్లులర్పిస్తున్న నేతలు

ఇంకొల్లు, డిసెంబరు 1, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన కరి చిట్టిబాబు అనారోగ్యంతో మృతి చెందడం టీడీపీకి తీరని లోటని టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు అన్నారు. సోమవారం గంగవరంలో చిట్టిబాబు దశదినకర్మ కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లులర్పించారు. వారిలో కరి శ్రీనివాసరావు, పర్చూరు ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, పాలేరు రామకృష్ణ, బోడెంపూడి సుబ్బారావు, శివయ్య, కరి వీరాంజనేయులు తదితరులు ఉన్నారు.

గ్రానైట్ యజమానుల ఆందోళనపై విచారణకు ప్రత్యేక కమిటీ

బల్లికురవ, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ సీనరేజ్ వసూళ్ల చెల్లింపులపై ఫ్యాక్టరీ యజమానులు చేపట్టిన ఆందోళనపై సోమవారం జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి రామచంద్ర వివరణ ఇచ్చారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో మైనింగ్ సీనరేజ్‌లపై యజమానుల ఆందోళన అని ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. కమిటీ నిర్ణయం వచ్చే వరకు ఎవరు ఆందోళనలు చేపట్ట వద్దన్నారు. సీనరేజ్ వసూళ్లు చేస్తున్న కంపెనీతో గ్రానైట్ ఫ్యాక్టరీల అసోసియేషన్లు సమావేశమవుతాయని, ఫ్యాక్టరీలు యధావిధిగా పనిచేస్తున్నాయని తెలిపారు.

సమస్యల పరిష్కారం కోసమే తొలి అడుగు

● పండుగ వాతావరణంలో సామాజిక పింఛన్లు ● పాల్గొని సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే



ప్రజాసమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నియోజక వర్గంలో ప్రతీరోజు ప్రజాసమస్యల పరిష్కారంకోసమే తొలి అడుగు వేస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీ సోమవారం నియోజక వర్గంలో పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివ రావుతో కలిసి మండల పరిధిలోని సాయికాలనీ, వేటపాలెంలో రామన్నపేట, పురపాలక సంఘం పరిధిలో 5వ వార్డులో పర్యటించారు. ప్రభుత్వం అధికారం చేపట్టాక రాష్ట్రంలో 17 నెలల్లో రూ.50,763 కోట్లు పింఛన్ల ద్వారా అందించినట్లు వివరించారు. నిరుపేదలకు నివేశన స్థలాలుతో పాటు పక్కా గృహ కల్పనకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, ఎంపీడీవోలు విజయ, రాజేష్‌బాబు, తదితర కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలంలో 92శాతం ఫించన్ల పంపిణీ

పంగులూరు : మండలంలోని 21 పంచాయతీల పరిధిలో సోమవారం 92 శాతం ఫించన్ల పంపిణీ చేశారు. మండలంలో మొత్తం సామాజిక ఫించన్లు 7,810 కాగా 7,164 మందికి ఫించన్లు అందచేశారు. మండల కేంద్రమైన పంగులూరులో టీడీపీ మండల అధ్యక్షులు రావూరి రమేష్, ముప్పవరం గ్రామంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ కుక్కపల్లి ఏడుకొండలు, నియోజక వర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు గరిమిడి జగన్మోహన్ రావులు సామాజిక ఫించన్లు లబ్దిదారులకు అందచేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అద్దేపల్లి యోహాన్, టీడీపీ గ్రామ అధ్యక్షులు వేల్పుల మరియదాసు, తిరుమలశెట్టి వీరాంజనేయులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ : పింఛన్లను ప్రతి నెల ఒకటో తేదీన ఇంటింటికి అందజేసి నిరుపేద కుటుంబాలకు టీడీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కత్తి ఆశోక్‌బాబు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం బల్లికురవ గ్రామంలో ఆయన వృద్ధులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా ఒక్క ఆంధ్ర రాష్ట్రంలోనే పెద్ద ఎత్తున పింఛన్లను ప్రభుత్వం అంద జే స్తుంద న్నార ు. ఇంటింటికి తిరిగి లబ్దిదారులకు పింఛన్లను అందజేశారు.

యద్దనపూడి,(మార్టూరు) : దేశంలోనే సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ ప్రథమస్థానంలో నిలుస్తోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం ఆయన యద్దనపూడి మండలంలోని సూరవరపుపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గానికి కొత్తగా 80 పెన్షన్లు మంజూరయ్యాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్‌ను మంజూరు చేయడం కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందరికీ ప్రతి నెలా 1వ తేదీ పెన్షన్ల నగదును అందజేసే విధంగా ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. తరువాత గ్రామంలోని రేషన్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ సరుకుల నిల్వలు, పంపిణీ రిజిస్టర్, బయోమెట్రిక్ వ్యవస్థలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సైడు డ్రైనేజీని, సిమెంట్‌రోడ్డును పరిశీలిం చారు. వాటిని వేగవంతంగా పూర్తిచేయాలని, నాణ్యతతో పనులు జరగాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అదేవిధంగా సైడుకాల్వల్లో మురుగునీరు సక్రమంగా పారేవిధంగా చూడాలని, నిల్వ ఉండరాదని సూచించారు. గ్రామంలోని పలువీధులలో పర్యటించారు. కార్యక్రమంలో కోయసతీష్, గుదే తారకరామారావు, వంశీ కృష్ణ, నల్లపనేని రంగయ్యచౌదరి, రావిపాటి సీతయ్య ఇంటూరి మురళి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

అసౌకర్యం లేకుండా ఫించన్ల పంపిణీ

పర్చూరు : ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ఫించన్‌దారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఇంటివద్దనే ఫించన్ల పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో వి.ప్రద్యుమ్నకుమార్ తెలిపారు. సోమవారం సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణుల సారధ్యంలో పర్చూరు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఫించన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ కార్యదర్శులతోపాటు, సచివాలయం సిబ్బంది ఉదయం 6.30 గంటల నుంచి పించన్ల పంపిణీలో పాల్గొన్న ట్లు ఎంపీడీవో తెలిపారు.





ముప్పవరంలో పింఛన్ అందజేస్తున్న ఏడుకొండలు, సూరవరపుపల్లెలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఏలూరి సాంబశివరావు

దిత్వాతో సముద్రం ఉగ్రరూపం

● రోజంతా నానుడి వర్షం ● ఆందోళనలో రైతన్నలు



ఉగ్రరూపం దాల్చిన సముద్రం

వాడరేవు(చీరాల), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్‌తో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజలకు, రైతులకు తిరిగి దిత్వా తుఫాన్‌తో ఆందోళన మొదలైంది. రెండు రోజులుగా తుఫాన్ కారణంగా నాన్పుడు చినుకులు పడుతూనే ఉన్నాయి. ఆకాశం మేఘావృతమై ఉంది. ఈక్రమంలో వాడరేవు, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం తీరప్రాంతాల్లో సముద్రం దాదాపుగా 10 అడుగుల మేర ముందకు వచ్చింది. సముద్రం ఉగ్రరూపం దాల్చి ఎడ తెరపి లేకుండా అలలు ఎగిసిపడుతూ బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. మరొక వైపు అధికారులు, మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్ల సాయంతో గస్తీ నిర్వహిస్తున్నప్పటికీ, ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందిస్తున్నారు. ఇదిలా ఉంటే నియోజకవర్గంలో గతంలో అన్న దాతలు వరి, వేరుశనగ సాగు చేసి మొంథా తో తీవ్రంగా నష్టాల బారినపడ్డారు. తాజాగా మరోమారు పంటలు ప్రారంభించారు. ఇవి ఆరంభ దశలో ఉన్నాయి. ఇప్పటివరకు కురిసిన వర్షాలు కారణంగా రైతాంగానికి పెద్దగా ఇబ్బందులు లేవు. ఇదే తరహా వర్షాలు కురిస్తే రైతాంగం తీవ్ర సంక్షోభంలో పడే అవకాశం ఉందని అన్నదాతల ఆందోళన చెందుతున్నారు.

హెచ్‌ఐవీ బాధితులను ఆదరించాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ సౌమ్య

పర్చూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను మానతా దృక్పథంతో ఆదరించాలని పర్చూరు ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ సౌమ్య అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గేరాడ్స్ ఫౌండేషన్ చీరాల వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సూపరిండెంట్ సౌమ్య మాట్లాడుతూ ఎయిడ్స్ బారిన పడిన రోగులపై వివక్ష చూపడం, దూషించటం, చట్టారీత్యా నేర మన్నారు. సరైన అవగహన లేకపోవడం వలన ఎయిడ్స్ రోగులు పెరగటానికి కారణ మన్నారు. కార్యక్రమంలో గేరాడ్స్ ఫౌండేషన్ చైర్మన్ అల్లడి కనకరత్నం, ట్రస్టీ గేరా స్వరాజ్, కళాశాల కరస్పాండెంట్ ఒగ్గిశెట్టి నరసింహం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శేషుకుమారి, మామిడిపాక హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం(చీరాల) : రోగాల బారిన పడిన బాధితుల పట్ల ప్రజలు స్నేహపూర్వకంగా మెలగాలని పందిళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డా.హర్షవర్ధన్ ఆదిత్య అన్నారు. సోమవారం మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల వారి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు. ఈక్రమంలో భాగంగా ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు అశోక్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ కట్టా రాణీ, పిఎల్‌వీ మథీన్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

దాబాలు, రెస్టారెంట్లలో పోలీసుల తనిఖీ

మద్యం అమ్మకాలు చేపడితే చర్యలు



హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

అద్దంకి,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): రెస్టారెంట్‌లు, దాబాలు హోటళ్లలో మద్యం అమ్మకాలు చేసినా, మద్యం సేవించినా చర్యలు తప్పవని అద్దంకి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ భవాని అన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన రెస్టారెంట్లు, దాబాలు, హోటళ్లల మద్యం అమ్మకాలపై ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. సోమవారం పలు రెస్టారెంట్లు తనిఖీ చేశారు. అన్ని రెస్టారెంట్లలలో మద్యం అనుమతించబడదు అనే బోర్డులు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. రెస్టారెంట్‌ల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడితే 94409 02497 నంబరుకు సమాచారం అందించాలన్నారు.

చక్కటి ఆహారపు అలవాట్లతో హెచ్‌ఐవీ నియంత్రణ

డాక్టర్ వాహిలా చౌదరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీటీసీ సిబ్బంది

అద్దంకి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సకాలంలో మందులు తీసుకోవడం, మంచి ఆహారపు అలవాట్లు ద్వారా ఎ యిడ్ వ్యాధిని ఎదుర్కోవచ్చని డాక్టర్ వాహిలా చౌదరి అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాల నందు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధులు వచ్చిన వారు తీసుకోవాల్సిన ఆహారం మందులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉచిత న్యాయసహాయకులు టి.మార్త శ్రీను, షేక్ మహమ్మద్ రఫీ, ఎం. ప్రకాష్, పంతంగి ధనంజయరావు, స్వప్న పాల్గొన్నారు.

అద్దంకి సీహెచ్‌సీలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యశాల సిబ్బందితో అవగాహన ర్యాలీ, సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు, పీహెచ్‌సీ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పెంచలయ్య హంతకులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పంగులూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో సీపీఎం నాయకుడు పెంచలయ్యను దారుణహత్య చేసిన గంజాయి గూండాలను కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగబోయిన రంగారావు డిమాండ్ చేశారు. పెంచలయ్య దారుణ హత్యను నిరసిస్తూ, పంగులూరు ప్రధానకూడలిలో సీపీఎం నేతలు, కార్యకర్తలు సోమవారం సాయంత్రం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాగబోయిన రంగారావు మాట్లాడుతూ నెల్లూరులో గంజాయి గూండాలను అడ్డుకునేందుకు పెంచలయ్య పోరాటం చేశారన్నారు. గంజాయి ఇతర మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరుస్తూ పోరాటం చేశాడన్నారు. గంజాయి వ్యాపారానికి అడ్డుగా ఉన్నాడని పెంచలయ్యను హతమార్చిన దుండగులందరినీ కఠినంగా శిక్షంచాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తలపనేని రామారావు, గుడిపాటి మల్లారెడ్డి, ఆదుంసాహెబ్, సుధాకర్, ఏలియా, సుబ్బారావు, శ్రీనావాసరెడ్డి పాల్గొన్నారు.

చీరాల్లో జన్మదిన వేడుకలతో సంతృప్తి

● ప్రజలు మమ్మల్ని విశ్వసించారు ● నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా
● టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్



జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న హీరో నికిల్

చీరాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల్లో పుట్టిన రోజు వేడుకలు మునుపెన్నడూ లేని సంతృప్తినిచ్చాయని టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గంలో ఆయన పుట్టినరోజు వేడుకలు అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముందుగా కొత్తపేట నివాసం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పట్టణంలోని పలు ప్రధాన రహదారుల్లో కొనసాగింది. ఈక్రమంలో అభిమానులు పలుచోట్ల భారీ గజమాలలతో స్వాగతం పలికారు. సెయింట్‌మార్క్స్ లూథరన్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. గడియార స్థంభం కూడలితో పాటు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో కేక్ కటింగ్‌లు నిర్వహించారు. అలాగే అభిమానులు రక్తదానం చేశారు. ఈ పుట్టిన రోజు వేడుకలకు సినీ నటుడు నిఖిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులను ప్రజలు ఆదరించాలన్నారు. మమేంద్రనాథ్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తన తండ్రి చేస్తున్న సేవలను ప్రజలు ఆదరిస్తున్నట్లు వివరించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అలాగే స్థానిక సంస్థల్లో కూటమి జెండా ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువనాయకులు గౌరీ అమర్నాధ్, పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

కేంద్రం తీరుతో ప్రజాస్వామ్యం అస్తవ్యస్తం

● కాంగ్రెస్ కార్యకర్తలతో పరిశీలకులు అహర్ ప్రత్యేక సమావేశం



కార్యకర్తలను ఉద్దేసించి మాట్లాడుతున్న పరిశీలకులు అహర్

పేరాల(చీరాల), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీరుతో ప్రజాస్వామ్యం అస్తవ్యస్తంగా మారిందని ఏఐసీసీ పరిశీలకులు షారద్ అహర్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పేరాల పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆమంచి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ తీరును ఎండగట్టేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని చెప్పారు. ఆమంచితో పార్టీ బలోపేతమవుతుందని విశ్వసించారు. కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రటరీ విజయపాల్, పర్చూరు పార్టీ ఇన్‌చార్జ్ జ్యోతి, జిల్లా నాయకులు మార్పు గ్రెగోరీ, జడ్పీటీసీ సభ్యురాలు ఆకురాతి పద్మిని, బండ్ల తిరుమలదేవీ పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పలు మత్స్యకార గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

దీక్షధారణ స్వాములకు అన్నదానం

● ఏటా 41 రోజుల పాటు నిర్వహణ
● సోమవారంతో ముగిసిన అన్నదాన కార్యక్రమం




చద్ది స్వీకరిస్తున్న దీక్షదారులు

ఇంకొల్లు, డిసెంబరు 1, (ఆంధ్రజ్యోతి) : మాలధారణ చేసిన ఓ భక్తుడు చేసిన ఆలోచనతో ఇంకొల్లులో 18 ఏళ్లగా 41 ఏళ్లగా అన్నదానం కొనసాగుతోంది. దాత సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఈ ఏడాది సోమవారంతో ముగించారు. ఇంకొల్లులో అన్నదాన కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకొని పలుగ్రామాలలో స్వాములకు అన్నదానం నిర్వహించడం గమనార్హం. ఇంకొల్లు అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో రెండేళ్లుగా పువ్వాడ రవి గురుస్వామి స్వాములకు అన్నదానం నిర్వహిస్తున్నారు. మొంథా తుఫాన్‌తో భారీ వర్షాలు కురిసినప్పటికీ ఆయా రోజుల్లో సైతం స్వాములకు ఇబ్బందులు పడకుండా అన్నదానం నిర్వహించారు. ఈ ఏడాది అక్టోబరు 22న అన్నదాన కార్యక్రమం ప్రారంభించి డిసెంబరు 1వ తేది వరకు 41 రోజుల పాటు నిర్వహించారు. సుమారు ప్రతి రోజు 250 నుండి 300 మంది మాలధారణలకు అన్నదానం నిర్వహించారు. ఈ ఏడాది ఇంకొల్లు ప్రాంతంలో ఎక్కువ మంది మాలధారణ చేశారు. సోమవారంతో అన్నదానం ముగిసింది.

దివ్యాంగ విద్యార్థులకు పండ్లు పంపిణీ

ఇంకొల్లు, డిసెంబరు 1,(ఆంధ్రజ్యోతి) మండల విద్యావనరుల కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు ఇంకొల్లుకు చెందిన పొన్నగంటి లక్ష్మీనరేంద్ర బాబు తన పుట్టిన రోజు సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమం లో ఎంఈవో శ్రీనివాసరావు, పొన్నగంటి జానకిరామారావు, హరిబాబు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



హౌసింగ్ పీడీపై విచారణకు ఆదేశం

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్‌పై విచారణకు ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో నవరత్నాలు.. పేదలకు ఇల్లు పథకానికి సంబంధించి ఏలూరు జిల్లాలో పని చేసిన వేణుగోపాల్‌పై ఆరోపణలు రావటంతో ప్రస్తుత ప్రభుత్వం గతంలోనే వివరణ కోరింది. ఆయన ఇచ్చిన వివరణ సంతృప్తిగా లేకపోవటంతో తాజాగా శాఖాపరమైన విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రత్యేక అధికారులను కూడా నియమించింది. అలాగే మరో నాలుగు జిల్లాల అధికారులపైనా విచారణ చేపట్టాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



కమ్మేస్తున్న కాలుష్యం

- పరిశ్రమల వల్ల పెరుగుతున్న వైనం
- రసాయనాల పట్ల అప్రమత్తత అవసరం
- నిబంధనలు పాటించాలంటున్న అధికారులు
- నేడు జాతీయ కాలుష్య నివారణ దినం

పెంచలయ్య హత్యకు నిరసనగా

నేడు జిల్లా బంద్

- సీపీఐ, ఇన్సాఫ్ నాయకులు
- లేడీ డాన్ ఇల్లు కూల్చేసిన స్థానికులు
- మా ప్రాంతానికి కామాక్షి ముఠాను రానీయం

నేరాలు చేయం.. సత్ప్రవర్తనతో ఉంటాం!

నెల్లూరులో రౌడీషీటర్లతో ర్యాలీ

ఆపై నేర కార్యకలాపాల్లో పాల్గొనబోమంటూ ప్రమాణం



8 లో..



కావలిలో ఇళ్లముందు నిలబడిన వర్షపు నీరు

సంగంలో నీటమునిగిన వరి నారుమళ్లు

దిత్వా.. దిగులు

- రోజంతా మోస్తరు నుంచి భారీ వర్షం
- నేడు కూడా వాన
- 208 హెక్టార్లలో నీటమునిగిన వరి
- తీరప్రాంతాల్లోనే జిల్లా యంత్రాంగం
- పరిస్థితిని ఆరా తీస్తున్న మంత్రులు ఆనం, నారాయణ

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ ప్రభావం నెల్లూరు జిల్లాపై తీవ్రంగా కనిపిస్తోంది. సోమవారం వేకువజాము నుంచి రాత్రి వరకూ ఎడతెరిపి లేని వర్షం కురిసింది. ఇంటిలో నుంచి అడుగు బయటకు పెట్టలేని విధంగా పరిస్థితులు ఉండడంతో జనజీవనం స్తంభించింది. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురవగా, మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలో సరాసరి 10.5 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నెల్లూరు నగరంలో 46.2 మి.మీ, వెంకటాచలంలో 32.4 మి.మీ, కోవూరులో 29.6 మి.మీ, నెల్లూరు రూరల్‌లో 25.8 మి.మీ చొప్పున వర్షం కురిసింది. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇంకొన్ని చోట్ల వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లాలో ఇప్పుడిప్పుడే నార్లు పోసుకోవడం, నాట్లు వేస్తుండటంతో ఈ వర్షం రైతాంగానికి తీవ్ర ఇబ్బందిగా మారింది. 208 హెక్టార్లలో వరి పంట నీట మునగగా, మరో 80 హెక్టార్లలో నారుమడులు మునిగినట్లు వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమికంగా గుర్తించారు. కావలి, జలదంకి, కోవూరు, సంగం, బుచ్చి ప్రాంతాల్లో ఎక్కువగా నష్టం జరిగింది. మంగళవారం కూడా - మిగతా 8వ పేజీలో..

నీట మునిగిన వరినాట్లు, నారుమళ్లు

కావలి, (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కావలి ప్రాంతంలో అనేక చోట్ల వరి నాట్లు, నారుమళ్లు నీట మునిగాయి. కావలి సబ్‌డివిజన్ పరిధిలోని కావలి, అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాల్లో 200 ఎకరాలలో వరి నారుమళ్ల దెబ్బతిన్నాయని కావలి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. అలాగే మరో 500 ఎకరాలలో వరినాట్లు నీట మునిగాయని నీరు తగ్గితే కాని వాటి పరిస్థితి తెలియదన్నారు. ఇంతటితో వర్షం ఆగిపోతే పెద్దగా నష్టం ఉండకపోవచ్చని పేర్కొన్నారు. జలదంకి మండలంలో 5 వేల ఎకరాల వరకు వరినాట్లు నీట మునిగాయి. వర్షం తగ్గి నీరు బయటకు వెళితే కానీ నష్టం తెలియదని రైతులు అంటున్నారు. కావలిలో శివారు కాలనీలు, పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి.



జలదంకిలో నీటమునిగిన వరి నారు



నెల్లూరు నగరంలోని ముత్యాలపాలెంలో వర్షపునీటితో రొమ్ములోతుగా మారిన రోడ్డు



అల్లూరు : రామన్న చెరువు కలుజును పరిశీలిస్తున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ

కసురు మీదున్న కడలి



చిట్టగుంట, (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ఎఫెక్ట్‌తో కడలి కసురుమూదుంది. సముద్ర అలలు ఎగసిపడుతుండటంతో తీరప్రాంత గ్రామాల అధికారులను, సచివాలయ సిబ్బందిని తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి అప్రమత్తం చేశారు. ఎస్‌ఐ ప్రభాకర్ తన సిబ్బందితో తీరప్రాంతంలో పర్యటించి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సైచించారు.



కొడవలూరు : ఉధృతంగా ప్రవహిస్తున్న పైడేరు

'సోమశిల'కు పెరుగుతున్న వరద

అనంతసాగరం డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద పెరుగుతోంది. సోమవారం 11,011 క్యూసెక్కులు వస్తుండగా 68.815 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 2,650, కండలేరు డ్యాంకు 2వేల క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు.

● కండలేరు ఇన్‌ఫ్లో...

రాపూరు : కండలేరు డ్యాంకు 4,480 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. డ్యాం సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 58.33 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1090 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.

● పొంగి ప్రవహిస్తున్న వాగులు

చేజర్ల, (ఆంధ్రజ్యోతి) : తుఫాను నేపథ్యంలో మండలంలో నుంచి కురుస్తున్న వర్షాలకు టికేపాడు సమీపంలోని నల్లవాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో చేజర్ల నుంచి టికే పాడు, కోటితీర్థం, యనమదల, కాకివాయి తదితర గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. అదేవిధంగా గొల్లపల్లి సమీపంలో పందలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో చేజర్ల నుంచి సంగంకు రాకపోకలు నిలిచిపోయాయి. కాగా, మండలంలోని చలపనాయుడుపల్లి సమీపంలో పెన్నానది పొర్లుకట్ట మీద ఉన్న గిరిజన కుటుంబాలను తహసీల్దారు ఆర్.మస్తానయ్య సురక్షిత కేంద్రాలకు తరలించారు. వాగుల వద్ద ప్రజలు దాటకుండా ఉండేలా పోలీసులను ఏర్పాటుచేసినట్లు ఎస్‌ఐ తిరుమలరావు తెలిపారు.




టికేపాడు సమీపంలో నల్లవాగు ఉధృతి

వీఆర్వో సంతకం ఫోర్జరీ

అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసే యత్నం

పోలీస్‌స్టేషన్‌లో తహసీల్దారు ఫిర్యాదు

- వివరాలు 8లో..



ఐటీడీఏ పీవోగా సుజాత



నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (ఎఫ్ఏసీ)గా కే సుజాతను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుజాత జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారిగా పనిచేస్తున్నారు. ఆమెకు పీవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పీవోగా పనిచేస్తున్న మల్లికార్జునరెడ్డి సీఆర్‌డీఏకు డిప్యుటేషన్‌పై బదిలీ అయిన విషయం విదితమే.

పింఛన్ నగదు పోయిందని డ్రామా

తోటపల్లిగూడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పేదలకు పంపిణీ చేసే పింఛన్ నగదు తీసుకువస్తున్న బ్యాగ్ పోయిందని డ్రామా ఆడడంతో పోలీసులు మందలించారు. ఈ ఘటన తోటపల్లిగూడూరు మండలం వరిగొండ బిట్-1 సచివాలయంలో సోమవారం చోటుచేసుకుంది. సచివాలయంలో పనిచేస్తున్న మత్స్యశాఖ సహాయకులు వెంకటేశ్వర్లు సోమవారం ఉదయం పింఛన్లు పంపిణీ చేసేందుకు వస్తుండగా, 6గంటల సమయంలో రావూరివారికండ్రిగ, దేవరపాలెం మధ్యలో నగదు తీసుకువస్తున్న బ్యాగ్ బైక్ నుంచి జారి పడిపోయిందని, ఆ బ్యాగ్‌లో రూ.2,18,000 నగదు ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వర్షానికి రెయిన్ కోట్ వేసుకుని వస్తుంటే బ్యాగ్ ఎలా జారి పోతుందని పోలీసులు అతన్ని మందలించారు. కాగా మధ్యాహ్నాం తర్వాత పింఛన్లు పంపిణీ చేశారు.

90.22 శాతం పింఛన్ల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ నెల 1వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పేరిట నిర్వహిస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీ డిసెంబరు నెలకు జిల్లాలో సోమవారం ఉదయమే ప్రారంభమైంది. జోరున వర్షం కురుస్తున్నప్పటికీ తొలిరోజు 90.22 శాతం పెన్షన్లను పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 3,04,117 పింఛన్లకుగాను 2,74,383 పింఛన్లు పంపిణీ చేశారు.

● జోరువానలోనూ...

సంగం : ఓ వైపు వర్షం కురుస్తున్నా జిల్లావ్యాప్తంగా సోమవారం ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారులకు సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. సంగం మండలంలోని గాంధీజన సంఘం గిరిజన కాలనీలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. జోరు వానను సైతం లెక్క చేయక పేదల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నెల్లూరు నగరం 11వ డివిజన్‌లో రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు.



సంగం : గాంధీజనసంఘంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి ఆనం

'వాన'మ్మ జడిలో... 'కోన'మ్మ ఒడిలో...

మానస సరోవరపు తీరంలో.. కొండ కోనల సోయగాల్లో తడిసిన ప్రకృతి కాంతను చూడాలంటే.. వానమ్మ ఒక్కసారైనా రావాల్సిందే! పెంచలకోన జలపాత సోయగం చూడాలంటే.. నింగికీ.. నేలకూ నిచ్చెన వేసే 'దిత్వా' తాలూకు చినుకుల అతిథులు జాలువారాల్సిందే! రా.. రమ్మని పిలిచే పచ్చని చెట్లు.. హేమంతపు సోయగాలకు నెలవైన ప్రకృతి రమణీయత... దేహాన్నీ.. ప్రాణాన్నీ 'జి(థ్రి)ల్'మనిపించే జలపాత సవ్వడి... కణ్వనది చెంతన సహజ సౌందర్యంతో అలరారే ఆకుపచ్చని అందాలు పర్యాటకుల హృదయాల్లో చల చల్లని అనుభూతులు నింపుతున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెంచలకోన జలపాతం వాననీటి వర్షంతో సరికొత్తగా ముస్తాబైంది. కాస్త విరామం తర్వాత.. పెంచలకోన జలపాతం మళ్లీ.. రాపూరు నుదుటిపై తెల్లగా తీసిన పాపిట బొట్టులా అగుపిస్తుండడంతో ప్రకృతి ప్రేమికులు మనసారా ఆస్వాదిస్తున్నారు. కోన ఒడిలో ప్రవహించే సెలఏళ్ల ధ్వనులను వింటూ మంత్రముగ్ధులవుతున్నారు.

- రాపూరు, (ఆంధ్రజ్యోతి)

'ఉపాధి'లో నకిలీలకు చెక్!

కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు

ముఖ ఆధారిత హాజరు, ఆధార్ లింక్

28,352 జాబ్‌కార్డుల తొలగింపు

నెల్లూరు,(జడ్పీ), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పెడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకువచ్చింది. ఆ ప్రకారం జిల్లావ్యాప్తంగా 3,01,771 జాబ్‌కార్డులు ఉండగా 28,352 కార్డులను రద్దు చేస్తూ డ్వామా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధి హామీ పథకంలో ఇప్పటివరకు పనులు చేస్తున్న కూలీల ఫొటోలు తీసి ఇష్టప్రకారం కూలీల సంఖ్యను జోడించి కొంతమంది ఉద్యోగులు, సిబ్బంది అక్రమాలకు, అవినీతికి పాల్పడుతున్నారు. బయట ప్రాంతాల్లో ఉన్నవారి పేర్లతో జాబ్ కార్డులను పొంది వారంతా స్థానికంగా పనులు చేస్తున్నట్లు చూపిస్తూ నిధులను దిగమింగితున్నారు. దీనిపై ఫిర్యాదులు వస్తుండటంతో ఉపాధి హామీ పథకంలో నిబంధనలను మారుస్తూ కేంద్రం తాజాగా నిర్ణయం తీసుకుంది. పనులకు వచ్చే కూలీల ఫొటో ఆధారం కాకుండా ముఖ ఫొటోని నాలుగు గంటల వ్యవధిలో రెండు సార్లు తీయడం, దానిని ఆధార్‌కి అనుసంధానం చేసేలా నిబంధన విధించింది. దీంతో నకిలీ జాబ్‌కార్డులతోపాటు మృతుల జాబ్‌కార్డులు, అనారోగ్యంతో బాధపడుతూ పనులకు రాని వారి జాబ్‌కార్డులు మొత్తం వెలుగులోకి వస్తున్నాయి. వాటన్నిటిని అధికారులు రద్దు చేస్తున్నారు. జిల్లాలోని 37 మండలాల పరిధిలో 3,01771 జాబ్‌కార్డులు ఉండగా వాటన్నింటికి ముఖ ఆధారిత ఫొటోలు తీసి ఆధార్‌తో లింకు చేస్తున్నారు. దీంతో పనులకు వచ్చే కూలీల జాబ్‌కార్డులు మాత్రమే ఉంటున్నాయి. మిగిలినవన్నీ రద్దు అవుతున్నాయి. కాగా, కొన్ని ప్రాంతాల్లో ఈ అవినీతి వ్యవహారాలు ఆడిట్ ద్వారా వెలుగులోకి రావటంతో బాధ్యులపై చర్యలు తీసుకుంటూ సొమ్ము రికవరీకి చర్యలు చర్యలు చేపడుతున్నారు.

మండలం	ఉన్నవి	రద్దు
వెంకటాచలం	8,892	1,888
రాపూరు	9,868	1,708
వింజమూరు	7,757	1,668
అనంతసాగరం	8,564	1,403
దుత్తలూరు	5,760	1,330
పొదలకూరు	13,300	1,204
కలిగిరి	10,256	1,182
సైదాపురం	8,181	1,179
ఉదయగిరి	9,278	991
ఏఎస్‌పేట	6,466	953
కలువాయి	8,461	887
వరికుంటపాడు	7,563	877
ఇందుకూరుపేట	7,392	873
చేజర్ల	7,383	868
మర్రిపాడు	8,435	844
వలేటివారిపాలెం	10,215	837
సీతారామపురం	5,958	834
మనుబోలు	5,962	830
ముత్తుకూరు	5,939	814
కొండాపురం	9,978	688
బోగోలు	8,260	687
ఆత్మకూరు	6,857	622
నెల్లూరు రూరల్	5,164	616
జలదంకి	8,537	553
గుడ్లూరు	12,308	525
సంగం	6,894	489
ఉలవపాడు	10,415	454
దగదర్తి	9,433	435
లింగసముద్రం	9,917	311
విడవలూరు	6,764	295
కావలి	13,049	293
కొడవలూరు	6,333	286
కోవూరు	4,659	244
బుచ్చి	5,421	227
టీపీ గూడూరు	8,316	200
కందుకూరు	9,160	188
అల్లూరు	4,676	87

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	268

కోడిగుడ్ల ధర (100): 665

ఉత్తమ సేవలకు గుర్తింపు

కలిగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులకు అత్యుత్తమ సేవలందించినందుకు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్స వం సందర్భంగా కలిగిరి పీహెచ్‌సీ ఫార్మసీ ఆఫీసర్ మాచవోలు విజయకు గుర్తింపు లభించింది. ఈ మేరకు సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, ఎయిడ్స్ నియంత్రణ అధికారి షేక్ ఖాదర్‌వలిలు ఆమెకు ప్రశంసాపత్రం, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి, వైద్య సిబ్బంది విజయకు అభినందనలు తెలిపారు.



డీఎంహెచ్‌వో నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న విజయ

400 ఎకరాల

ప్రభుత్వ భూముల కబ్జా!


ఆర్‌ఆర్‌పాలెం కండేవారిబీడులో ఆక్రమిత భూముల్లో నాటిన జామాయిల్ మొక్కలు

రాజకీయ పలుకుబడికి ధన బలం తోడైతే ఏమైనా చేయవచ్చనేందుకు నిదర్శనం ఆర్‌ఆర్ పాలెంలో ప్రభుత్వ భూముల కబ్జా. ఒక నిరుపేద.. లేదా ఓ పేద రైతు ఒక అంకణమో, ఒక సెంటో ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే గద్దల్లా వాలిపోయే అధికార యంత్రాంగం ఒకే వ్యక్తి ఏళ్ల తరబడి సుమారు 100 ఎకరాలు ప్రభుత్వ గ్రేజింగు భూములు ఆక్రమించి పంటలు సాగు చేస్తుంటే తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారంటే దాని అర్థమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇలా ఒక్క రైతే కాదండోయ్ సుమారు 40 నుంచి 50 మంది రైతులు 5 నుంచి 60 ఎకరాల చొప్పున రూ.20 కోట్ల విలువైన 400 ఎకరాలు (160 హెక్టార్లు) భూములు ఆక్రమించి యథేచ్ఛగా జామాయిల్, పొగాకు సాగు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అదికూడా ఒక గ్రామ పరిధిలోకి ఇతర గ్రామాల భూస్వాములు వచ్చి భూములు ఆక్రమించి సాగు చేయడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోంది. ఇదంతా నమ్మబుద్ధి కావడం లేదా.. కానీ ఇది నిజం.. ఇంకా నమ్మబుద్ధి కాకుంటే ఆర్‌ఆర్ పాలెంలోని కండేవారిబీడులోని ప్రభుత్వ గ్రేజింగు భూముల్లోకి వస్తే కబ్జా అయిన భూములను కళ్లారా చూడవచ్చు.

- లింగసముద్రం,(ఆంధ్రజ్యోతి)

- సుమారు 160 హెక్టార్ల ఆక్రమణ
- ఒక్కొక్కరు 5 నుంచి 100 ఎకరాల్లో తిష్ట
- యథేచ్ఛగా జామాయిల్, పొగాకు సాగు
- ఆక్రమణదారులంతా మొగిలిచెర్ల, నారసింహాపురం భూ స్వాములే..
- భూములను కాపాడాలని ఆర్‌ఆర్ పాలెం వాసుల ఆందోళన
- ఏళ్ల తరబడి అధికారులకు ఫిర్యాదు
- గత నెలలో బోర్డులు పెట్టినా పీకేసిన అక్రమార్కులు

లింగసముద్రం మండలంలోని ఆర్‌ఆర్ పాలెం గ్రామ పరిధిలోని కండేవారిబీడులో వందల ఎకరాల ప్రభుత్వ గ్రేజింగు భూములు ఉన్నాయి. వీటి విలువ ఎకరా రూ.5 లక్షలు ఉంటుంది. ఆ లెక్కన ఆక్రమణలకు గురైన సుమారు 400 ఎకరాలు ధర రూ.20 కోట్లకు పైబడి ఉంటుందని అంచనా. ఈ భూములను మండలంలోని మొగిలిచెర్ల, నారసింహాపురం గ్రామాలకు చెందిన భూస్వాములు ఆక్రమించి జామాయిలు, పొగాకు దర్జాగా సాగు చేస్తున్నారు. వాస్తవానికి పొగాకు పంట ఆక్రమిత భూముల్లో సాగు చేసేందుకు బోర్డు అనుమతి ఇవ్వదు. కానీ ఇక్కడ అందుకు భిన్నంగా ఎక్కడో బ్యారన్లు చూపించి ఆక్రమిత భూముల్లో పొగాకు సాగు చేస్తున్నారు. ఇది బోర్డు అధికారులకు తెలిసినా పట్టించుకునే నాథుడు లేరు. ఈ భూముల ఆక్రమణదారుల్లో కొందరు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పంచన చేరుతుండగా మరికొందరు ఏ పార్టీలోనైనా చక్రం తిప్పుతూ ఆక్రమిత భూముల జోలికి ఎవరూ రాకుండా కాపాడుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో తమను ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో యథేచ్ఛగా పంటలు సాగు చేస్తూ ఏటా లక్షలాది రూపాయలను అక్రమంగా ఆర్జిస్తున్నారు. మరికొందరు ఆక్రమించిన భూములను ఎకరం రూ.10 వేల వంతున కౌలుకి ఇస్తున్నారు. కందుకూరు, కావలి, లింగసముద్రం తదితర ప్రాంతాలకు చెందిన రైతులు కౌలుకు తీసుకొని పొగాకు సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు కండేవారిబీడులో సుమారు 400 ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురయ్యాయని గ్రామస్థులు అంటున్నారు. ఈ నేపథ్యంలో తమ గ్రామ ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించి భూములను స్వాధీనం చేసుకోవాలని ఆర్‌ఆర్‌పాలెం వాసులు ఏళ్లతరబడి ప్రజాప్రతినిధులు, మండల, జిల్లాస్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయినా వీరి మొర ఆలకించే నాథుడు కరువయ్యారు. దీంతో వారంతా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్న నేపథ్యంలో గతనెలలో ఆక్రమిత భూములు ప్రభుత్వానికి సంబంధించినవని, వీటిలో ఎవరూ దిగకూడదని, ప్రభుత్వ హెచ్చరికను బేఖాతరు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అది మూణ్ణాల ముచ్చటగా మారి ఆ బోర్డులను ఏర్పాటు చేసిన మూడు రోజుల్లోనే ఆక్రమణదారులు పీకి పారేశారు. అయినా పట్టించుకునే వారు లేరు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఆర్ పాలెం గ్రామస్థులు కోరుతున్నారు.


ఆక్రమిత భూముల్లో సాగు చేసిన పొగాకు పంట

పోలీసులకు ఫిర్యాదు చేస్తాం

మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో గ్రేజింగ్ భూములు సుమారు 88 ఎకరాలు ఆక్రమించిన ఆక్రమణదారులు 13 మందిపైన, లింగసముద్రంకు చెందిన ఆక్రమణదారులు 14 మందిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. అలాగే లింగసముద్రం, వెంగళాపురం, మాలకొండరాయునిపాలెం, పెంట్రాల, ఆర్‌ఆర్ పాలెం, మొగిలిచెర్ల, రాళ్లపాడు, పెదపవని గ్రామాలలో అన్ని రకాల ప్రభుత్వ భూములు ఆక్రమణలు గుర్తిస్తాం. వర్షాలు తగ్గిన తరువాత తమ సిబ్బంది ద్వారా ఆక్రమణదారులను గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయిస్తాం.

- ఎం.కోటేశ్వరరావు, తహసీల్దారు

ప్రమాదకరంగా ఫ్లెక్సీలు!

● వర్షం వచ్చినా.. గాలి వీచినా పడిపోతున్న వైనం


వెంగళరావునగర్ వసతిగృహాల మలుపు వద్ద పడిపోయిన ఫ్లెక్సీ

కావలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మారాయి. కొద్దిపాటి వర్షం వచ్చినా.. చిన్న గాలి వీచినా ఎక్కడ ప్రజలపై, వాహనచోదకులపై కూలుతాయోననే భయం నెలకొంది. దిత్వా తుఫాన్ ప్రభావంతో మున్సిపల్ అధికారులు ముందు జాగ్రత్తగా అనేక చోట్ల ఫ్లెక్సీలు తొలగించినా ఇంకా అనేకం వదిలి వేశారు. తుఫాన్ ప్రభావం లేకపోయినా ఓమోస్తరు వర్షానికే అనేక చోట్ల ఫ్లెక్సీలు కిందపడి ప్రజల రాకపోకలకు ఆటంకంగా మారాయి. ఇంకా అనేక చోట్ల వర్షాలకు ఒరిగి ఉన్న ఫ్లెక్సీలు ఎక్కడ పడతాయోనని ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యంగా పట్టణంలో ఎక్కడా నిబంధనలు పాటించకుండా మున్సిపల్ అనుమతుల తీసుకోకుండా ప్రజలకు ఇబ్బందికరంగానే ఫ్లెక్సీలు కడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ ఎక్కడైనా మున్సిపల్ అధికారులు అభ్యంతరం చేసినా ఫ్లెక్సీలు కట్టే వారికి అధికారపార్టీ నాయకుల మద్దతు ఉండటంతో ఎవరిని కాదనలేకపోతున్నారు. ఇలాంటి పరిస్థితులలో పట్టణంలో ఏర్పాటు చేసే ఫ్లెక్సీలకు ఒక ప్రామాణికం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుడా ప్రమాదలకు తావివ్వకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

ముసునూరు ఇందిరమ్మ కాలనీ జలమయం


కోతకు గురైన ముసునూరు అట్టల ఫ్యాక్టరీ నుంచి ఆర్పి వైపు రోడ్డు

కావలిరూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): చినుకుపడితే ముసునూరు ఇందిరమ్మకాలనీ జలమయం అవుతోంది. సుమారు 20 ఏళ్ల క్రితం 6000 మంది పేదలకు ముసునూరులోని రైల్వే ట్రాక్‌కు పడమర వైపున నివేశన స్థలాలు కేటాయించారు. ప్రభుత్వాలు మారుతున్నా నాటి నుంచి నేటికీ అక్కడ నివశిస్తున్న పేదలకు తాగునీరు, రోడ్ల వంటి వసతులు కల్పించకపోగా కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేస్తున్నారు. వర్షాలకు నివాసాల మధ్యన వర్షపు నీరు నిల్వ చేరుతుండడంతో అత్యవసర సమయాల్లో కూడా ఇళ్ల నుంచి బయటకు రాలేని స్థితిలో స్థానికులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా మారడంతో పాటు రోడ్లపై వర్షపు నీటితో బురదమట్టి మేట వేసి కోతకు గురైన రోడ్లతో రాకపోకలకు తరచూ ప్రమాదాల బారిన పడాల్సి వస్తుంది. ప్రభుత్వాలు మారినా తలరాతలు మారడం లేదని, పేదలు నివశించే కాలనీలో కనీసం వీధి దీపాలు కూడా వెలగటం లేదని, అధికారులు, పాలకులు స్పందించి అంతర్గత రోడ్లు, తాగునీటి వసతులు కల్పించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

కొండాపురంలో చిరుజల్లులు


భీమవరప్పాడులో బురదమయమైన సీసీ రోడ్డు

కొండాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో మండలంలో సోమవారం చిరుజల్లులు కురిశాయి. 3 మి.మీటర్ల వర్షపాతం నమోదయినట్లు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. చిరుజల్లులతో సీసీ రోడ్లు సైతం బురదమయంగా మారి రోడ్లపై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నీట మునిగిన వరినారుమడులు, నాట్లు

జలదంకి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలుచోట్ల, ప్రధానంగా బ్రాహ్మణక్రాక మేజర్ కాలువ, కాకమ్మచెరువు కింద వేసిన వరినాట్లు అధిక శాతం నీట మునిగాయి. వారం రోజుల వ్యవధిలో వేసిన వరినాట్లు కావడంతో దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి నారుమళ్లు కూడా చాలాచోట్ల నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో అధికారుల పర్యటన


శివరామసుబ్బయ్య కాలనీలో గిరిజనులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

కావలి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో కావలిలో కురిసిన వర్షాలకు పరిస్థితులను తెలుసుకునేందుకు సోమవారం కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాం, ఏఈ వినోద్ తదితరులు పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా కావలి చెరువుకట్ట వద్ద ఉన్న శివరామసుబ్బయ్య కాలనీలో పర్యటించి అక్కడ గిరిజనుల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు ఎక్కువై ఏదైనా ఇబ్బందులు ఎదురైతే తమదృష్టికి తెస్తే వెంటనే తగు సహాయక చర్యలు చేపడతామని చెప్పారు. తమ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనిస్తున్నారన్నారు. అనంతరం వైకుంఠపురంలోని అన్నపుగుంట ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ వర్షపు నీరు నిల్వలను బయటకు పంపేందేందుకు చర్యలు చేపట్టారు.

దిత్వా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉన్నాం

కలిగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ పట్ల మండలంలో పూర్తిస్థాయిలో ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తహసీల్దారు గిరీష్‌కుమార్ తెలిపారు. తుఫాన్ ప్రభావం ముగిసే వరకు ప్రత్యేక అధికారులను నియమించడం, లోతట్టుప్రాంత ప్రజలను సురక్షితప్రాంతానికి తరలించడంతోపాటు, ప్రమాదకర వంతెనల వద్ద ముందస్తు రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

వరద నీరు చేరితే సమాచారం ఇవ్వండి

అల్లూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంగా కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వరదనీరు ప్రవహిస్తే వెంటనే స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలని తహసీల్దారు లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పలు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. గిరిజన ప్రాంతాల్లో పర్యటించి పలు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా కాలువలు, వాగుల్లో వరద ప్రవాహం పెరిగినట్లయితే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. అనంతరం అల్లూరు చెరువు, రామన్న చెరువులను పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 132-33 కేవీ సబ్‌స్టేషన్‌లో ఆధునీకరణ, రిలే ప్యానెల్ రీప్లేస్‌మెంట్ పనులు మంగళవారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతాయని, ఈ సమయంలో దీని పరిధిలోని 33-11కేవీ సబ్ స్టేషన్‌లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం జరుగుతుందని ఆపరేషన్స్ ఈఈ వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అయా సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రజలు, రైతులు అసౌకర్యాన్ని గుర్తించి సహకరించాలని పేర్కొన్నారు.

నేటి జిల్లా బంద్‌ను జయప్రదం చేయండి


సమావేశంలో పాల్గొన్న వామపక్ష పార్టీలు, ఎమ్మార్పీఎస్ నేతలు

కావలి(టౌన్), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకుడు పెంచలయ్యను గంజాయి మూకలు హత్య చేసి చంపడాన్ని ఖండిస్తూ మంగళవారం నిర్వహించ తలపెట్టిన జిల్లా బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీల నేతలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వామపక్ష పార్టీలు, ఎమ్మార్పీఎస్ నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, తిరుపాలు, కృష్ణమోహన్, సీపీఐ నేతలు దర్గాబాబు, బోసు, ఎమ్మార్పీస్ నేతలు చేవూరి కిరణ్, రాపూరి శివలు మాట్లాడారు. ప్రజా ఉద్యమాలే ఊపిరిగా గంజాయి మహమ్మారిని అరికట్టాలన్న దృడసంకల్పంతో ఉద్యమిస్తూ యువతను చైతన్యపరుస్తున్న పెంచలయ్యను గంజాయి మూకలు హత్య చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి లేకుండా చేస్తామని, గంజాయి మూకలను ఉక్కుపాదం మోపతామని చెప్తున్న మాటలు ఆచరణలో జరగటం లేదన్నారు. గంజాయిని అరికట్టి యువతను పెడదోవ పట్టకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, పెంచలయ్య హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

తహసీల్దారు సీతామహాలక్ష్మికి సన్మానం


తహసీల్దారుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నేత

జలదంకి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దారుగా గత శనివారం బాధ్యతలు చేపట్టిన సీతామహాలక్ష్మిని టీడీపీ మండల అధ్యక్షుడు మున గాల తిరుమలరెడ్డి సోమ వారం ఆమె కార్యాలయం లో కలసి సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలో రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరి ష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. మండలంలో రీస ర్వే జరిగే గ్రామాల్లో అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

టీఆర్‌ఆర్‌లో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం



ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

కందుకూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఎయిడ్స్‌పై విద్యార్థినీ విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, రంగోలి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి ఇప్పటికీ సైలెంట్ కిల్లర్‌లా ఉందని, విద్యార్థులంతా ఎయిడ్స్ పట్ల సంపూర్ణ అవగాహనతో అప్రమ త్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమం అనంతరం ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించే ప్లేకార్డులతో విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ కోటపాటి నరేష్‌రాజా, కేవీ పద్మావతి, పీ.రాజగోపాలబాబు తదితరులు పాల్గొన్నారు.

జేబీ డిగ్రీ కళాశాలలో..


రెడ్ రిబ్బన్ ఆకారంలో విద్యార్థులు

● కావలి(టౌన్) : జేబీ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించారు. రెడ్ రిబ్బన్ ఆకారంలో విద్యార్థులు నిలబడి ఎయిడ్స్ మహమ్మారిని అరికడతామని, ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేస్తామని నినాదాలు చేశారు. విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, ఫేస్ పెయింటింగ్, రంగోలి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యంనాయుడు, స్వయం ఉపాధి కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి, క్లబ్ కోఆర్డినేటర్ వసుంధరదేవి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం : ఇంటూరి


ఉలవపాడు : పింఛను అందచేస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు


బిట్రగుంట : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగుమాటి

ఉలవపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమంతోపాటు రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన ఉలవపాడులోని మసీదు సెంటర్ ఏరియాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను నగదు అందజేశారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుంటు వెంటనే సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మంచినీటి కళాయిలు, డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేదని, ఏళ్ల తరబడి ముస్లింలకు చెందిన బజారు ఆక్రమణకు గురైయిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు ముస్లింలు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై సర్వే నిర్వహించి సమస్యను పరిష్కరించాలని తహసీలాదరు శ్రీనివాసులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు కేటాయించిన బడ్జెట్‌ను ఆయా గ్రామాల అభివృద్ధికే పూర్తిస్థాయిలో వినియోగిస్తూ గ్రామాలు సుభిక్షంగా ఉండేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దీక్షతో పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు నాగలక్ష్మి, నాయకులు రాచగల్లు సుబ్బారావు, గిరి సారాయిబాబు, కరీం, పొదిలి మాబాషా, పఠాన్ రాహుల్, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

● అర్హులందరికీ పింఛన్లు : ఎమ్మెల్యే దగుమాటి

బిట్రగుంట : అర్హులందరికీ పింఛన్లు అందచేయడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. బోగోలు మండలం ముంగమూరులో సోమవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పింఛనఖ నగదు పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. 2018-19 లో నిర్మాణం చేపట్టి వివిధ దశల్లో ఉన్న పక్కా గృహాలకు బిల్లులు ఇవ్వలేదని గిరిజనులు ఎమ్మెలేకు విన్నమించుకున్నారు. స్పందించిన ఆయన హౌసింగ్ అధికారులతో ఫోన్లో మాట్లాడి వీలైనంత త్వరగా బిల్లులు మంజూరయ్యేలా చర్యలు చేపడతాం అన్నారు. పశువైద్య శాల శిథిలావస్థకు చేరిందని స్థానిక రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, జనసేన నేత సిద్దు, టీడీపీ నేతలు కండ్లగుంట మధుబాబునాయుడు, యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, ఎల్.సుధీర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బోగోలు మండల టీడీపీ యువనేత గోచిపాతల సంజయ్ తల్లి గోచిపాతల స్నేహలత (62) అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతి చెందగా ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అక్కడికి వెళ్లి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు చిలకపాటి వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, గిరిజన నేత బోగిరిప్రభాకర్, టీడీపీ నేతలు కుంచాల తిరుమలేష్, మహిళా అధ్యక్షురాలు మల్లి అరుణమ్మ, తదితరులు ఉన్నారు.


కలిగిరి : పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

● పెన్షన్ పేద కుటుంబాలకు ఆసరా : ఎమ్మెల్యే

కలిగిరి : ఎటువంటి ఆసరా లేని పేదకుటుంబాలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఎంతగానో ఆదుకుంటుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని గంగిరెడ్డిపాలెంలో జరిగిన పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన మాట ప్రకారం రూ.4వేలు పెన్షన్ అందిస్తున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సూరేపల్లి మాధవ, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **కొండాపురం** : మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 87 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 5,336 మంది లబ్ధిదారులు ఉండగా 4,653 మందికి పింఛన్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల కన్వీనర్ పోలినేని చంద్రబాబునాయుడు, నాయకులు పోలినేని రమేష్, దాసరి అశోక్, జాగర్లమూడి శ్రీను, చాగంటి క్రిష్ణ, జీ.మాధవ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

● **జలదంకి** : మండల కేంద్రం జలదంకిలో సోమశిల ప్రాజెక్ట్ వైస్‌చైర్మన్ పీ.మధుమోహన్‌రెడ్డి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు నగదు అందజేశారు. జమ్మలపాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. తిమ్మసముద్రంలో టీడీపీ నేత కంచర్ల వినోద్‌నాయుడు, బీ.కెఅగ్రహారంలో టీడీపీ నాయకులు స్వర్ణ కొండపనాయుడు, ఎల్.దశరథరామానాయుడు పింఛన్లు పంపిణీ చేశారు.

వైభవంగా కలశాలతో బాలాలయ ప్రవేశం

కలిగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కలిగిరి పట్టణంలోని పర్వతవర్ధిని జానకిరామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణాన్ని పురస్కరించుకుని సోమవారం బాలాలయ ప్రవేశం వైభవంగా జరిగింది. సుమారు 200 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్థులు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా కలశాలతో బాలాలయ ప్రవేశం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తుల ఓం నమఃశివాయ నామస్మరణలతో, వేదపండితుల మంత్రోశ్చరణాల మధ్య వైభవంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొనగా ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, జడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కలశాలతో ఆలయం ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, నిర్వాహకులు

నగరంలో రౌడీ షీటర్లతో ర్యాలీ

నెల్లూరు(క్రైం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గతంలో ఎప్పుడూ లేని విధంగా సిటీ పక్కీలో నెల్లూరు నగర రోడ్లపై రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్లు, ఇతర నేర చరిత్ర కలిగిన వారితో సోమవారం పోలీసులు ర్యాలీ నిర్వహించారు. నగరంలోని వీఆర్సీ కూడలి నుంచి గాంధీబొమ్మ వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం వారితో భవిష్యత్తులో ఎలాంటి నేర కార్యకలాపాల్లో పాల్గొనబోమని, సత్ప్రవర్తన కలిగి ఉంటామని ప్రమాణం చేయించారు. నగర ఇన్‌చార్జి డీఎస్పీ గిరిధర్ మాట్లాడుతూ నగరంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసు శాఖ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిన్నబజారు, వేదాయపాలెం, బాలాజీనగర్ పోలీసు స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.


గాంధీబొమ్మ వద్ద రౌడీషీటర్ల ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

నీలి నీలి ఆకాశం..
ఎరుపెక్కిన వేళ !

పగలంతా నీలం రంగు.. సాయంత్రం నారింజ రంగులో ఉండే ఆకాశం సోమవారం సాయం సంధ్యవేళ ఎరుపు రంగులో దర్శనం ఇచ్చింది. ఇది నగర వాసులను ఎంత గానో ఆకట్టుకుంది.
- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)



ఫిర్యాదుదారులతో గౌరవంగా నడుచుకోండి


సిబ్బందితో మాట్లాడుతున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులతో గౌరవప్రదంగా నడుచుకోవాలని జిల్లా పోలీసు అధికారులను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. ఆయన సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో శాంతిభద్రతలపై ఎస్పీ డాక్టర్ అజిత వేజండ్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగరంలోని చిన్నబజారు పోలీసు స్టేషన్‌ను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో ఉన్న పరిస్థితులు, నేర ప్రాంతాలపై ఆరా తీశారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్లు, పాత నేరస్తుల వివరాలు సేకరించారు. రికార్డులు తనిఖీ చేశారు. నేరస్తులపై నిఘా పెంచాలని, క్రిమినల్ చర్యలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ వ్యవస్థను ముమ్మరం చేయాలని, పెండింగ్ కేసుల విచారణలో జ్యాపం లేకుండా ఫైనల్ రిపోర్ట్స్ చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో నగర ఇన్‌చార్జి డీఎస్పీ గిరిధర్, చిన్నబజారు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెంచలయ్య హత్యకు నిరసనగా నేడు జిల్లా బంద్



సమావేశంలో మాట్లాడుతున్న అజీజ్ అహ్మద్

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజానాట్య మండలి నాయకుడు పెంచలయ్య హత్యకు నిరసనగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా బంద్ నిర్వహిస్తున్నట్లు ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్, సీపీఐ నెల్లూరు నగర సహాయక కార్యదర్శి సయ్యద్ సిరాజ్ వెల్లడించారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ వల్ల యువత చెడిపోతోందని, నెల్లూరును డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని పెంచలయ్య ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. గంజాయి మీద పోలీసులు ఉక్కుపాదం మోపుతున్న తరుణంలో గంజాయి బ్యాచ్ కక్షకట్టి పెంచలయ్యను కిరాతకంగా హత్య చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గంజాయి ముఠాను పోలీసులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్, ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి అహ్మద్, జమాత్ ఇస్లాం నాయకుడు నవీద్, షాజహాన్, లతీఫ్, మున్వర్, షాహుల్, గని, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

● ఆర్పీఐ మద్దతు

నెల్లూరు(హరనాథపురం) : గంజాయి గ్యాంగ్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీలు మంగళవారం చేపడుతున్న బంద్‌కు మద్దతు ఇస్తున్నామని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) జిల్లా అధ్యక్షుడు షేక్ మాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గంజాయి సరఫరా చేసే వ్యక్తులు ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారో, ఆ పార్టీ ప్రతినిధులను కూడా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రసన్నుడి ఆలయానికి రూ.21 లక్షల ఆదాయం


బ్రహ్మోత్సవ వేలం పాటలు నిర్వహిస్తున్న ఈవో రాధాకృష్ణ

బిట్రగుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరిలో జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వివిధ అంశాలకు సంబంధించి సోమవారం నిర్వహించిన వేలం పాటల్లో ఆలయానికి రూ.21 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో రాధాకృష్ణ తెలిపారు. ఈ వేల పాటలు ఆలయాల కోవూరు గ్రూప్ ఈవో కృష్ణప్రసాద్ అధ్యక్షతన జరిగాయి. బ్రహ్మోత్సవాల సమయంలో, ఏడాది పొడవున దుణానాల నిర్వాహణకు, చెరుకు విక్రయానికి స్థల కేటాయింపు, ఏడాది పొడవు తలనీలాలు పోగు చేసుకోవడం, కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయించుకోవడం, పాదరక్షలు భద్రపరిచే హక్కు వేలం జరిగింది. మిగిలిన వేలం పాటలు వాయిదా వేశారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తెలియ చేస్తామని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి వ్యాపారులు, దుకాణదారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దిత్వా.. దిగులు

(5వ పేజీ తరువాయి)

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. మరోవైపు విద్యాసంస్థలకు మంగళవారం కూడా సెలవు ప్రకటించారు. సోమశిల జలాశయానికి 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నెల్లూరు కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి అధికార యంత్రాంగం క్షేత్రస్థాయి పరిస్థితి ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. అత్యవసర లైన్ డిపార్ట్‌మెంట్ల సిబ్బంది మొత్తానికి సెలవులు రద్దు చేసి విధుల్లో కొనసాగిస్తున్నారు. బీచ్‌ల వద్దకు ఎవరూ వెళ్లకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డిలు నెల్లూరులోనే ఉంటూ తుఫాన్ ప్రభావం నివారణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

● నెల్లూరుకు దక్షిణ ఆగ్నేయంగా..

నెల్లూరుకు దక్షిణ ఆగ్నేయంగా తీవ్ర వాయుగుండం కేంద్రీకృతమై ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ప్రభావంతో మంగళ, బుధవారాలలోనూ తేలికపాటి నుంచి భారీ వర్షాలతోపాటు 35 నుంచి 45 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.

'రాళ్లపాడు' వద్దే అధికారుల మకాం

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద అధికారులు అప్రమత్తమయ్యారు. భారీ వర్షాలు కురిసి ప్రాజెక్టులోకి వరద వస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిస్థితులను అధిగమించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇందుకోసం ఆదివారం రాత్రి నుంచి ఈఈ మునిరత్నం, డీఈలు ఎం.వెంకటేశ్వర్లు, పీవీ.శేషయ్య, ఏఈలు బీ.మనోహర్, వినోద్‌కుమార్, సిబ్బంది ప్రాజెక్టు వద్దే మకాం వేశారు. సోమవారం ఈఈ మాట్లాడుతూ ప్రాజెక్టు ఎగువ భాగాన భారీ వర్షాలు కురిసి ప్రాజెక్టులోకి వరద నీరు వస్తే గేట్లు ఎత్తి నీరు మన్నేరుకు విడుదల చేస్తామని చెప్పారు.

కమ్మేస్తున్న కాలుష్యం

- పరిశ్రమల వల్ల పెరుగుతున్న వైనం
- వాయుకాలుష్యం వల్ల సేఫ్
- రసాయనాల పట్ల అప్రమత్తత అవసరం
- నిబంధనలు పాటించాలంటున్న అధికారులు
- నేడు జాతీయ కాలుష్య నివారణ దినం

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తీర ప్రాంతంలో కాలుష్యం అధికంగా ఉంది. దీంతో ఆయా ప్రాంతాల్లో మనుషులతోపాటు జీవాలు కూడా కాలుష్యం బారిన పడుతున్నాయి. ఆయా పరిశ్రమలు పూర్తిస్థాయిలో నియంత్రణ చర్యలు చేపట్టక పోవటంతో తీరప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి థర్మల్ విద్యుత్ కేంద్రాల వల్ల కాలుష్యం ప్రబలుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం డిసెంబరు 2న (నేడు) జాతీయ కాలుష్య నివారణ దినం జరుపుకోవాలని తీర్మానించింది.

● సేఫ్‌గా జిల్లా

నెల్లూరు జిల్లా వాయుకాలుష్యంలో నిబంధనల ప్రకారం కూబిక్ మీటరు 52 మైక్రో గ్రాములు ఉండటంతో ఇది ఎంతో సేఫ్‌గా ఉన్నట్లు గుర్తింపు వచ్చింది. జిల్లాలోని తీర ప్రాంతాల్లో పరిశ్రమలు పెద్దసంఖ్యలో రావటంతో వాటి కారణంగా కాలుష్యం 15 కిలోమీటర్ల వరకు విస్తరించింది. కొన్ని పరిశ్రమలు కాలుష్య నియంత్రణశాఖ అధికారుల చర్యల వల్ల కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోవటంతో కొంత వరకు కాలుష్యం అదుపులో ఉంది. కొన్ని పరిశ్రమల కారణంగా నీరు, గాలి, భూమి కలుషితం కావడంతో ప్రజారోగ్యం దెబ్బతినడానికి కారణలవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో భూమి, నీరు, గాలి కాలుష్యానికి గురవుతూ కొన్ని ప్రాణాలకే ముప్పుగా మారుతున్నాయి.

జిల్లాలో వాయు కాలుష్యం

సంవత్సరం	మైక్రోగ్రాములు
2020-21	59
2021-22	60
2022-23	54
2023-24	52
2024-25	52
2025-26	52


ముత్తుకూరు మండలంలోని థర్మల్ స్టేషన్ వెదజల్లుతున్న కాలుష్యం

● తగ్గిన పంటల దిగుబడి

జిల్లాలోని తీరప్రాంతాల్లో ఇప్పటికే కొన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో కొన్ని ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించాయి. ఆ పరిశ్రమల 15 కిలోమీటర్ల పరిధిలో 2 నుంచి 5 డిగ్రీలు ఉష్ణోగ్రత పెరిగి పంటల దిగుబడి 30 శాతం తగ్గుతుంది. ఆక్వా పరిశ్రమమే కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఒక్కో థర్మల్ పవర్ స్టేషన్ నుంచి రోజుకు 2 లక్షల టన్నుల బూడిద వెదజల్లబడి తాగునీరు, సాగునీరు కలుషితమవుతున్నది. థర్మల్ కేంద్రాల వేడి వల్ల సముద్రంలోని వేల టన్నుల రొయ్యలు, చేపలు చనిపోయి, మత్స్యకారులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. ఇక వాహన కాలుష్యం వల్ల జీవజాతుల మనుగడ కష్టతరంగా మారుతోంది. గతంలో ఏడాది 46 డిగ్రీలకే అల్లాడిపోయిన జిల్లా ప్రజానీకం వచ్చే వేసవిలో 47 డిగ్రీల ఉష్ణోగ్రతల వరకు చవిచూడాల్సిన వస్తుందని నిపుణులు అంటున్నారు. దీనికితోడు ఫ్రిజ్‌లు, ఏసీల వాడకం పెరగడంతో క్లోరోఫ్లోరో కార్బన్‌లు వెదజల్లుతున్నాయి. ఓజోన్ పొరను దెబ్బతీస్తున్నాయి. ఐదేళ్లుగా కాలుష్యం ప్రమాదస్థాయిలో లేదని అధికారులు చెబుతున్నా, కాలుష్యం ప్రమాద స్థాయిలోనే ఉందన్న వాదన వినిపిస్తోంది.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం...



జిల్లాలో కాలుష్య నియంత్రణపై ప్రజల్లో అవగాహన కలిగిస్తున్నాం. ప్రత్యేకించి జిల్లా తీర ప్రాంతంలో ఉన్న పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. కాలుష్య నియంత్రణ చర్యలు పక్కాగా పాటిస్తుండటంతో కాలుష్యం నియంత్రణలో ఉంది. తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి. తద్వారా ఆక్సిజన్ ఉత్పత్తి పెరిగి, ప్రతీ జీవి ఆరోగ్యంగా ఉంటుంది
- అశోక్ కుమార్, కాలుష్య నియంత్రణ శాఖ ఈఈ

రేపు హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3న చిల్లకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జిల్లా పురుషుల జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు కసుమూరు హరిచంద్రా రెడ్డి, పీ అజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ, మూడు ఫొటోలు తీసుకురావాలని కోరారు. ఎంపికైన జట్టు ఈనెల 5, 6 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు.

'డయల్ యువర్ సీఎండీ'కి ఎనిమిది వినతులు

నెల్లూరు,(జడ్పీ), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి: ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ తిరుపతిలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి జిల్లా నుంచి వినియోగదారులు సమస్యలు తెలుపుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం 8 సమస్యలను జిల్లాలోని వినియోగదారులు సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ స్తంభాలు, లైన్లు, ఓల్టేజీ తదితర సమస్యలపై సీఎండీకి తెలపటంతో ఆ సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పరీక్ష ఫీజు పేరుతో దోపిడీ

- టెన్త్ ఎగ్జామ్ ఫీజు రూ.125
- ప్రైవేట్ పాఠశాలల్లో రూ.వెయ్యికి పైగానే వసూలు

పొదలకూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫీజు పేరుతో అడ్డగోలు దోపిడీ జరుగుతోంది. పలుచోట్ల ప్రైవేటు పాఠశాలల్లో పదిరెట్లు బాదేస్తున్నారు. జిల్లాలో చాలా పాఠశాలల్లో ఈ పరిస్థితి నెలకొనగా, పట్టించుకోవాల్సిన విద్యాశాఖ ప్రేక్షక పాత్రకే పరిమితమైంది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. వచ్చే మార్చిలో పరీక్షల నిర్వహణకు షెడ్యూల్ విడుదలైంది. రెగ్యులర్ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.125గా నిర్ణయించారు. అదే సప్లిమెంటరీ రాసేవారికి మూడు సబ్జెక్టుల లోపు ఉంటే రూ.110గా పేర్కొన్నారు. ఈనెల 6 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా, ఆ గడువు దాటితే అపరాధ రుసుము చెల్లించాలి. ఇక్కడే అసలు కథ మొదలైంది.

● ఇష్టానుసారం వసూలు

ప్రభుత్వం నిర్ణయించిన పరీక్ష రుసుము రూ.125 బదులు జిల్లాలోని అనేక ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారు. కొందరు తాము డీఈవో కార్యాలయంలో సిబ్బందికి ఇవ్వాల్సి ఉంటుందని చెబుతుండగా, మరి



కొందరు పరీక్షల వేళ మెయింటెనెన్స్ కోసం నిధులు సేకరిస్తున్నట్లు చెబుతున్నారు. ఇంకొందరైతే ఏకంగా మీ పిల్లలకు అనువైన పరీక్ష కేంద్రాన్ని కేటాయించేందుకు ఈ సొమ్ముతో ప్రయత్నం చేస్తామంటూ చెబుతున్నారు. ప్రభుత్వం గతానికి భిన్నంగా పారదర్శకంగా ఫీజు చెల్లించేందుకు ఈసారి నేరుగా హెచ్ఎంలకు అవకాశం కల్పించింది. అయితే కొన్ని పాఠశాలల్లో మాత్రం పాత ఆనవాయితీ కొనసాగిస్తూ నగదు వసూళ్లకు దిగుతున్నారు. జిల్లాలో పరీక్ష ఫీజు పేరుతో రూ.2వేల నుంచి రూ.4వేల వరకు వసూలు చేస్తుండడం గమనార్హం. ఇక్కడ కనీస ఫీజు రూ.వెయ్యికి తక్కువ ఉండడం లేదు. దీనిపై గట్టిగా మాట్లాడితే పరీక్షల వేళ పిల్లలను ఇబ్బంది పెడతారేమోననే భయంతో విద్యార్థుల తల్లిదండ్రులు మౌనం వహిస్తున్నారు. నిర్ణీత రుసుము కంటే ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ కమిషనర్, డీఈవో ఇప్పటికే సమావేశాల్లో హెచ్చరించారు. ఉల్లంఘించే ప్రైవేటు పాఠశాలలపై జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. అయినా క్షేత్రస్థాయిలో ఇందుకు భిన్నంగా ఉంది.

సమష్టిగా హెచ్ఐవీని నిర్మూలించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి ● ప్రతిభ చూపిన వారికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు




పాల్గొన్న అధికారులు, మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో హెచ్ఐవీ వ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, హెచ్ఐవీ నివారణ అధికారి, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి వెల్లడించారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా నెల్లూరులో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఇది గాంధీబొమ్మ నుంచి పురమందిరం వరకు సాగింది. అనంతరం టౌన్‌హాల్లో నిర్వహించిన సదస్సులో అధికారులు ఉపన్యసించారు. అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టటం ద్వారా హెచ్ఐవీపై ప్రజల్లో చైతన్యం తీసుకురావచ్చన్నారు. జిల్లాలో హెచ్ఐవీ తీవ్రత బాగా తగ్గిందన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోనూ హెచ్ఐవీకి సంబంధించి ఐసీటీసీ సెంటర్లు ఉన్నాయని, వాటిలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తారని, మందులు కూడా ఇస్తారని తెలిపారు. జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ హెచ్ఐవీ విషయంలో యువత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ నివారణలో ప్రతిభ చూపిన వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలకు ప్రతిభా పురస్కారాలు, జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ, ఎన్ఎస్‌పీ, పీఎంపీ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.


ఎంపికయిన అసోసియేషన్ కార్యవర్గం

ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లా అధ్యక్షుడు రాజేష్
కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వ ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరించేలా పాటు పడతానని నూతనంగా ఎంపికయిన జిల్లా ల్యాబ్ టెక్నీషియన్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు బీవీ. రాజేష్ అన్నారు. సోమవారం ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో కార్యవర్గ ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషయన్‌లు నేడు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వారి సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కిశోర్ సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, రాష్ట్ర మహిళా వింగ్ సహాయ కార్యదర్శి సుభద్ర ఎన్నికల పరిశీలకులుగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఎన్నికలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా ఎస్‌డి రసూల్ సాహెబ్, కోశాధికారిగా మహ్మద్ షఫీ, కార్యనిర్వాహక కార్యదర్శిగా మీరామొహిద్దీన్, మహిళా సహాయక కార్యదర్శిగా శాంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ, ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, ఏపీఎన్‌జీవో నగర అధ్యక్షుడు రామకృష్ణ, ఎన్‌హెచ్ఎం ప్రోగ్రాం అధికారి సునీల్‌కుమార్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు సందానిబాషా పాల్గొన్నారు.

'రాళ్లపాడు' వద్దే అధికారుల మకాం


రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద డీఈలు, ఏఈలతో, మాట్లాడుతున్న ఈఈ మునిరత్నం

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద అధికారులు అప్రమత్తమయ్యారు. భారీ వర్షాలు కురిసి ప్రాజెక్టులోకి వరద వస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిస్థితులను అధిగమించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇందుకోసం ఆదివారం రాత్రి నుంచి ఈఈ మునిరత్నం, డీఈలు ఎం.వెంకటేశ్వర్లు, పీవీ.శేషయ్య, ఏఈలు బీ.మనోహర్, వినోద్‌కుమార్, సిబ్బంది ప్రాజెక్టు వద్దే మకాం వేశారు. సోమవారం ఈఈ మాట్లాడుతూ ప్రాజెక్టు ఎగువ భాగాన భారీ వర్షాలు కురిసి ప్రాజెక్టులోకి వరద నీరు వస్తే గేట్లు ఎత్తి నీరు మన్నేరుకు విడుదల చేస్తామని చెప్పారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 20 అడుగుల మేరా నీరు ఉన్నట్లు తెలిపారు. ప్రాజెక్టు కుడి కాలువ తూము గేటును దించి కేవలం 10 క్యూసెక్కుల నీటిని మాత్రమే కాలువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రాజెక్టు ఆయకట్టు చెర్మన్ ఏలూరి వెంకటేశ్వర్లు, చీమలపెంట, పూరేటిపల్లి నీటి సంఘాల అధ్యక్షులు ఉన్నం సుబ్బారావు, ఏ వెంకటేశ్వర్లు తదితరులు అధికారులతో కలసి ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్నారు.

వీఆర్వో సంతకం ఫోర్జరీ

అనంతసాగరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అధికారుల సంత కాలను ఫోర్జరీ చేసి నకలీ పత్రాలతో రిజిస్ట్రేషన్‌కు ఉప్రకమిస్తూ అడ్డంగా దొరికిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల మేరకు... మండలంలోని వరికుంటపాడు, ఉప్పలపాడు గ్రామాలకు వీఆర్వోగా జగదీష్ అనే వ్యక్తి విధులు నిర్వహిస్తున్నాడు.

అయితే వరికుంటపాడుకు చెందిన ఒక వ్యక్తి వీఆర్వో సంతకంతో భూమి పత్రాలు రిజిస్ట్రేషన్ చేసేందుకు శని వారం ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ అధికారికి అనుమానం కలిగి సంబంధిత వీఆర్వోకి ఫోన్ చేసి సంత కాలు చేసిన విషయంపై ఆరాతీయగా తాను చేయలేదని చెప్ప డంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగిపోయింది. ఈ విషయాన్ని వీఆర్వో తహసీల్దారు జయవర్ధన్‌రెడ్డికి తెలపగా ఆయన సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గంజాయి డాన్ కామాక్షి ఇల్లు ధ్వంసం

● స్థానికుల ఆగ్రహానికి నేలమట్టం

నెల్లూరురూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : గంజాయి ముఠాకు నాయకురాలుగా వ్యవహరిస్తూ, సీపీఎం నాయకుడు పెంచలయ్యను హత్య చేయించిన కల్లూరుపల్లికి చెందిన అరవ కామాక్షి ఇంటిని సోమవారం రాత్రి స్థానికులు నేలమట్టం చేశారు. ఆర్డీటీ కాలనీలో ప్రజానాయకుడిగా, చెడుఅలవాట్లపై నిత్యపోరాటం కొనసాగిస్తూ వచ్చిన పెంచలయ్యను హతమార్చిన ఘటనతో ఆగ్రహించిన స్థానికులు కామాక్షి, ఆమె కుటుంబీకులు, సన్నిహితులు, అనుచరులకు చెందిన ఇళ్లను నేలమట్టం చేశారు. కామాక్షితో పాటు ఆమె అనుచరులతో తాము ఎంతగానో ఇబ్బందులు పడుతున్నామని, యువతను పనికట్టుకుని చెడకొడుతున్నారని ఆరోపించిన వారంతా మహిళలకు రక్షణ లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కామాక్షి ముఠా ఇక తమ ప్రాంతానికి రాకూడదని పేర్కొన్నారు. ఈ ఘటనతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది.

ప్రమాదాలకు నిలయంగా లో లెవల్ వంతెన



ఉదయగిరి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాయిపేట గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై నిర్మించిన లోలెవల్ వంతెన ప్రమాదాలకు నిలయంగా మారింది. ఉదయగిరి, వరికుంటపాడు మండలాలకు చెందిన ఎంతో మంది నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరికి పలు రకాల పనులపై పరుగులు తీస్తుండడంతో ఆ రహదారి నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ఎలాంటి ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందోనని బెంబేలెత్తిపోతున్నారు. అప్పట్లో వంతెనకు ఇరువైపులా రక్షణగోడలు నిర్మించక పోవడంతో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలకు గురికావల్సి వస్తుందని వాపోతున్నారు. అంతేగాక రహదారి కింది భాగం సైతం లోతుగా ఉండడంతో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కనీసం ఎలాంటి హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.